

శిల్లాంగ్: కుషలయ పర్యటనకు కాంగ్రెస్ అభిమాని, ఒక శతాధిక వృద్ధురాలితో రాహుల్‌గాంధీ

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com Journalism first!

సంపుటి: 62 • సంచిక: 22 • గురువారం 1 ఫిబ్రవరి 2018 • విజయవాడ ❋ పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ పాడ్యమి సా. 5.29 వరకు, అనంతరం విదియ; నక్షత్రం: ఆశ్లేష సా. 5.08 వరకు, అనంతరం మఖ; అమృతకాలం: మ. 3.45 నుండి 5.15 వరకు; వర్జ్యం: ఉ. 6.20 వరకు, తె. 4.37 నుండి 6.08 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు;




మోడీ ఎన్నికల బడ్జెట్ నేడే

• ఆర్థికలోటు పెను సవాల్ • కల్లోల స్థితిలో గ్రామీణ భారతం • ఉపాధికోసం యువత ఎదురుచూపు • అభివృద్ధికి ఊతమా? సంక్షేమ బాటా?

మరికొన్ని గంటల్లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ మోడీ ప్రభుత్వానికి అగ్నిపరీక్ష కానుంది. అనేక సవాళ్లు పొంచి ఉన్నాయి. గత నాలుగేళ్లగా అన్ని రంగాలను ఊరిస్తూ వస్తున్నా, పెద్దగా చేసిందేమీ లేదన్న అభిప్రాయం సర్వత్రా నెలకొని ఉంది. రైతు భారతం తీవ్రంగా దెబ్బతింటే, ఉపాధి అవకాశాలు కొరవడి యువత తీవ్ర ఆగ్రహంతో రగులుతోంది. ఒకపక్క ద్రవ్యలోటును తగ్గించడం ప్రథమ కర్తవ్యం. మరోపక్క అంతర్జాతీయ పెట్టుబడు దారులను, రేటింగ్ సంస్థలను ఆకర్షించాల్సి ఉంది. ఇక ముంచుకొస్తున్న ఎన్నికల దృష్ట్యా, భారీ తాయిలాలతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలి. ఇవన్నీ ఒకే పద్దుతో సాధించడం అంత తేలిక కాదు! ఏం చేస్తారా అని దేశీయ వర్గాలే కాకుండా, అంతర్జాతీయ సంస్థలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. సమతూకాన్ని పాటించడం మోడీ-జైట్లీ ద్వయానికి కత్తిమీదసామే! గత నాలుగేళ్లలో వృద్ధిరేటు అతి తక్కువ స్థాయికి దిగజారి పోయింది. సత్వరం పకడ్బందీ ప్రణాళికలతో ఊపిరిలూదకపోతే వర్తమానం కంటే భవిష్యత్ మరింత ఘోరంగా ఉంటుంది. ఈ తెలివిడి విత్తమంత్రికి లేకపోలేదు! అయితే, మోడీ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచిన యువతను శాంతింపచేయడంతోపాటు రైతాంగాన్ని స్వాంతనపరచడం కూడా తప్పనిసరి! ఈ నేపథ్యంలో ద్రవ్య గణాంకాలతో కుస్తీ అంత తేలిక కాదన్నది ఆర్థికవేత్తల అంచనా! కాని... గెలుపే లక్ష్యంగా సాగుతున్న మోడీ దేశంలో అధికంగా ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంత పేదల లక్ష్యంగానే బడ్జెట్ ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు... 2014లో మోడీ ప్రధాని పీఠాన్ని అధిరోహించినప్పుడు ముడిచమురు అంతర్జాతీయ మార్కెట్‌లో 120 డాలర్లు ఉంది. అదే సంవత్సరం అనూహ్యంగా 40 డాలర్లకు దిగవచ్చింది. దీంతో విదేశీ మారకద్రవ్యం కలిసివచ్చింది. ఇంకేముంది అచ్చేదిన్ వచ్చేస్తున్నాయని ఊదరగొట్టేశారు. 2017 వచ్చింది. అంతర్జాతీయంగా వృద్ధి రేటు పెరుగుతుంటే, భారత్ వృద్ధి శాతం దిగజారుతూ వచ్చింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ ఘాతంతో మరింత కుదేలైంది. దీంతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం కాస్తా చైనా కంటే వెనుకబడిపోయింది. కాని, 2018-19 నుంచి మళ్లీ పుంజుకుం టుందని ఆర్థిక సర్వే స్పష్టం చేస్తోంది. అంటే ఎన్నికల వేళ మోడీకి కలిసొచ్చి గెలుపు నడిచి వస్తుందని రాజకీయ విశ్లేష కులు అంచనాలు కడుతున్నారు.

వివరాలు 5లో...





విజయవాడలో కనకదుర్గమ్మ గుడి మీదుగా కనువిందు చేసిన చంద్రగ్రహణ దృశ్యాలు

• ఆకట్టుకున్న చంద్రగ్రహణం
• చూపరుల పరవశం
• రంగు రంగుల్లో దర్శనం
• సా. 5.18కి ప్రారంభమై రాత్రి 8.41కు పరిసమాప్తం
• టెలిస్కోప్, బైనాక్యులర్ల ద్వారా వీక్షణ

అమరావతి, ఆంధ్రప్రభ : ఆకాశంలో అరుదైన అద్భుతం ఆవిష్కృతమైంది. ఎన్నో ఏళ్ల తర్వాత అద్భుతమైన రీతిలో సంభవించిన సంపూర్ణ చంద్ర గ్రహణం చూపరులను ఆకట్టుకున్నది.ఆలోచింపజేసింది. బుధవారం రాత్రిఈ అద్భుతం చూపరులకు కనువిందు చేసింది. శ్రీహరికోటలోను ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ చంద్రగ్రహణం అందర్నీ మంత్ర ముగ్ధుల్ని చేసి, ఆలోచింపజేసిందనడంలో కూడా అతిశయోక్తి లేదు. పండు వెన్నెలను పంచే చంద్రుడు గ్రహణం కారణంగా రంగుల్లో రంగుల్లో దర్శనమిచ్చి,అందర్నీ అబ్బుర పర్చాడు. వాస్తవానికి ముందుగా దీనికి సంబంధించి ఎన్నో అనుమానాలు ప్రచారం జరిగాయి. చూస్తే అరిష్టమని,నష్టమంటూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం జరిగింది. అయితే నాస్తికవాదులు, జన విజ్ఞాన వేదిక వారు మాత్రం అవన్నీ ఒట్టివేనని కొట్టిపారేసి,అందరూ స్వేచ్ఛగా చంద్రగ్రహణాన్ని చూడవచ్చని తేల్చిపారేశారు.దీంతో చాలా చోట్ల అధిక సంఖ్యలో జనం బయటకు వచ్చి, చంద్రగ్రహన్ని వీక్షించడం గమనార్హం. అయితే కొంతమంది మాత్రం భయపడి గ్రహనాన్ని చూడడానికి వెనుకడుగువేశారు. ఇంట్లోంచి బయటకు రాలేదు. ముఖ్యంగా గర్భిణీలు,వృద్ధులు కొద్దిగా భయపడి,చూడలేదనే ప్రచారం ఉంది. ముందుగా ప్రచారం జరిగినట్లే చంద్రుడు గ్రహణం

8వ పేజీలో...



• చైనా, పాక్‌ల నుంచి పొంచి ఉన్న ముప్పు • అలుసుగా మారుతున్న భారత్ శాంతి మంత్రం • రక్షణ రంగానికి కేటాయింపులు పెంచాలి • ఆధునిక ఆయుధాలను సమకూర్చుకోవాలి • సైనిక, వాయు, నావికాదళ సంపత్తిని పెంచాలి • రక్షణ రంగ నిపుణుల సూచనలు



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

రక్షణకు అర్థం మారింది. ఒకప్పుడు రక్షణంటే శత్రువుల భారి నుంచి మనల్ని మనం కాపాడుకోవడం. కానీ ఇప్పుడు రక్షణంటే శత్రువు దాడి చేసేవరకు ఆగకుండా దాడికి పాల్పడే అవకాశం ఉన్న వారిపై ఎదురుదాడి చేసి పీచమణిచేయడం. భారత్ ప్రపంచంలో గొప్ప ఆర్థికశక్తిగా మారుతోంది. అదే సమయంలో భారత్‌కు సరిహద్దు దేశాల్నుంచి దాడుల ముప్పు కూడా పెరుగుతోంది. భారత్ శాంతికాముక దేశం. చరిత్రలో ఏనాడూ ఏ దేశంపైన భారత్ దండెత్తలేదు. దీంతో తనను తాను రక్షించుకునేందుకనువైన కొద్దిపాటి ఆయుధాలుంటే సరిపోయేది. కానీ ఇప్పుడు ఆర్థికంగా ఎదుగుతున్న భారత్ పట్ల పలు దేశాల్లో ఈర్ష్య పెరిగింది. ముఖ్యంగా చైనా, పాక్‌లు ఎప్పుడు ముట్టడి చేద్దామా అని కాచుకునున్నాయి. ఈ రెండు దేశాలు రక్షణ వ్యవస్థల్ని అత్యంత పటిష్టంగా మలచుకుంటున్నాయి. అందొచ్చిన అత్యాధునిక రక్షణ

3వ పేజీలో...

శరవేగంగా నిర్మాణాలు!




• తొలుత సచివాలయ నిర్మాణం... ఐటీ టవర్లు • వచ్చే ఏడాదికి హెచ్ఓడీ కార్యాలయాలు • నీరుకొండపై 108 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం • విజయవాడలో సంతోష నగరాల సదస్సు • ఏపీసీఆర్డీఏ సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : రాజధానిలోని పాలనా నగరంలో తొలుత సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయ భవనాలు, ప్రభుత్వ ఆవాసాలను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. పరిపాలన నగరంలో చేపట్టే అన్ని నిర్మాణాలలో మొట్టమొదటి ప్రాధాన్యంగా ఈ మూడు ప్రాజెక్టులను పూర్తి చేసి వచ్చే ఏడాదిలోనే వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియజేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థ సమావేశంలో రాజధానిలో చేపట్టిన రహదారులు, పరిపాలన నగర శాశ్వత భవంతుల నిర్మాణాలు తదితర అంశాలతో పాటు, మెరీనా, ఐటీ టవర్లు, హెల్త్ స్ట్రీట్, కంటైనర్ హోటళ్ల వంటి ఎకనమిక్ డెవలప్మెంట్ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. అమరావతిలో వచ్చే ఏప్రిల్ లో జరగనున్న సంతోష నగరాల సదస్సు, 9 మాసాలలో పూర్తి చేయాల్సి ఉన్న ఇంటెరిమ్ హైకోర్టు నిర్మాణ ప్రణాళికపై కూడా ఈ సమావేశంలో చర్చించి కొన్ని ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. సచివాలయం, శాఖాధిపతుల భవంతుల నిర్మాణ ప్రణాళికలను నార్మన్ పోస్టర్ సంస్థ ఈ రాత్రిలోగా తమకు పంపుతున్నట్లు తెలియజేసిందని, వీటికి మార్చిలోగా

2వ పేజీలో...

ఔరా..!



గడువులోగా ప్రాజెక్టులు పూర్తికాకపోతే

భూములు వాపస్!

అమరావతి, ఆంధ్రప్రభ: ఏ ప్రాజెక్టులు అయినా నిర్ణయించి సమయానికి పూర్తి కాకపోయినట్లయితే వారికి ఇచ్చిన భూములను తప్పనిసరిగా వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ఆదేశించారు. గిరిజన ప్రాంతాలలో ఏమైనా ప్రాజెక్టులు గిరిజనేతరులు చేపట్టడానికి నిబంధనలు అనుమతించనందువల్ల ప్రభుత్వ ఆధ్వర్యంలో సొసైటీలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర టూరిజం బోర్డు ఏర్పాటు మహేంద్ర సంస్థకు స్థలం కేటాయింపు తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లిలో పర్యాటక ప్రాజెక్టు, అక్కడ ఐల్యాండ్ పలు పర్యాటక ప్రాజెక్టులు ఏపీటీడీసీ ప్రాజెక్టులు, అరవపల్లి, కుప్పం, తోటకొండ, ఎర్రకాలు భూముల కేటాయింపు తదితర పలు అంశాలను కేబినెట్ ఉపసంఘంలో చర్చించామని తెలిపారు. కాగా ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన జరిగిన

8వ పేజీలో...

• ఆర్థికమంత్రి యనమల



అవినీతి వాణిజ్య లక్ష్మి అక్రమాస్తుల ప్రసాదం!

• వాణిజ్య పన్నుల కమిషనర్ ఆస్తులపై ఏసీబీ దాడులు • ఏకకాలంలో తెలుగు రాష్ట్రాల్లో 20 చోట్ల సోదాలు • గుర్తించిన అక్రమ ఆస్తులు రూ.130 కోట్లు • ప్రధాన ప్రాంతాల్లో విలువైన ప్లాట్లు • శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో భూములు



లక్ష్మీప్రసాద్



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ గెడ్డపు లక్ష్మీప్రసాద్ ఆస్తులపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులున్నట్లు ఆరోపణలు రావడంతో బుధవారం ఉదయం నుంచి ఏసీబీ అధికారులు ఏకకాలంలో 20చోట్ల సోదాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని విజయవాడ, హైదరాబాద్ లోని లక్ష్మీప్రసాద్ నివాసాలతో పాటు గుంటూరు, శ్రీకాకుళం, విశాఖపట్టణం, హైదరాబాద్‌లోని బంధువులు, స్నేహితుల నివాసాల్లో జరిపిన సోదాల్లో రూ.130 కోట్లకు పైబడి ఆస్తులున్నట్లు అధికారులు గుర్తించారు. ఒక్క హైదరాబాద్‌లోనే రెండో భార్య మల్లిక నివాసం సహా ఎనిమిది చోట్ల తనిఖీలు నిర్వహించారు. గతంలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వద్ద ఓఎస్‌డీగా పని చేసిన లక్ష్మీప్రసాద్ 2006 నుంచి 2011 కమిషనర్ కార్యాలయంలో కీలక బాధ్యతలు నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు. ఆ సమయంలో ఆయన భారీ అవినీతికి పాల్పడినట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు అన్ని ఆధారాలు సేకరించి రంగంలోకి దిగారు. అడ్డగోలు సంపాదనతో పలు నివాస, వాణిజ్య భవనాలు నిర్మించుకోవడమే కాక

8వ పేజీలో...

అరెస్టు ఆపడం కుదరదు

• గెజిటెడ్ సంఘానికి చుక్కెదురు

8లో

(మొదటిపేజీ తరువాయి)

టెండర్లను పిలిచి పనులు ప్రారంభిస్తున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ముఖ్యమంత్రికి వివరించారు. హైకోర్టు భవంతి ఆకృతులు, నిర్మాణ ప్రణాళికలు ఫిబ్రవరి 4 లేదా 5వ తేదిలోగా రానున్నాయని తెలిపారు. శాసనసభ భవంతి ఆకృతులు మరో రెండు వారాలలో వస్తాయని చెప్పారు. వచ్చే అక్టోబఢ్ నాటికి ప్రభుత్వ ఆవాసాలు మొత్తం సిద్ధం కానున్నాయని సీఆర్డీఏ కమిషనఢ్ చెప్పారు. వచ్చే అక్టోబర్ నాటికి ప్రభుత్వ ఆవాసాలు మొత్తం సిద్ధం కానున్నాయని సీఆర్డీఏ కమిషనర్ చెప్పారు. మొత్తం పది ప్రదేశాలలో 69 టవర్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నట్లు తెలిపారు. శాసనసభ్యులు, అఖిల భారత సర్వీస్ అధికారులకు 18 టవర్లలో 144 ఫ్లాట్లు, ఎన్జీవోలకు 22 టవర్లలో 1968 ఫ్లాట్లు, టైప్ 1,2 అధికారులు, గ్రూప్ డి ఉద్యోగులకు 21 టవర్లలో 1440 ఫ్లాట్లను నిర్మిస్తున్నామని తెలిపారు. వీటన్నింటికీరాఫ్ట్స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం నిర్మించే రెసిడెన్షియల్ టవర్స్ అన్నింటిలో క్లబ్ హౌస్‌తో పాటు ఖచ్చితంగా స్విమ్మింగ్ పూల్ కూడా ఉండాలని సీఎం చెప్పారు. అమరావతిలో పనిచేసే ఉద్యోగులు, అధికారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని, స్విమ్మింగ్, సైకిలింగ్ వంటి మంచి అలవాట్లలో వారి జీవనశైలిలో తప్పక మార్పు వస్తుందని అన్నారు. అమరావతిలో ఐటీ కంపెనీల కోసం ఆఫీస్‌స్పేస్ నిర్మాణాలను చేపట్టడానికి సీఆర్డీఏ ప్రతిపాదనలను సిద్ధం చేసి ముఖ్యమంత్రి ముందుంచింది. ముందుగా సీఆర్డీఏ ఈ ప్రాజెక్టును చేపడుతుంది. తర్వాత చేపట్టే నిర్మాణాలను అభివృద్ధిదారుకు అప్పగిస్తారు. ప్రభుత్వం రూపొందించిన ఐటీ పాలసీకి అనుగుణంగా వీటి నిర్మాణాన్ని చేపడుతున్నారు. తొలుత 10 లక్షల చదరపు అడుగుల మేర జంట భవంతుల నిర్మాణాన్ని చేపడతారు. 42 ఐటీ సంస్థల నుండి 5లక్షల చదరపు అడుగుల వరకు ఆఫీస్ స్పేస్ కావాలని రిక్వయిర్‌మెంట్ వచ్చిందని, మరో 5లక్షల చ.అ కోసం సంప్రదింపులు చేస్తున్నారని అధికారులు చెప్పారు. ఐటీ టవర్లలో మొదటి దశ నిర్మాణాన్ని 12 మాసాలలో, రెండవ దశను 24నెలల్లో పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌తో వీటిని నిర్మించాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. మొత్తం రూ. 90.6 కోట్ల ఆదాయం సమకూరవచ్చునని భావిస్తున్నారు. పరిపాలన నగరం మధ్యభాగంలో 7 ఎకరాలలో నిర్మించే సిటీ స్క్వేర్ కు ఒకవైపు స్టేడియం, మరోవైపు కన్వెన్షన్ సెంటర్ నిర్మించే ప్రతిపాదనలను ముఖ్యమంత్రి ముందు ఉంచగా, స్టేడియం అక్కడ కాకుండా స్పోర్ట్స్ సిటీలోనే నిర్మించాలని ఆయన సూచించారు.

ఇంటెరిమ్ హైకోర్టు భవనం

ఇంటెరిమ్ హైకోర్టు భవంతి నిర్మాణ ప్రణాళికపై ఈ సమావేశంలో సీఆర్డీఏ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 4. ఎకరాల్లో ఇంటెరిమ్ హైకోర్టు భవన నిర్మాణం జరగనుంది. 1.8 లక్షల చదరపు అడుగులలో గ్రాస్ ఫ్లోర్ ఏరియా ఉంటుంది. జీ ప్లస్ 2 పద్ధతిలో భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. ప్రధాన న్యాయమూర్తి కోసం 2వేల చదరపు అడుగులలో కోర్టు రూమ్, 1200 చదరపు అడుగుల విస్తీర్ణంలో చాంబర్ నిర్మిస్తారు. మరో వెయ్యి చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో 18 కోర్టు హాళ్లు, 600 చదరపు అడుగుల చొప్పున న్యాయమూర్తుల చాంబర్లు ఉంటాయి. దీనికి రూ. 108 కోట్ల వ్యయం కాగలదని అంచనా వేశారు. 6 నుండి 8 మాసాల వ్యవధిలో మొత్తం నిర్మాణం పూర్తిచేస్తామని సీఆర్డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ చెప్పారు.

శరవేగంగా నిర్మాణాలు!

విపత్తుల్లో ఉపశమన చర్యలపై దృష్టి సారించాలి

సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజిమెంట్ ఆథారిటీ చైర్మన్ సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజిమెంట్ ఆథారిటీ చైర్మన్ సీఎం చంద్రబాబు స్టేట్ డిజాస్టర్ మేనేజిమెంట్ ప్లాన్, డిస్ట్రిక్ట్ డిజాస్టర్ మేనేజిమెంట్ ప్లాన్స్, లైన్ డిపార్ట్‌మెంట్ల డిజాస్టర్‌మేనేజిమెంట్ ప్లాన్స్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజిమెంట్ ఆథారిటీ లోగోను ఆమోదించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఈ డిజాస్టర్ ప్లాన్స్‌ను అమలు చేస్తూ విపత్తుల ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలన్నారు. విపత్తులు సంభవించినప్పుడు ఉపశమన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్, ఫైర్ పోలీస్, ట్రాన్స్ పోర్ట్ ఇలా మిగిలిన ఇన్ని శాఖలు కలిసి పనిచేసి విపత్తుల ప్రమాదస్థాయిని తగ్గించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, కెమికల్ డిజాస్టర్స్ లాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భూకంపాలపైన సరైన పరిశోధనలు జరపాలన్నారు. వేసవి కాలం వడగాలులు యాక్షన్‌ప్లాన్ అమలు చేసి ప్రజలకు సమాచారం ఇస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలకు అన్ని విపత్తుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ స్టేట్ డిజాస్టర్ మేనేజిమెంట్ ఆథారిటీ కమిటీ సభ్యులు, డిజాస్టర్ మేనేజిమెంట్ కమిషనర్ ఎం.వి.శేషగిరిబాబు, విపత్తుల నిర్వహణ శాఖాధికారులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పుంజుకోవాలి

అమరావతి నగర నిర్మాణం ఇక వేగం పుంజుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాజధానిలో 85 కి.మీ మేర నిర్మిస్తున్న రహదారి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీపార్థసారధి ముఖ్యమంత్రికి వివరించారు. అనంతవరం కొండప్రాంతం నుండి



గ్రావెల్ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. వైకుంఠపురంలో ప్రతిపాదిత రిజర్వాయఢ్ నిర్మాణానికి గ్రావెల్ అవసరమైనప్పుడు కొండవీటివాగు నుండి వచ్చే గ్రావెల్‌ను వినియోగించుకోవచ్చన్నారు.

నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహం

అమరావతిలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎత్తయిన కొండపై 108 అడుగుల ఎత్తున ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై అధికారులు ఈ సమావేశంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. రాజధానిలో అంబేద్కర్ విగ్రహాన్ని 125 అడుగుల ఎత్తున ఏర్పాటు చేస్తున్నామని, శాఖమూరు ఉద్యానవనంలో భాగంగా 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న గాంధీ పార్కు పై ఈ సమావేశంలో వీడియో ప్రెజెంటేషన్ ప్రదర్శించారు. ఈ పార్కుకు గాంధీ టు మహాత్మా పార్కు అనే పేరు పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. గాంధీ పార్కుతో పాటు రాజధానిలో మరో రెండు ప్రాంతాలలో బాబూ జగజ్జీవన్ రామ్, జ్యోతిరావు పూలే పేరిట పార్కులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

అమరావతి మెరీనా

6 ఎకరాల విస్తీర్ణంలో అమరావతి మెరీనా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలించారు. బోట్లు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సెయిలింగ్ ట్రైనింగ్ సెంటర్, పవర్ బోటింగ్, ఫుడ్ కోర్టు, కన్వెన్షన్ సెంటర్ వంటి సదుపాయాలతో మెరీనా ఏర్పాటు చేస్తారు. పీపీపీ పద్ధతిలో దీని నిర్మాణాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

భవానీద్వీపంలో సంతోష నగరాల సదస్సు

ఏప్రిల్ 10 నుండి 12 వరకు మూడు రోజుల పాటు జరిగే సంతోష నగరాల సదస్సు ద్వారా మరోసారి అమరావతి ప్రాభవాన్ని ప్రపంచానికి చాటే అవకాశం దక్కిందని సీఎం అభిప్రాయపడ్డారు. సంతోష సూచికలో తొలి 50 స్థానాల్లో ఉన్న నగరాలకు లేఖలు రాయాలని ఆయన అధికారులను ఆదేశించారు. భూటాన్, సింగపూర్, యుఏఈలలో హ్యాపీనెస్‌కు ప్రత్యేక మంత్రిత్వ శాఖలున్నాయని, అదే విధంగా ప్రభుత్వం కూడా సంతోష సూచికను ప్రామాణికంగా తీసుకుందని ముఖ్యమంత్రి అన్నారు. సిల్కాన్ వ్యాలీ తరహాలో ఏపీకూడా ఒక ఇన్నోవేషన్ వ్యాలీగా అవతరించి వినూత్న ఆలోచనలకు వేదిక కావాలని ఆకాంక్షించారు. ఇన్నోవేషన్, ఇంకుబేషన్ స్టార్టప్ అంశాలల్లో ఏపీ ప్రపంచానికే రోల్ మోడల్ కావాలన్నారు. అమరావతి, విజయవాడకు మధ్యలో ఉన్న భవానీ ద్వీపంలో సంతోష నగరాల సదస్సు నిర్వహిస్తే బాగుంటుందనే అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తం అయింది. ఈ సదస్సుకు 2వేల మంది అతిధులు వస్తారని అంచనా వేస్తున్నట్లు అధికారులు సీఎంకి వివరించారు. వీరందరికీ విజయవాడ, గుంటూరు నగరాల్లో, అవసరమైతే భవానీ ఐలాండ్‌లో వసతి కల్పించాలని ఆదేశించారు.

క్లౌడ్ హబ్‌గా ఏపీ

● విశాఖలో ఇంటర్నెట్ ల్యాండింగ్ పాయింట్
● మినీ క్లౌడ్ సెంటర్ ఏర్పాటులో పెట్టుబడులు పెట్టాలి
● గూగుల్ క్లౌడ్ ప్రతినిధులతో మంత్రి లోకేష్



గూగుల్ క్లౌడ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి లోకేష్ భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ: విశాఖ, అండమాన్, సింగపూర్‌లను కలుపుతూ ఇంటర్నెట్ ల్యాండింగ్ పాయింట్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. బుధవారం శాన్ ఫ్రాన్సిస్కోలో గూగుల్ క్లౌడ్ కంపెనీ, గూగుల్ ఇండియా పాలసీ టీంతో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. మాట్లాడుతూ రాబోయే కాలంలో క్లౌడ్ సర్వీసెస్, ఐటీకు పెద్ద ఎత్తున డిమాండ్ పెరగబోతుందని, ఏపీని క్లౌడ్ హబ్‌గా మార్చేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్లౌడ్ సెంటర్లను ఆకర్షించేందుకు క్లౌడ్ హబ్ పాలసీ తీసుకొచ్చామని, ఈసెంటర్ల ఏర్పాటుకు మౌలిక వసతులు కల్పిస్తు న్నామన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా, నీరు అందిస్తున్నామని, భూమిని త్వరితగతిన కేటాయిస్తున్నామన్నారు. విశాఖలో ఇంటర్నెట్ ల్యాండింగ్ పాయింట్ ఏర్పాటు చేయబోతున్నామనన్నారు. క్లౌడ్ లో ఉంచే డేటా అనలిటిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిచడానికి ఉపయోగించా లనుకుంటున్నట్లు తెలిపారు. దీనికి గూగుల్ క్లౌడ్ సహకారం కావాలని, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మెషీన్ లెర్నింగ్‌లో గూగుల్ ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పనిచేయ్యాలన్నారు. మినీ క్లౌడ్ క్లస్టర్లు ఏర్పాటు, క్లౌడ్ సెంటర్ల ఏర్పాటులో ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గూగుల్ క్లౌడ్ టీం మాట్లాడుతూ త్వరలోనే ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని వివిధ రంగాల్లో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. త్వర లోనే ఏపీకి ప్రత్యేక బృందాన్ని పంపిస్తామన్నా మని, డేటా సెంటర్ల ఏర్పాటును పరిశీలిస్తామని ఫేస్‌బుక్ ప్రతినిధులు మంత్రి లోకేష్‌కు తెలిపారు.

క్యాడెన్ కంపెనీ ప్రెసిడెంట్ అనిరుద్, సీఈఓ లిప్ భ్యూటాన్‌తో భేటీ

సెమీ కండక్టర్స్ త్రీడీ ఐసి డిజైన్, అడ్వాన్స్డ్ నోడ్, ఆటోమోటివ్, ఫోటానిక్స్, ఆర్మ్ బేస్డ్ సొల్యూషన్స్, చిప్ డిజైన్ తయారీలో ఉన్న క్యాడెన్ కంపెనీ ప్రెసిడెంట్ అనిరుధ్, సీఈఓ లిప్ భ్యూటాన్‌తో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెక్నాలజీ సహాయంతో గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఏరియల్ ఫైబర్ గ్రిడ్ ఏర్పాటు చేసి వివిధ సేవలు అందిస్తున్నామన్నారు. టెక్నాలజీ అనుసంధానంతో 15శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఎలక్ట్రానిక్ తయారీ రంగాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామన్నారు. మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్‌ని పెద్ద ఎత్తున ప్రమోట్ చేస్తున్నామని, ఫ్యాక్స్ కాన్, సెల్ కాన్, డిక్సన్, కార్బన్ లాంటి మొబైల్ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద కార్ల కంపెనీల్లో ఒకటైన కియా మోటార్స్‌తోపాటు ఇసుజు, అపోలో టైర్స్ రాష్ట్రానికి వచ్చాయన్నారు. ప్రస్తుతం తయారీ రంగంలో 15శాతం వృద్ధి సాధించామని, 32శాతం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో యువతి, యువకులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అందుకు మీ సహకారం కావాలన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానంలో ఉన్నామని, ఎలక్ట్రానిక్ తయారీ కంపెనీల ఏర్పాటుకు మౌలికవసతులు కల్పిస్తున్నామని, అనేక పాలసీలతోపాటు రాయితీలు కల్పిస్తున్నట్లు వివరించారు. క్లౌడ్ సెంటర్ల ఏర్పాటు కోసం ప్రత్యేక పాలసీ తీసుకొచ్చామని, ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీఈఓ లిప్ భ్యూటాన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆర్థిక వ్యవస్థ అంతా డేటాపై ఆధారపడి ఉంటుందని, చిప్ డిజైన్ యూనివర్సిటీ, ఇంక్యుబేటర్ ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. ఏపీలో కార్యకలాపాలు విస్తరించే అంశంపై అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు.

నూతన టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్టులు చేపట్టండి

● ఫైబర్‌గ్రిడ్‌తో ఫేస్‌బుక్ విస్తరణ ● ఫేస్‌బుక్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ భేటీ



అమరావతి, ఆంధ్రప్రభ: గ్రామీణ ప్రాంతాలతోపాటు, ఇంటిలో తయారు చేసే ఉత్పత్తులను ఫైబర్ నెట్ ద్వారా ప్రపంచానికి తెలియజేసే అవకాశం ఉందని, రాష్ట్ర ప్రయాణం మొదలైనప్పుడు ఇంటర్నెట్ సేవలు అంతగా అందుబాటులో లేవని, ఇప్పుడు ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నామని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. బుధవారం శాన్ ఫ్రాన్సిస్కోలోని ఫేస్‌బుక్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి అక్కడి ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఫేస్‌బుక్ కంపెనీలో జరగుతున్న పరిశోధన, అభివృద్ధి, అధునాతన ఉత్పత్తులు, అధునాతన టెక్నాలజీల గురించి ఫేస్‌బుక్ సిబ్బంది మంత్రికి వివరించారు. సోలార్ ఎయిర్ క్రాఫ్ట్(అక్విలా) ద్వారా మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలు అందించడం, ఫిక్స్డ్ వైర్ లెస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా పట్టణాల్లో ఇంటర్నెట్ సేవలు, మొబైల్ కనెక్టివిటీ కోసం టెలికాం ఇన్ఫ్రా ప్రాజెక్ట్, ఎక్స్‌ప్రెస్ వైఫై ద్వారా గ్రామాల్లో వేగమైన వైఫై సేవలు అందించే టెక్నాలజీల గురించి ఫేస్‌బుక్ ప్రతినిధులు మంత్రి లోకేష్‌కు వివరించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ స్టార్టప్ రాష్ట్రంగా ప్రయాణం ప్రారంభించామని, ఫైబర్ గ్రిడ్ ద్వారా రూ.149కే ఇంటర్నెట్, వైఫై, టెలివిజన్ అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇంటర్ నెట్ ప్రాథమిక హక్కుగా మారే అవకాశం ఉందని, ఏపీలో ఫేస్‌బుక్ మరింతగా విస్తరించేందుకు ఫైబర్ గ్రిడ్ ఉపయోగపడుతుందని, నూతన టెక్నాలజీలతో కూడిన పైలెట్ ప్రాజెక్టులన్నీ ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టాలని కోరారు. తర్వాత ఫేస్‌బుక్ ప్రతినిధులు మాట్లా డుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని, తాము అభివృద్ధి చేస్తున్న టెక్నాలజీల అభివృద్ధికోసం ఆంధ్రప్ర దేశ్‌లో పైలెట్ ప్రాజెక్టులు చేస్తామన్నారు. సమావేశ అనంతరం 10ఎకరాల ఫేస్‌బుక్ ప్రధాన కార్యాలయంపై నిర్మించిన అతి పెద్ద రూఫ్ గార్డెన్‌ను మంత్రి లోకేష్‌కు ఫేస్‌బుక్ ప్రతినిధులు చూపించారు.

సవమాచారానికి భద్రత కల్పించడానికి చట్టాల్లో తీసుకురావాల్సిన మార్పులపై కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. పై డేటా సెంటర్ అమరావతిలో

సచివాలయంలో స్మార్ట్ సైకిళ్లు

అమరావతి, ఆంధ్రప్రభ: రాజధాని ప్రాంత కాలుష్య రహి తంగా ఉంచాలన్న నేపథ్యంలో సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం స్మార్ట్ సైకిల్ కేంద్రానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే సచివాల యంలో బ్యాటరీ కార్లు నడుస్తుండగా నేటి నుంచి స్మార్ట్ సైకిళ్లు చక్కర్లు కొట్టనున్నాయి. సచివాలయంలో రెండవ బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ సైకిల్ స్టాండుతో పాటు సైకిళ్లను సీఎం ప్రారంభించారు. స్టాండ్ నుంచి సీఎం కార్యాలయానికి సైకిల్‌పై వెళ్లారు. స్మార్ట్ కార్డు ద్వారా సైకిలు నడిపే విధానాన్ని సీఎంకు వివరించారు. స్మార్ట్ సైకిల్స్ స్టాండ్, సైకిల్ ఏర్పాటు పట్ల సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. పని ఒత్తిడితో ఉండే ఉద్యోగులకు మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. రాజధాని ప్రాంతంలో సైకిల్ ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం గుర్తు చేశారు. స్టాండ్ పరిసరాలలో మొక్కలు నాటి పచ్చదనం నింపాలని, ఆహ్లాదకర వాతా వరణం నెలకొల్పాలని అధి కారులకు సూచించారు. సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసి విద్యుత్ వాహనా లకు వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విజయవాడ, గుంటూరుల మధ్య ఇలాంటి సైకిళ్ళను ప్రవేశపెట్టే అంశాల్ని పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు.

నేడు ఐ కేంద్రాలు ప్రారంభించనున్న సీఎం

● గ్రామీణ ప్రాంతాల్లో 115 సీహెచ్‌సీల్లో కంటి వైద్య సేవలు
● సర్వీసు ప్రొవైడర్‌గా అపోలో



ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మరో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఐ కేంద్రాలను ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలుత 115 సీహెచ్‌సీల్లో ఈ కేంద్రాలను ముఖ్యమంత్రి గురువారం వీడియో లింక్ ద్వారా ప్రారంభించను న్నారు. ఈ కేంద్రాల ద్వారా కంటి సమస్యలతో రాష్ట్రవ్యాప్తంగా బాధపడుతున్న అనేక మందికి స్వాంతన చేకూరనుంది. ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతను అపోలో హెల్త్‌కేర్ సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. అయితే ఈ కేంద్రంలో పారా మెడికల్ అప్తాలామిక్ అసిస్టెంట్లు(పీఎంవో)లను ప్రభుత్వమే నియమిస్తుంది. టెలీ రేడి యాలజీ తరహాలోనే ఈ ప్రాజెక్టును కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ప్రభుత్వం ఒక్కొక్క రోగికి రూ.185లు అపోలోకు చెల్లిస్తుంది.

మేమొస్తే... రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్

● సీఎం నివాసమే అక్రమాల అడ్డా ● అక్కడే ఆయన సతీమణి జెండా వందనం ● బాబు విదేశాలకు వెళితే బావమరిది సీఎం కుర్చీలో కూర్చుంటారు ● అప్పుల ఆంధ్రాగా... అవినీతి రాష్ట్రంగా మార్చేశారు ● పొదలకూరు సభలో వైఎస్ జగన్



నెల్లూరు జిల్లా పొదలకూరు బహిరంగ సభలో ప్రసంగిస్తున్న జగన్

నెల్లూరు, ప్రభన్యూస్ బ్యూరో: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పుడూ నీతి, నిజాయతీ గురించి మాట్లాడుతుంటారని అయితే ప్రస్తుతం ఆయన ఉండే నివాసమే అక్రమ నివాసమని, అటువంటి నివాసంలో ఉండడమే తప్పైతే గణతంత్ర దినోత్సవం రోజు ఆయన సతీమణి అక్కడే జెండావందనం చేస్తున్నా రని, వీళ్ళా ప్రజలకు నీతులు చెప్పేది అంటూ వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా బుధవా రం ఆయన సర్వేపల్లి నియోజకవర్గంలోని మండల కేంద్రమైన పొదలకూరు బస్టాండు సెంటరులో ఏర్పాటుచేసిన బహిరంగసభలో మాట్లాడుతూ సీఎం బాబుపై మరోసారి ఘాటైన విమర్శలు చేశారు. పేదలు సంతోషంగా ఉన్నప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతున్నట్లని, వారు బాధల్లో ఉంటే అవినీతి జరుగుతున్నట్లే లెక్క అని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రస్తుతం రాష్ట్రానికి చంద్రగ్రహణం పట్టిందని అయితే చంద్రుడికి పట్టిన గ్రహణం రెండు గంటల్లోనే వీడినప్పటికీ రాష్ట్రానికి పట్టిన గ్రహణం పూర్తిగా వీడాలంటే మరో ఏడాది సమయం పడుతుందన్నారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా నారా చంద్ర బాబు నాయుడు బాధ్యతలు చేపట్టాక గడిచిన నాలుగు సంవత్సరాల్లో ఆయన సాధించిన ప్రగతి ఏమీ లేదన్నారు. కేవలం తెలుగుదేశం కార్యకర్తలకు, నాయకులకు కమీషన్లు అందే పనులనుమాత్రమే చేపట్టి అవినీతిలో బాబు రికార్డు సాధిస్తే ఆ పార్టీ నాయకులు దండకాల్లో గిన్నీస్‌బుక్ సాధించారన్నారు. ఆ డబ్బుతో వచ్చే ఎన్నికల్లో ప్రజలకు ఓటుకు మూడు వేల రూపాయలు ఇచ్చేందుకైనా వెనుకాడరని, అయితే సీఎం ఇచ్చే ఆ డబ్బు తీసుకోండి తప్పులేదు. అది మనదగ్గర వసూలు చేసిన సొమ్మే. అయితే ఆ ఎన్నికల్లో మాత్రం ఆయనకు తగిన గుణపాఠం చెప్పండి అంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాబు నల్లధనాన్ని దాచుకునేందుకు విదేశాలకు వెళితే సీఎం కుర్చీలో ఆయన బావమరిది బాలకృష్ణ కూర్చుంటారు. పవిత్రమైన విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి గుడిలో భిన్నమైన పూజలు చేస్తారు. పుష్కరాల్లో ప్రత్యేక ఘాట్‌లు ఏర్పాటు చేశామంటారు, బాబుకోసం ప్రత్యేకంగా మరోచోట పుష్కరఘాట్‌ను ఏర్పాటు చేస్తారు. అప్పటివరకు భక్తులందరినీ ఆపేస్తారు, బాబు స్నానం అయిపోయాక వారందరినీ ఒక్కసారిగా వదిలేస్తారు, ఫలితంగా 29 మంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఇది బాబు సాధించిన ప్రగతి.. అంటూ ఆయనపై జగన్ ఈ సందర్భంగా నిప్పులు చెరిగారు. రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకోవడంతో పాటు రాజ్యాంగ విరుద్ధంగా ఎమ్మెల్యేలను కొనుగోలుచేసి సిగ్గులేకుండా వారికి మంత్రి పదవులు కట్టబెట్టారు. ఇటువంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకుని మనం ముందుకు నడవాలా... అదేవిధంగా హెరిటేజ్ పేరుతో పాడి రైతులను సైతం బాబు మోసం చేస్తు న్నారన్నారు. ఇదేనా గడిచిన నాలుగు సంవత్సరాల్లో తెలుగుదేశం సాధించిన అభివృద్ధి అంటూ ఆయన ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రాగా, అవినీతి అమరావతిగా మార్చేసిన బాబు రైతులను పూర్తిగా గాలికి వదిలేశారన్నారు.

అంతేకాకుండా, వైకాపా అధికారంలోకి వస్తే రైతులకు గిట్టుబాటుధర కల్పించడంతో పాటు వడ్డీలేని రుణాలను అందిస్తామన్నారు. పగటిపూట ఉచితంగా 9 గంటలు విద్యుత్‌ని అందిస్తా మన్నారు. అలాగే కరువును ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయిస్తామన్నారు. అలాగే పంటను సాగుచేసుకునే ముందు పెట్టుబడి క్రింద ప్రతి రైతుకు రూ.12,500లు అందిస్తామన్నారు. పై సమావేశంలో ఎంపీలు మేకపాటి రాజమోహన్ రెడ్డి, వరప్రసాద్, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్ రెడ్డి, మేకపాటి గౌతమ్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, కలివేటి సంజీవయ్య, రాష్ట్ర నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం భూసేకరణపై ప్రతిపాదనలు రాలేదు

● రాష్ట్ర ప్రభుత్వం పంపిన తర్వాత కేబినెట్‌లో చర్చిస్తాం ● ఏపీ నేతలతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ● ముందుగా హామీల అమలుకు సహకరించాలని నేతల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం జరిపే భూ సేకరణ, పరిహారం, పునరావాసానికి సంబంధించి తమకు ఎటువంటి ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందలేదని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. బుధవారం తనను కలిసిన ఆంధ్రా నేతలతో ఆయన ఈ విషయం చెప్పారు. ఉత్తరాంధ్ర చర్చావేదిక పేరిట మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, అరకు ఎంపీ కొత్తపల్లి గీత సహా ఉత్తరాంధ్రకు చెందిన వివిధ ప్రజా సంఘాల



నేతలు ఢిల్లీలో గడ్కరీని ఆయన నివాసంలో కలిశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం అయ్యే పూర్తి ఖర్చును కేంద్రమే భరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తూ పునరావాసం కల్పించాలని కోరారు. నేతల విజ్ఞప్తిపై వెంటనే స్పందిస్తూ, ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ ఏడాది చివరినాటికల్లా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. భూ సేకరణపై స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ విషయంపై తమకు ఇంతవరకు ఎటువంటి నివేదికగానీ, ప్రతిపాదనగానీ అందలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వచ్చిన తర్వాత తాము కేంద్ర కేబినెట్ ముందుకు ఈ విషయాన్ని తీసుకెళ్తామని, అక్కడ చర్చించిన తర్వాతనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కేంద్ర కేబినెట్ నిర్ణయం సానుకూలంగానే ఉంటుందని గడ్కరీ భరోసా ఇచ్చారు. గడ్కరీ కంటే ముందు నేతలు మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌ను కలిశారు. ఆయన హయాంలో పాసైన విభజన చట్టంలో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ, వాటి సాధన కోసం తమకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

గడ్కరీతో భేటీ అనంతరం మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ... 2018 చివరి నాటికే ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేస్తామని కేంద్ర మంత్రి చెబుతున్నారని, అయితే ఇదెలా సాధ్యపడుతుందో అర్థం కాలేదని అన్నారు. స్పిల్ వే, స్పిల్ ఛానల్ పనులు పూర్తిచేయడానికి కనీసం రెండు సీజన్లు పడుతుందని, కానీ కేంద్ర మంత్రి చెబుతున్న ప్రకారం ఈ సీజన్లోనే పూర్తి చేయాల్సి ఉంటుందని అన్నారు. జనవరి నెల గడచిపోయింది కాబట్టి ఇక మిగిలింది 11 నెలల సమయం మాత్రమేనని, ఈలోపు ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేస్తే తమకంటే సంతోషించేవారు ఎవరుంటారని కొణతాల రామకృష్ణ వ్యాఖ్యానించారు. తాము ఆశావాదులమని, కేంద్ర మంత్రి చెప్పినట్టు 11 నెలల్లో పనులన్నీ పూర్తికావాలని కోరుకుంటున్నామని తెలిపారు. అలాగే కాంట్రాక్టర్ల మార్పు వంటి సాంకేతికాంశాలపై తాము దృష్టి పెట్టడం లేదని, తమకు ప్రాజెక్టు పూర్తి చేయడమే ముఖ్యమని కొణతాల అన్నారు. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు పరిహారం విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని కేంద్ర మంత్రి మాటల ద్వారా అర్థమవుతోందని అన్నారు.

రాజకీయాలకు అతీతంగా ఈ బృందంతో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన అరకు ఎంపీ కొత్తపల్లి గీత మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో అత్యధిక భూభాగం, జనాభా గిరిజనులు, ఆదివాసీలేనని అన్నారు. నిర్వాసితులుగా మారే జనాభాలో 70 శాతానికి పైగా ఉన్న గిరిజనులు, ఆదీవాసీల హక్కులు కాపాడుతూ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయాలని ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. పోలవరంతో పాటు విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ సహా ఉత్తరాంధ్ర ప్రజల డిమాండ్లను తాము కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆమె వ్యాఖ్యానించారు.

కమీషన్లు, వాటాల సంగతి తేల్చుకోండి: కేవీపీ వ్యాఖ్యలు

ఉత్తరాంధ్ర చర్చావేదికతో పాటు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన బృందంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు డా. కేవీపీ రామచంద్రరావు, భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కాంట్రాక్టర్ల మార్పు, ధరల మార్పు, డిజైన్ల మార్పు సంగతెలా ఉన్నా, కేంద్ర రాష్ట్ర నేతల మధ్య కమీషన్లు, వాటాల బేరసారాల విషయంలో స్పష్టత వచ్చిందని అన్నారు. ఇంతకాలం ఆ స్పష్టత లేకనే ప్రాజెక్టు నిర్మాణం ఆగిందని వ్యాఖ్యానించారు. కమీషన్లు, వాటాల గురించి తాము పెద్దగా పట్టించుకోమని, సకాలంలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తే అదే గొప్ప మేలు అని అన్నారు. కమీషన్లు, వాటాల్లో ప్రజాధనం భారీగా వృథా అవుతుంది కదా అన్న విలేకరుల ప్రశ్నకు సమాధానమిస్తూ.. "నువ్వూ, నేనూ కలిసి ఈ వృథాను అరికట్టలేం. మనకు కావాలసింది పోలవరం నిర్మాణం మొదలుపెట్టి అనుకున్న సమయానికి పూర్తిచేయడం" అని అన్నారు. అయితే ఈ ఏడాది చివరినాటికల్లా ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేస్తామన్న కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై చురకలు వేశారు. అంతటి అద్భుత నిర్మాణ సామర్థ్యం ఉన్నప్పుడు ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకిచ్చారో అంటూ ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయకపోతే, తదుపరి వచ్చే యూపీయే సర్కారు తప్పకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తుందని కేవీపీ రామచంద్రరావు అన్నారు.

ఎదురుదాడితోనే రక్షణ!

(మొదటిపేజీ తరువాయి)

సామర్థ్యాన్ని సమకూర్చుకుంటున్నాయి. సరికొత్త ఆయుధాల్ని రూపొందించుకుంటున్నాయి. వీటన్నింటిని భారత్‌ లక్ష్యంగా సరిహద్దుల్లో మోహరిస్తున్నాయి. సంప్రదాయసిద్ధంగా వస్తున్న శాంతికాముకత్వాన్ని భారత్‌ పాటిస్తుంటే పొరుగునున్న చైనా, పాకిస్థాన్‌ మాత్రం ఎప్పుడు భారత భూభాగాన్ని కబళించేద్దామా అన్న ఆత్రతతో ఎదురుచూస్తున్నాయి. తరచూ మన భూభాగంలోకి చొచ్చుకొస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో భారత్‌ కూడా అవసరమైతే ఎదురుదాడికి తగిన సైనిక సంపత్తిని సమకూర్చుకోవాలని రక్షణరంగ నిపుణులు కేంద్రానికి సూచిస్తున్నారు. ఇందుకోసం ప్రస్తుత రక్షణ దళాల ఆధునీకరణకు తగినన్ని నిధులు బడ్జెట్‌లో కేటాయించాల్సిన అవసరముంది. భారత్‌ తన స్థూల జాతీయోత్పత్తిలో రక్షణరంగానికి 1.6శాతం కేటాయిస్తోంది. అదే చైనా తన జీడీపీలో రక్షణకు 2.1శాతం కేటాయిస్తుంటే పాక్‌ 2.36శాతం కేటాయింపులు జరుపుతోంది. భారత్‌ రక్షణశాఖకు చేస్తున్న కేటాయింపుల్లో సింహభాగం సిబ్బంది జీతభత్యాల వ్యయానికి సరిపోవడంలేదు. పైగా ఇతర రంగాల్లో పోలిస్తే రక్షణరంగ కేటాయింపుల్లో వృద్ధి కనిపించడంలేదు. 2016-17లో రక్షణశాఖకు 2,49,099కోట్లు కేటాయించారు. 2017-18లో 2,62,389కోట్లు కేటాయించారు. అంతకుముందు బడ్జెట్‌ పరిమాణంతో పోలిస్తే 2017-18లో బడ్జెట్‌ 9.78శాతం పెరిగింది. అయితే రక్షణశాఖకు కేటాయింపులు మాత్రం 5.55శాతమే పెరిగాయి. 2016-17లో కేంద్రప్రభుత్వ మొత్తం బడ్జెట్‌ వ్యయంలో రక్షణకేటాయింపులు 17.24శాతం కాగా ఆ తర్వాతేడాది మొత్తం బడ్జెట్‌లో రక్షణకు కేటాయింపుల్ని 16.76శాతానికి తగ్గించేశారు. పైగా రక్షణరంగంలో అనవసర వ్యయం పెరిగింది. 2004-05బడ్జెట్‌లో రక్షణరంగ కేటాయింపుల్లో 43శాతాన్ని ఆయుధాల కొనుగోలు, ఆధునీకరణకు వ్యయం చేశారు. 2016-17 బడ్జెట్‌లో రక్షణ కేటాయింపుల్లో 71శాతం జీతభత్యాలు, వాహనాల నిర్వహణ, అద్దెల చెల్లింపులకే సరిపోగా ఆధునీకరణ, ఆయుధాల కొనుగోళ్ళకు 29శాతం మాత్రమే మిగిలింది. దీంతో రక్షణ ఒప్పందాలు, ఆయుధాల కొనుగోళ్ళన్నీ వాయిదాల పద్ధతిలోనే చేపట్టాల్సిన పరిస్థితి భారత్‌కేర్పడింది. గతేడాది 2,62,389కోట్లు రక్షణశాఖకు కేటాయించినప్పటికీ ఇందులో ఆధునీకరణకు ఖర్చుపెట్టింది 27,556కోట్లు మాత్రమే.

తాజా బడ్జెట్‌లో రక్షణరంగానికి కేటాయింపులు పెంచడంతో పాటు ఆధునీకరణ, ఆయుధసంపత్తి విస్తరణకు తగినన్ని నిధులు కేటాయించాల్సిన అవసరముంది. ఇప్పటికే ఖరారైన ఒప్పందాలకు కేంద్రం అడ్వాన్సులు చెల్లించాలి. ఇందుకు తగిన నిధులు గత బడ్జెట్‌లో అందుబాటులో లేవు. దీంతో ఈ ఒప్పందాలు ఖరారైనా అమలుకు నోచుకోలేదు. దీంతో ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాలు రక్షణశాఖకు అందలేని దౌర్భాగ్యం ఏర్పడింది. ఇటీవలె భారత వాయుసేనకు చెందిన మిగ్‌ 21రకం విమానాలు తరచూ ప్రమాదాలకు లోనౌతున్నాయి. వీటిని ఎప్పుడో సోవియట్‌ నుంచి కొనుగోలు చేశారు. వాటినే ఇప్పటికీ వినియోగిస్తుండటంతో తరచూ ఇవి కుప్పకూలిపోతున్నాయి.

దీంతో సామర్థ్యాన్ని పరిశీలించిన నిపుణులు 27మిగ్‌ 21యుద్ధవిమానాల్ని స్క్వాడ్రన్‌ నుంచి తొలగించాలని సూచించారు. అంతేకాదు.. 2020నాటికి మిగ్‌ 21 విమానాల్ని మొత్తంగా వాయుసేననుంచి తప్పించాల్సిన ఆవశ్యకతను ఈ బృందం స్పష్టం చేసింది. అలాగే 80వ దశకంలో కొనుగోలు చేసిన జాగ్వార్‌ విమానాల్లో కొన్నింటిని సైతం స్క్వాడ్రన్‌ల నుంచి కూడా పక్కనపెట్టాలని ఈ బృందం సిఫార్స్‌ చేసింది. వీటన్నింటిని తొలగిస్తే వీటి స్థానంలో వరికం ఆధునిక యుద్ధ విమానాల్ని కొనుగోలు చేయాలి. ఇటీవలే రాఫెల్‌ రకం యుద్ధ విమానాల కోసం ఒప్పందం జరిగింది. అలాగే తేజస్‌ రకం విమానాల్లో ఆరు స్క్వాడ్రన్‌లు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. 2032నాటికి కొత్తగా 42స్క్వాడ్రన్‌ల విమానాల అవసరం. మరోవైపు ఐదోతరం స్టెల్త్‌ జెట్లను చైనా, పాక్‌లు సమకూర్చుకున్నాయి. వీటి కొనుగోలు అత్యంత వ్యయభరితం. ట్విన్‌ యూరో జెట్‌ రకం విమానాల కొనుగోలుకు ఇజ్రాయెల్‌తో ఇటీవలే ఒప్పందాలు చేసుకుంది. అయితే వీటన్నింటికీ అడ్వాన్స్‌లు చెల్లించాలి. ఇందుకు తగ్గ నిధులు కేటాయింపు జరగాలి. అలాగే రక్షణరంగ అవసరాలకనుగుణంగా ఆయుధ తయారీ కర్మాగారాల్ని దేశీయంగా ఏర్పాటు చేయాలి. ఇందుకూ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. అన్నింటికీ మించి రక్షణరంగానికి జరిపిన కేటాయింపుల వ్యయానికి నిర్దేశించిన గడువు తొలగించాలి. ప్రస్తుతం మార్చి 31లోగా వ్యయం చేయని కేటాయింపులు రద్దవుతున్నాయి. అంతర్జాతీయ ఒప్పందాల విషయంలో చెల్లింపులకు సంబంధించి జాప్యం జరగడం సహజం. జలవనరులు, జాతీయ రహదార్లకు తొలగించిన తరహాలోనే గడువు తొలగిస్తేతప్ప నిధులసద్వినియోగం సాధ్యంకాదు. ఇక నేవీ విషయానికొస్తే హిందూమహాసముద్రంపై ఆధిపత్యం కోసం చైనా పలురకాల ఒత్తిళ్ళు పెంచుతోంది. ఇప్పటికే దక్షిణ చైనా సముద్రంపై ఆ దేశం ఆధిపత్యం సాధించింది.

భారత్‌లోని ప్రధాన నేవీ కేంద్రాలు లక్ష్యంగా శ్రీలంక, పాకిస్థాన్‌లలో చైనా నేవల్‌బేస్‌లను ఏర్పాటు చేసుకుంది. అక్కడ ఆధునిక యుద్ధ విమానాల్ని మోసుకుపోగల భారీ నౌకల్ని మోహరించింది. హిందూమహాసముద్రాన్ని గుప్పెట పట్టేందుకు చేస్తున్న ప్రయత్నంలో చైనాకు భారత్‌ ఒకటే ఎదురునిల్చేది. దీంతో భారత నావికాదళ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరముంది. ఇప్పుడున్న సబ్‌మెరైన్లు తోడుగా అవసరమైతే అణ్వాయుధాల్ని మోసుకుపోగల 22జలాంతర్గాముల్ని సమకూర్చుకోవాలని గతంలోనే నావికాదళాధిపతి కేంద్రానికి సూచించారు. అలాగే సైనిక దళాలకు తగినన్ని ఆర్మీ హెలీకాప్టర్లు అందుబాటులో లేవు. ఇప్పటికీ పాతకాలం నాటి చీతా రకం హెలీకాప్టర్లనే భారతసైనికదళం వినియోగిస్తోంది. తరచూ అత్యంత సమయాల్లో జరుగుతున్న దాడుల్ని సమర్థవంతంగా అరికట్టేందుకు ఇవి ఉపకరించడంలేదు. పైగా ఆధునిక ఆయుధాల్ని మోసుకుపోగల పాతకాలం నాటి చీతాలు సరిపోవు. వీటి స్థానంలో హైటెక్‌ అస్సాల్ట్‌ రైఫిళ్ళను బిగించేందుకు అనువైన ఆధునిక హెలీకాప్టర్ల అవసరముంది. రక్షణమంత్రి నిర్మలాసీతారామన్‌కు ప్రధాని మోడీ వద్ద మంచి పట్టుంది. తనకున్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించైనా మోడీపై ఒత్తిడి తెచ్చి తన శాఖకు నిర్మలాసీతారామన్‌ తగినన్ని నిధుల్ని మంజూరు చేయించుకుంటారన్న ఆశాభావం సైనిక వ్యవహారాల నిపుణుల్లో వ్యక్తమౌతోంది. చైనా, పాకిస్థాన్‌ అంతర్జాతీయ వేదికల్లో గట్టిగా హెచ్చరికలు జారీ చేస్తున్న మోడీ ప్రభుత్వం భారత సైన్యం ఆధునీకరణ, ఆధునిక ఆయుధ సంపత్తి సమీకరణల్లో అవసరమైతే ఎదురుదాడి చేసైనా పీఓకేను విముక్తి చేస్తామన్న హెచ్చరిక జారీ చేయాలంటే తగినన్ని నిధుల్ని బడ్జెట్‌లో కేటాయించాల్సిన అవసరముందని వీరు విశ్లేషిస్తున్నారు.

సినిమా టిక్కెట్ల ధరలపై త్వరలో నిర్ణయం

- మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయం



అమరావతి, ఆంధ్రప్రభ: సామాన్యులకు సినిమా టిక్కెట్ల ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయపడింది. బుధవారం సచివాలయంలో రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి యనమల రామకృష్ణుడు, రాష్ట్ర హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, రోడ్లు, భవనాల శాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, సాంఘిక సంక్షేమ మంత్రి నక్కా ఆనందబాబు సినిమా టిక్కెట్ల ధరలపై అధికారులతో సమీక్షించారు. టిక్కెట్‌ ధరలపై నిర్ణయానికి వచ్చే ముందు ఫిబ్రవరి 14న థియేటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, పంపిణీదారుల సంఘాల ప్రతినిధులతో భేటీ కావాలని నిర్ణయించారు. ఆన్‌లైన్‌ టిక్కెట్ల అమ్మకాలపై కూడా మంత్రివర్గ ఉప సంఘం చర్చించింది. పన్ను వసూలు మరింత పారదర్శకంగా ఉండేందుకు రాష్ట్ర చలనచిత్రాభివృద్ధి సంస్థ నోడల్‌ ఏజెన్సీగా ఆన్‌లైన్‌ టిక్కెట్ల విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నట్లు సమావేశంలో పేర్కొన్నారు. సమావేశంలో రెవిన్యూశాఖ స్పెషల్‌ చీఫ్‌ సెక్రటరీ డి.సాంబశివరావు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.ఆర్‌.అనురాధ, రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటక అభివృద్ధి సంస్థ ఎండీ ఎస్‌.వెంకటేశ్వర్‌ అధికారులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆలిండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రజా రాజధాని అమరావతి పరిధిలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన పలు క్రీడా విభాగాల్లో ఉత్తమ ప్రతిభను చూపిన బెంగుళూరు రీజనల్ స్పోర్ట్స్ బోర్డు అథ్లెట్లు అత్యధికంగా పతకాల సాధించి ముందంజలో ఉన్నారు. బెంగుళూరు ఆర్ఎస్‌బి అథ్లెట్లు 61 పాయింటతో ప్రథమ, ఆర్ఎస్‌బి చెన్నై 56 పాయింట్లతో ద్వితీయ, అహ్మదాబాద్ ఆర్ఎస్‌బి 52 పాయింట్లతో తృతీయ స్థానాల్లో కొనసాగుతున్నారు. మిగతా రాష్ట్రాల జట్లను పరిశీలిస్తే జైపూర్ ఆర్ఎస్‌బి 52, మహారాష్ట్ర 42, కోలకత్తా ఆర్ఎస్‌బి 39, కొచ్చి ఆర్ఎస్‌బి 33, హైదరాబాద్ 32, ముంబాయి ఆర్ఎస్‌బి 29, సెంట్రల్ ఎస్‌సీఈసీ ఢిల్లీ 22, బీహార్ సెక్రటరియేట్ 19, కేరళ 18, హర్యానా 14, భువనేశ్వర్ ఆర్ఎస్‌బి 9, రాయపూర్ 8, చండీఘర్ 8, జిఎన్‌సిటి ఢిల్లీ 3, ఒడిషా స్టేట్ 3, తమిళనాడు 3, పాండిచ్చేరి 2, గుజరాత్ 2, మధ్యప్రదేశ్ సివిల్ సర్వీస్ భూపాల్, ఉత్తరాఖండ్ సెక్రటరియేట్ ఒక్కొ పాయింట్‌లను సాధించడం జరిగింది. ఇక తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్ జట్లు ఒక పాయింట్ కూడా సాధించకుండా పతకాల వేటలో వెనుకబడి ఉన్నారు. మంగళవారం నుంచి ప్రారంభమైన ఈ జాతీయ స్థాయి పోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతూ గురువారంతో ముగియనున్నాయి. చివరి రోజున జరిగే ముగింపు వేడుకలకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిధిగా హాజరుకానున్నారు.

రాష్ట్రంలో ఇక భూసేవ

- ఒక్క క్లిక్‌తో సమగ్ర సమాచారం
- ఆధార్ తరహాలో భూధార్
- త్వరలో ఆటోమ్యూటేషన్
- డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి

అమరావతి, ఆంధ్రప్రభ: భూసేవ ద్వారా ఒక్క క్లిక్‌తో భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం లభిస్తుందని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి లేదా స్థిరాస్తికి భూదార్ విధానం ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ భూమి రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే వెబ్‌ల్యాండ్‌లో పట్టదారు పేరు మార్పు జరుగుతుందన్నారు. రైతుల సమయం, డబ్బు ఆదా చేసేందుకే ఆటో మ్యూటేషన్ ప్రక్రియను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. మూడేళ్ళలో రెవెన్యూ శాఖలో ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టామని, జాతీయ స్థాయిలో ఈ గవర్నెన్స్ కేటగిరి కింద అవార్డులు అందుకున్నామని తెలియజేశారు. రాష్ట్రంలో భూవివా దాలు అరికట్టడంతో పాటు రాష్ట్రంలోని భూముల సమగ్ర సమాచారం ఒకేచోట లభ్యమయ్యే విధంగా భూసేవ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రగతి ప్రాజెక్టులో భాగంగా భూసేవ పథకానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి పట్టాదారుని భూభాగానికి జియో ట్యాగింగ్ చేసి 11 అంకెలతో ఒక సంఖ్య ఇస్తారని అన్నారు. ఈ సంఖ్య ఆధారంగా భూమికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. జియో ట్యాగింగ్ చేసిన వెంటనే 99 సంఖ్యతో ప్రారంభమయ్యే తాత్కాలిక భూధార్ నెంబర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. భూ వివరాలను సమగ్రంగా విశ్లేషించి అవిసక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తరువాత రాష్ట్రసెన్స్ బోర్డు 28తో ప్రారంభమయ్యే పర్మినెంట్ భూధార్ నెంబర్ అందిస్తారన్నారు. ప్రభుత్వ భూములను సులువుగా గుర్తించే విధం గా విశిష్ట సంఖ్య 00లతో ప్రారంభమవుతుందని, భూ సేవలో వెబ్‌సైట్‌లో మొత్తం 6 శాఖలకు సంబంధించిన సమాచారం రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, మున్సిపల్, పంచాయతీరాజ్ మరియు అటవీశాఖకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచడం జరుగుతుందని అన్నారు. మొత్తం 2.84 కోట్ల వ్యవసాయ భూముల వివరాలతో పాటు 50 లక్షల పట్టణ ఆస్తులు, 85 లక్షల గ్రామీణ ఆస్తుల వివరాలను దీని ద్వారా పొందవచ్చునని జగ్గయ్యపేట మండలంలోని 24 గ్రామాలు ఈ, ఉయ్యూరు మున్సిపాలిటీల్లో ప్రయోగాత్మకంగా పైలెట్ ప్రాజెక్టు చేపట్టామన్నారు. ఫిబ్రవరి 15 నాటికి ఇది పూర్తవుతుందని అక్టోబర్ నాటికి రాష్ట్రమంతటా ప్రాజెక్టును అమలు చేస్తామన్నారు.

దేశంలోనే ఈ తరహా ప్రాజెక్టును ఎక్కడా అమలులో లేదని రాష్ట్రంలోనే మొదటి సారిగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర సెన్సస్ బోర్డు 28తో ప్రారంభమయ్యే పర్మినెంట్ భూధార్ నెంబర్ భూసేవలో మొత్తం 6 శాఖలకు సంబంధించిన సమాచారం ఉంటుందని గుర్తు చేశారు. వ్యవసాయ భూముల కొనుగోలు, అమ్మకాలు జరిగిన వెంటనే రెవెన్యూ రికార్డుల్లో ఆటోమేటిక్‌గా కొత్త యజమాని పేరు నమోదయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆటోమ్యూటేషన్ అయిన వెంటనే రైతుకు లేదా భూయజమానికి ఎస్ఎమ్ఎస్, ఈమెయిల్ ద్వారా తెలియజేస్తామన్నారు. రికార్డుల్లో పేరు నమోదు అయినప్పటికి 30 రోజుల వరకు ఎలాంటి లావాదేవీలు జరగకుండా దీనికి నోషనల్ ఖాతా నెంబర్ ఇస్తామని అన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అన్ని అభ్యంతరాలు పరిష్కారమైన తరువాతే రెవెన్యూ రికార్డుల్లో శాశ్వత ఖాతా ఇస్తామన్నారు. గడిచిన మూడేళ్ళలో రెవెన్యూ శాఖలో అనేక సంస్కరణలు తీసుకురావడం జరిగిందని రెవెన్యూ శాఖలో తాము తీసుకువచ్చిన ఈ-పంటలోన్ ఛార్జ్ క్రియేషన్, మాడ్యుల్, ఈ-పట్టాదారు పుస్తకం, టైటిల్ డీడ్‌కు జాతీయ స్థాయిలో ఈ-గవర్నెన్స్ కేటగిరి కింద అవార్డుల వచ్చాయని అన్నారు. కాగా ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు సచివాలయ వేదికగా భూసే వ, ఆటో మ్యూటేషన్ ప్రక్రియకు సంబంధించి రెవెన్యూ ఉన్నతాధికారులు ఉప ముఖ్యమంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో రెవె న్యూ, ఐటీ, ఎన్ఐసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారీగా ఇస్తారనే ఆశిస్తున్నాం

- యనమల ఆశాభావం

అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తారని భావిస్తున్నట్టు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం వెలగపూడిసచివాలయంలో మీడియాప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రానికి 25.000 కోట్ల రూపాయల నిధుల కోసం అభ్యర్థించామని తెలిపారు.ఆ విషయం కేంద్రం పరిశీలనలో వుందని చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇప్పటికే రూ. 1,250 కోట్ల వచ్చాయని, మరిన్ని నిధుల కోసం బడ్జెట్‌లో కేటాయింపులుంటాయనే అభిప్రాయం వుందని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ అంశం కూడా ఇప్పటికే కేంద్రం పరిశీలనలో వుందని, కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశిస్తున్నామని తెలిపారు. బడ్జెట్‌లో కేటాయింపులు ఒకేసారి జరుగుతాయని ఆశిస్తున్నప్పటికీ, కొన్ని సందర్భాలలో కేంద్రం నిర్ణయం ఆశించినదానికన్నా భిన్నంగా వుండే అవకాశాలు లేకపోలేదని తెలిపారు. అయితే ఈ ఒక్క బడ్జెట్‌తో అన్నీ కావని, మరిన్ని బడ్జెట్‌లో వుండే అవకాశాలు కూడా వుంటాయి కదా అని యనమల రామకృష్ణుడు తెలిపారు. రాష్ట్రా నికి సంబంధించి పలు డిమాండ్లను ఇప్పటికే నివేదించిన నేపథ్యంలో బడ్జెట్‌లో కేటాయింపులు ఆంధ్రప్రదేశ్‌కు భారీగా వుండాల్సిందేనని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రికి కూడా ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున సమగ్రమైన నివేదికను ఇచ్చారని, కేంద్రం నుంచి సానుకూల స్పందనల లభిస్తోందని తెలిపారు. ఆ కదలిక నేపథ్యంలో కొంతమేర పరిస్థితులు ఆశాజనకంగా వున్నాయని, కొత్త రాష్ట్రమైనందువల్ల ఆంధ్రప్రదేశ్ అవసరాలను ఇప్పటికే గట్టిగానే వినిపించడం జరిగిందని యనమల రామకృష్ణుడు తెలియజేశారు. పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయింపులు జరగాలని మంత్రి అభిప్రాయ పడ్డారు.

బీజేపీ నేతలతో నేడు అమిత్ షా భేటీ!

- తొలుత తెలుగు రాష్ట్రాల నేతలతో సంయుక్త సమావేశం
- నియోజకవర్గాల పెంపు సహా పలు అంశాలపై అభిప్రాయ సేకరణ
- తేలనున్న ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి నియామకం



అమరావతి, ఆంధ్రప్రభ: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా గురువారం రాష్ట్ర నేతలతో సమావేశం కానున్నారు. ఆంధ్ర, తెలంగాణా బీజేపీ నేతలతో తొలుత సంయుక్త సమావేశం నిర్వహించిన తర్వాత ఏపీ నేతలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజనాంశాలపై నెలకొన్న గందరగోళం వంటి అనేక అంశాలపై అమిత్ షా ఇరు రాష్ట్రాల బీజేపీ నేతల నుంచి అభిప్రాయాలు తీసుకోనున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని వేర్వేరుగా కలిసి నియోజకవర్గాల పెంపు సహా పలు అంశాలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ క్రమంలోనే ఆయా అంశాలపై పార్టీ నేతల అభిప్రాయాలు సేకరించేందుకు అమిత్ షా నిర్ణయించారు. పార్టీ నేతల నుంచి వ్యక్తమైన అభిప్రాయాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోవాలనేది బీజేపీ అధిష్టానం నిర్ణయంగా ఉన్నట్లు తెలిసింది. సమావేశానికి ఏపీ నుంచి అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి హరిబాబు, సంఘటనా మంత్రి ఆర్. రవీంద్ర రాజు, కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి, రాష్ట్రమంత్రి పైడికొండల మాణిక్యాల రావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర మాజీ మంత్రి కన్నా లక్ష్మీ నారాయణ హాజరుకానున్నారు. తెలంగాణా నుంచి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్, రామచంద్రరావు, సంఘటనా మంత్రి మంత్రి శ్రీనివాసరావు పాల్గొననున్నట్లు తెలిసింది. నియోజకవర్గాలు సహా రాష్ట్రాల మధ్య నెలకొన్న అన్ని విబేధాలపై అమిత్ షాతో నిర్వహించే సమావేశంలో ఇరు రాష్ట్రాల నేతలు తమ తమ అభిప్రాయాలు వెల్లడించనున్నారు.

ఏపీ నేతలతో ప్రత్యేక సమావేశం

ఉమ్మడి సమావేశం తర్వాత ఏపీ నేతలతో అమిత్ షా ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఇటీవల మిత్రపక్షంగా వ్యవహరించే విషయంలో తెలుగు దేశం, బీజేపీ నేతల మధ్య మాటల తూటాలు పేలాయి. మిత్రపక్షంగా వద్దంటే నమస్కారం పెడతామంటూ సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారంటే ఇరు పార్టీల నేతల మధ్య ఏ స్థాయిలో దీనిపై వాదోపవాదాలు జరిగాయో ఇట్టే తెలుసుకోవచ్చు. ఇదే సమయంలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర అధ్యక్షుని ఎంపిక వ్యవహారం కూడా ఓ కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయి. అనేక మంది రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్నప్పటికీ అధిష్టానం దాటవేత వైఖరి అవలంభిస్తోంది. పైగా పలుమార్లు అమిత్‌షా రాష్ట్ర పర్యటన వాయిదా పడుతోంది. వీటపై గట్టిగానే చర్చించనున్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి నియామకం కూడా ఇదే సమావేశంలో ఖరారు అయ్యే అవకాశాలు ఉన్నాయి. గతంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ఉన్న సిద్ధార్థనాద్ సింగ్ ఉత్తరప్రదేశ్ మంత్రి వర్గంలో బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి కూడా ఈ అంశం పార్టీ పరిశీలనలోనే ఉంది తప్ప పరిష్కరించలేదు. గురువారం నాటి సమావేశంలో ఖచ్చితంగా రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి నియామకం కూడా కొలిక్కి వచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి.

గంజాయి సాగుపై ఉక్కు 'పిడి'కిలి!

- డ్రోన్లతో పటిష్ట నిఘా
- పంట ధ్వంసానికి హెలికాప్టర్లు
- సమన్వయంతో నిలువరించాలి
- తప్పు చేసిన ఉద్యోగులపై కఠిన చర్యలు
- సాగు సమాచారం ఇస్తే ప్రోత్సాహకాలు : సీఎస్ దినేష్ కుమార్



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో గంజాయి సాగును పూర్తిగా అరికట్టాల్సిం దేనని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గంజాయి సాగు, రవాణా చేసే వారిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయడంతో పాటు సాగు సమాచారం ఇచ్చే వారికి ప్రోత్సాహకాలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలోని సీఎస్ కార్యాలయంలో బుధవారం డీజీపీతో కలిపి ఎక్సైజు, అటవీ, పోలీసు శాఖల ఉన్నతాధికారులతో దినేష్‌కుమార్‌సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ గంజాయి సాగును పూర్తిగా భూ స్థాపితం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబం ధించిన వ్యక్తలను అదుపులోకి తీసుకున్న వెంటనే పీడీ చట్టం కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు ఎక్సైజు, పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో నిఘాను పటిష్టం చేసి తనిఖీలు నిర్వహించాలన్నారు. గంజాయి సాగు, రవాణాపై సమాచారం అందిన వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అంతే తప్ప చూస్తూ ప్రేక్షక పాత్ర వహిస్తే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. దాడులు, తనిఖీలు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకోవడం ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదని చెపుతూ సాగును పూర్తిగా అరికట్ట గలిగినప్పుడే సమస్య పరిష్కారమై నట్లు చెప్పారు. గుర్తించిన ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో పరిశీలించి పంట ధ్వంసం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వెళ్లేందుకు వీలులేని మారు మూల కొండల్లో గంజాయి సాగును గుర్తిస్తే ధ్వంసం చేసేందుకు హెలీకాప్టర్ సౌక ర్యం కలిపించనున్నట్లు సీఎస్ తెలిపారు. ఇదే సమయంలో గంజాయి సాగుపై సమాచారం ఇచ్చే వారికి ప్రోత్సహకాలు అందజేయాలని ఆయన అధి కారులను ఆదేశించారు. చెక్‌పోస్టులు, తనిఖీ వ్యవస్థలను పటిష్టం చేయడం ద్వారా ఎక్సైజు, పోలీసు, అటవీ శాఖలు గంజాయి సాగును అరికట్టాల న్నారు. గంజాయి సాగుకు మండల స్థాయి అధికారులు, సిబ్బందిని బాధ్యులను చేసి విధుల నుంచి తొలగిస్తామనే కఠిన చర్యలు ఉంటాయనే విషయం మూడు శాఖల ఉద్యోగుల్లో కలిపించాలని ఆయన పేర్కొన్నారు. ఇందులో ఉదాసీనంగా ఉంటే తదుపరి పరిణామాలు తీవ్రంగా ఉంటా యని, వీరిని ఏ ఒక్కరూ రక్షించలేరనే విషయం వారికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. సాగుదారులు, ఉద్యోగుల్లో భయం ఉంటేనే గంజాయి సాగు పూర్తిగా అరి కట్టేందుకు వీలుంటుందని చెప్పారు. ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న గంజాయిని ఫిబ్రవరి నెలాఖరులోగా ధ్వంసం చేయాలని ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ స్పష్టం చేశారు. డీజీపీ డాక్టర్ ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ గంజాయి రవా ణాకు సంబంధించి ఎనిమిది వందల వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి సాగుకు పాల్పడుతున్న 17 ముఠాల జాబితాను సిఐడీకి అందజేసి నిఘాను పటిష్టం చేశామని చెప్పారు.

పోలీసు శాఖ ఆధీనంలో 150 టన్నుల గంజా యి ఉందని చెపుతూ దీనిని ధ్వంసం చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఒడిశాలో గంజాయి సాగు ఎక్కువగా ఉన్నందున సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ నివా రించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎక్సైజు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాంబశివరావు మాట్లాడు తూ గంజాయి సాగును నిలువరించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో నిఘాను పటిష్టం చేయాలన్నారు. విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మూడు వేల 107 ఎకరాల్లో గంజాయి సాగవుతున్నట్లు గుర్తించామన్నారు. ఇందులో 563 ఎకరాలు అటవీ, రెండు వేల 543 ఎకరాల రెవిన్యూ భూమి ఉందని తెలిపారు. ఎక్సైజు కమిషనర్ డాక్టర్ పి.లక్ష్మీ నరసింహం మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న గంజాయిని జిల్లా స్థాయి కమిటీలు పరిమాణం నిర్ధారించిన తర్వాత ధ్వంసం చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. సమావేశంలో ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు, అటవీ, పర్యావరణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాము, సిఐడి చీఫ్ సిహెచ్. ద్వారకా తిరుమల రావు, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు పి.మల్లిఖార్జునరావు, అదనపు పిసిసిఎఫ్ ఎ.కె.ఝా, విశాఖపట్టణం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

2019 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి

- రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం
- మంత్రులు దేవినేని, పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, ప్రభ న్యూస్: వచ్చే 2019కల్లా పోలవరం పూర్తి చేసి రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని, ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వంను ప్రజలు ఆకర్శిస్తున్నారని, మళ్లీ వచ్చే 2019 ఎన్నికల్లో కూడా తెలుగుదేశం ప్రభుత్వం వస్తుందని, పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి ఇంకా గొల్లపల్లి రిజర్వాయర్ లాగా రాయలసీమలో కొన్ని రిజర్వాయర్ లు ఏర్పాటు చేసి వాటిని నింపి రైతులకు తాగునీరు అందిస్తామని నీటిపారుదల శాఖామంత్రి దేవినేని ఉమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి పరిటాల సునీత తెలిపారు.

అనంతపురం జిల్లా చెన్నేకొత్తపల్లి మండలంలోని హంద్రీనివా నుంచి నాగసముద్రం, కుంటిమద్ది, హర్యానచెరువు గ్రామాల చెరువులకు నీరు నింపడంతో నీటిపారుదల శాఖామంత్రి దేవినేని ఉమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి పరిటాల సునీతలు గంగపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయినప్పటికి ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలనన్నింటిని చంద్రబాబు చేస్తున్నారని, అదే విధంగా కృష్ణా జలాల నుంచి రాయలసీమకు నీరు తెప్పించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. లేపాక్షి ఉత్సవాలకు హిందూపురం జలాలను తీసుకువెళ్తామన్నారు. పేరూరు డ్యాంకు రూ. 1700కోట్లు మంజూరు చేశారన్నారు. వీటిని పరిటాల వర్ధంతి రోజు చంద్రబాబునాయుడు మంజూరు చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఇవే కాకుండా త్వరలోనే బి.టి.ప్రాజెక్టు, పేరూరు డ్యాంకు టెండర్లు పిలిచి మరమ్మత్తులు చేపడతామన్నారు. వచ్చే ఎన్నికల్లో 170సీట్లు తెలుగుదేశం ప్రభుత్వం ప్రభంజనం ఎగురవేస్తుందని, ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్ కు ఒక్క సీటు కూడా రాదని ఎద్దేవా చేశారు.



మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ అనంతపురం జిల్లాను కరువు జిల్లాను దృష్టిలో పెట్టుకొని చంద్రబాబునాయుడు అన్ని చెరువులకు నీరు నింపారని, వారికి పదే పదే ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి ముఖ్యమంత్రి మరెవరూ వుండరని తెలిపారు. బి.టి. ప్రాజెక్టులు, పేరూరు డ్యాంకు పనులు త్వరితగతిన పూర్తీచేసి ప్రాజెక్టుకు నీరు నింపుతామన్నారు. పల్లెల్లో తారు రోడ్లు, సి.సి.రోడ్లు వేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనన్నారు.కరువు జిల్లాను అన్ని విధాలా ప్రభుత్వం తరపున చంద్రబాబునాయుడు ఆదుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. ఇవే కాకుండా ఇంకా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి నెరవేరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్. నారాయణ చౌదరి, జిల్లా అధికారులు, దేశం నాయకులు, మహిళలు, కార్యకర్తలు మండల కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి, ఎం.పి.పి. అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతో స్పీకర్ కోడెల భేటీ

- కోటప్పకొండ రోప్ వే ప్రారంభోత్సవానికి ఆహ్వానం
- అసెంబ్లీ సమస్యలపై సీఎంతో చర్చ

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో శాసనసభస్పీకర్‌కోడెల శివప్రసాదరావు భేటీ అయ్యారు. బుధ వారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి వచ్చిన ఆయన సుమారు 40నిమిషాల పాటు ముఖ్యమంత్రితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా త్వరలో ప్రారంభించనున్న కోటప్ప కొండ రోప్ వే, నర్సరావుపేట జెఎన్‌టీయుల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆహ్వానించారు. అనంతరం ప్రస్తుతం ఉన్న అసెంబ్లీలో సిబ్బంది కొరతతో పాటు భవనాలు సరిపోక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నట్లు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. లైబ్రెరీ, క్యాంటీన్ , సెక్యూరిటీ ఆఫీస్, విప్ లకు రూమ్‌లు కేటాయించే పరిస్థితి లేదని సీఎంకు స్పీకర్ వివరించారు. ఈ భేటీలో సీఆర్డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ తోపాటు సీఎం కార్యదర్శి సాయిప్రసాద్, అదనపు కార్యదర్శి రాజమౌళి, ఇతర అధికారులు ఉన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 1 ఫిబ్రవరి 2018

బడ్జెట్‌కు సహేతుకతే ప్రాణం!

జమిలి ఎందుకంటే..!

అసెంబ్లీకీ, పార్లమెంటుకూ ఒకే సారి ఎన్నికలను నిర్వహించడాన్నే జమిలి ఎన్నికలు అంటారు. మనదేశంలో ఏటా ఏదో ఒక రాష్ట్రంలో లేదా,కొన్ని రాష్ట్రా ల్లో ఎన్నికలు అనివార్యమవుతుండటం వల్ల వ్యయం తడిసి మోపెడవుతోంది. ఈ మాట అటుంచితే, ఎన్నికల నియమావళి కారణంగా ఆయా రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతున్నమాట నిజమే. జమిలి ఎన్నికలు మనకు కొత్త కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇరవై ఏళ్ళ పాటు జమిలి ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యానికి 1967లో గండి పడటం, కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వచ్చిన సంకీర్ణ ప్రభుత్వాలు పేకమేడల్లా కూలి పోవడంతో మళ్ళీ మళ్ళీ ఎన్నికలు నిర్వహించాల్సి రావడం కారణంగా జమిలి సంప్రదాయం వెనక్కి పోయింది. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్‌డియే-2 ప్రభుత్వం మళ్ళీ ఈ ఆలోచన చేస్తోంది. జమిలి ఎన్నికలపై అన్ని పార్టీలు ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరం గురించి ప్రధానమంత్రి మోడీ చాలా సందర్భాల్లో బోధ చేశారు. ఇప్పుడు దేశానికి ప్రథమ పౌరుడైన రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ కూడా అదే సూచన చేశారు. అంటే జమిలి ఎన్నికల ప్రతిపాదనను ప్రభుత్వం తీవ్రంగానే పరిశీలిస్తోందన్న విషయం సుస్పష్టమైంది. దేశంలో రాజకీయ వాతావరణం తమకు అనుకూలంగా ఉన్నప్పుడే ప్రభుత్వాధినేతల నుంచి ఇలాంటి ప్రతిపాదనలు వస్తుంటాయి. మోడీకి ఇప్పుడు సొంత పార్టీలోనే కాకుండా, రాజకీయంగా తిరుగులేదు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మెజారిటీని సాధించినా సంకీర్ణ ధర్మాన్ని పాటించడం కోసం ఎన్‌డిఏ కూటమిలో భాగస్వామ్య పక్షాలకు కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పించారు. అప్పటికి పలు మహారాష్ట్ర, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి అనేక రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున సంకీర్ణాన్ని కొనసాగించడమే మంచిదని ఆయన భావించి ఉండవచ్చు. ఆ తర్వాత ఎన్నికలైన రాష్ట్రాల్లో ఢిల్లీ, బీహార్ తప్ప అన్ని చోట్లా తమ పార్టీయే గెలుపొందడంతో ఆయనలో ఆత్మవిశ్వాసం పెరిగింది. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను కూడా దారిలోకి తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన కూడా జమిలి ఎన్నికలకు సై అంటున్నారు. కనుక, తమకు ఎదురు లేదనే భావన మోడీలో బలపడి ఉండవచ్చు. శివసేన, ఎన్‌డిఏ ఇతర భాగస్వామ్య పక్షాల నుంచి తరచూ చికాకులు ఎదురవుతున్నందున ఒకేసారి ఎన్నికలకు వెళ్ళడమే మంచిదన్న భావన కమలనాథుల్లో ఏర్పడింది. అదే సందర్భంలో వరుస విజయాలతో మోడీలోనూ, కమలనాథుల్లోనూ మార్పు వచ్చిందనీ, తమకు గతంలో మాదిరి గుర్తింపు, గౌరవం లభించడం లేదని మిత్రపక్షాల్లోనూ వచ్చింది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ లలో మిత్ర పక్షాల నాయకులకూ, కమలనాథులకూ మధ్య వాగ్వాదాలు పెరుగుతున్నాయి. ఎవరికి తోచినట్టు వారు మాట్లాడుతుండటంతో ఎవరిని ఎవరు అదుపులో పెట్టాలన్న ప్రశ్న తలెత్తుతోంది. మహారాష్ట్రలో శివసేన నాయకులు బీజేపీతో కటీఫ్ చేసుకుంటున్నట్టు బహిరంగంగానే ప్రకటించిన వెంటనే అది మీకే నష్టమని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మా వాళ్ళను నేను అదుపుచేస్తున్నాను, మీ వాళ్ళను అదుపు చేసుకోవల్సిన బాధ్యత మీదే అని కౌంటర్ ఇచ్చిన తర్వాత కమలనాథుల్లో స్వరం మారింది. ఉత్తరప్రదేశ్‌లో మిత్రపక్షంగా ఉన్న సుహేల్దేవ్ భారతీయ సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ రాష్ట్రంలో అవినీతి పెరిగి పోయిందంటూ ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై అసంతృప్తిని బహిరంగంగానే వెళ్ళగక్కారు. ఆయనతో సహా నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే ఆ పార్టీలో ఉన్నారు. ఇలా ప్రతి రాష్ట్రంలో మిత్ర పక్షాల నుంచి విమర్శలో, హెచ్చరికలో రావడం కమలనాథులకు చికాకుగా ఉంది. జమిలి జపాన్ని వారు అందుకున్నారు. ఇది సాధ్యమా అన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రపతి సూచించినట్టుగానే అన్ని పార్టీలూ ఏకాభిప్రాయానికి రావల్సి ఉంది. వ్యయం సంగతి అలా ఉంచినా, ఒకే సారి ఎన్నికలను నిర్వహించడానికి తగినంత మంది పోలింగ్ సిబ్బందినీ, భద్రతాదళాలనూ చూసుకోవల్సి ఉంటుంది. ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రా ల్లో ఒక రోజు పోలింగ్ చేపట్టలేకే, ఆరేడు దశల్లో నిర్వహిస్తోంది. గతంలో ఉన్నంత హింస ఇప్పుడు లేకపోయినా, పోలింగ్ కేంద్రాల ఆక్రమణ వంటి అక్రమాలు ఉన్నాయి. ఒకేసారి పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను చూసుకోవడం అధికార పార్టీకి కష్టం కాకపోవచ్చు, ఇతర పార్టీలకు ఇబ్బందే. ఎన్నికల నిధులు చూసుకోవడం కూడా కష్టమే. ప్రతిపక్షాల బలహీనతను చూసి దెబ్బకొట్టేందుకే ప్రభుత్వం ఈ ఆలోచన చేస్తోందన్న వాదన నిరాధారం కాదు. ఎన్నికల సంఘం సంసిద్ధత తెలిపితే ప్రతిపక్షాల అభిప్రాయంతో నిమిత్తం లేకుండానే జమిలి ఎన్నికలను మోడీ చేపట్టవచ్చు. కేంద్రంలో, అన్ని రాష్ట్రా ల్లో బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ (కాంగ్రెస్ రహిత భారత దేశం) తమ లక్ష్యమని ఆయన పదే పదే స్పష్టం చేస్తున్నారు. మోడీ అభిమతం కూడా అదే కనుక జమిలి ఎన్నికలకే ఎక్కువ అవకాశాలున్నాయి.




హర్షవాక్కు

-వేటూరి శ్రీహర్ష(న్యూఢిల్లీ)

పాత రోజుల్లో కేంద్ర బడ్జెట్‌ను సాయంత్రం 5గంటల తరవాత లోక్‌సభలో ప్రవేశపెట్టేవారు. వాజపేయి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన యశ్వంత్ సిన్హా 2001 బడ్జెట్‌నాటికి ఈ సమయాన్ని మధ్యాహ్నం 12గంటలకు మార్చారు. గ్రీన్‌విచ్ సమయానికి తగ్గట్టుగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే పాతకాలపు సంప్రదాయానికి ఆయన తిలోదకాలిచ్చారు. బడ్జెట్ రోజు మీడియాకు ఒక పండగలా ఉండేది. 1990లో టెలివిజన్ ఇంకా శైశవ దశలో ఉంది. ఆహారం, నీళ్ళకు విపరీతమైన డిమాండ్ ఉండేది. ఢిల్లీలోని జాతీయ దినపత్రికలలో ఈ దృశ్యం సాధారణంగా కనిపించేది. చివరి నిముషం దాకా హడావుడే. ముఖ్యమైన సంగతులను చెప్పేందుకు రిపోర్టర్లు డెస్కుల వద్దకు పరుగులు తీసేవారు. బడ్జెట్ ప్రతిపాదనలను తెలియజేసేవారు. వీరందరితోనూ పత్రికా కార్యాలయాలలో రణగొణ ధ్వనులుండేవి.

కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల బడ్జెట్లను గుర్తు చేసుకోవడం, బేరీజు వేయడం నిష్ఫలమైన ప్రయత్నమే అని చెప్పకతప్పదు. అధికారంలో ఉన్నప్పుడు కానీ లేనప్పుడు కానీ ఆయా ప్రభుత్వాలు హామీలను నిలబెట్టుకోవడానికి కృషిచేయలేదు. నా స్నేహితుడొకాయన ఇటీవల నాతో.. రాజకీయాలన్నీ స్థానికాలే అని అన్నాడు. దాన్ని నేను ఇలా మారుస్తాను..బడ్జెట్ ప్రకటనలన్నీ రాజకీయాలే.. అవి అలాగే ఉండిపోతాయి. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే.. 2017బడ్జెట్ మోడీ ప్రభుత్వానికీ, అరుణ్‌జైట్లీకీ సంతృప్తికర ఫలితాలనే ఇచ్చింది. భారత దేశంలో బడ్జెట్ సాంకేతికంగా ఎలా ఉండాలో అలా ఉండడం లేదు. ఎంత సంపాదించాం..ఎంత ఖర్చుపెట్టామనే వివరాలు తప్ప ఏమీ ఉండవు. అదో ప్రభుత్వ జమాఖర్చుల పద్దులా ఉంటుందంతే. ఆర్థిక మంత్రులెవరూ చరిత్ర పుస్తకాలలోకి వెళ్ళరు. 2018 బడ్జెట్‌లో ముఖ్యమైన అంశాలేమిటి? ఏం సాధించదలచుకున్నారు? భారత ఆర్థిక రంగానికి అదేం చేస్తుంది? అన్న ప్రశ్నలు తలెత్తుతాయి. ఇతర రంగాలలో భారత్ సాధించిన విజయాలనూ, ఫలితాలను వ్యవసాయ రంగానికి దూరంగా ఉంచుతున్నారు. ఈ విషయంలో గత ప్రభుత్వాలను నిందించి ప్రయోజనం లేదు. గ్రామీణ సిద్ధాంతం నుంచి ఎన్డీయే ప్రభుత్వం పక్కకు తిరిగే అవకాశాలు తక్కువే. నరేంద్ర మోడీ రాజకీయంగా ఆలోచిస్తే, ప్రాధాన్యత రంగాలకు ఖర్చుచేస్తున్న మాదిరిగా వ్యవసాయానికి 24శాతం కేటాయించినా ఆశ్చర్యం లేదు. 50వేల గ్రామపంచాయతీలలో పేదరికాన్ని రూపుమాపడా నికి వీలుగా గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మరిన్ని నిధులను కేటాయించే అవకాశముంది. సహజంగానే ఇది ఉత్పత్తి రంగంలోనూ, వ్యవసాయ రంగంలోనూ ప్రాధాన్యతను పెంచుతుంది.

పెద్ద కరెన్సీ రద్దు నిర్ణయం చీకట్లో వేసిన బాణం కాదని నిరూపించుకునేందుకు బడ్జెట్‌ను వినియోగించుకునే అవకాశముంది. అరుణ్ జైట్లీ పన్ను ప్రతిపాదనలను కూలంకషంగా పరిశీలిస్తే, ఆదాయ పన్ను శాఖ అధికారులు పన్ను ఎగవేతదారులను లక్ష్యంగా చేసుకున్నట్లే కనిపిస్తోంది. డీమానిటైజేషన్ తరవాత బ్యాంకులలో చేసిన డిపాజిట్లను ఇందుకు ప్రామాణికంగా తీసుకుంటారు. పెద్ద సమాచారం(బిగ్ డేటా) అనే పదం ఇక్కడ ఎవరికి ప్రమాద ఘంటికలు మోగిస్తూ ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పన్ను ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఈ చర్య చెప్పకనే చెబుతుంది. చిన్న వ్యాపారస్థులను, అనధికార వ్యాపారాలను డీమానిటైజేషన్ తీవ్రంగా



దెబ్బతీసిన విషయాన్ని బడ్జెట్‌లో ప్రభుత్వం గమనంలో ఉంచుకోవాలి.

రానున్న 2018 బడ్జెట్ గత బడ్జెట్‌ల కంటే విభిన్నంగా ఉంటుందని ఆశించవచ్చు. ప్రముఖ జ్యోతిశ్శాస్త్రవేత్త బెజన్ దరువాలా ఇదే విషయాన్ని ఊహిస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర బడ్జెట్ అంశం జ్యోతిష్యులకూ, హస్త సాముద్రికులకూ కూడా ఒక పరిశీలనాంశమైంది. ఆయనకు సంబంధించిన గణేశా స్పీక్స్ అనే ఓ వెబ్ సైట్ ఆర్థికపరమైన ముందస్తు జాగ్రత్తలను చెబుతోంది. వినియోగదారుని బ్యాంకు బ్యాలెన్సులు, వాటిని ఎలా పరిరక్షించుకోవాలీ, ఎక్కడ పెట్టుబడి పెట్టాలీ కూడా తెలియజేస్తుంది. ఇంతవరకూ సమర్పించిన బడ్జెట్లన్నీ ఆదాయ లోటును తగ్గించుకోవడానికే ప్రయత్నించాయని దారువాలా చెప్పారు. అదే సమయంలో ఆర్థిక రంగాన్ని పరిపుష్టం చేసేందుకు కృషిచేశాయన్నారు. ఇందుకోసమే పన్నుల వ్యవస్థలో పెద్ద మార్పులకు శ్రీకారం చుట్టారు. జిఎస్టీ అమలు తరవాత వస్తున్న ఈ మొదటి బడ్జెట్ కార్పొరేట్, చిన్న తరహా పరిశ్రమల రంగానికి చాలా కీలకమైందంటున్నారు దరువాలా. జైట్లీ సరికొత్త పంథాను ఎంచుకుంటారని ఆయన అంచనా వేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి సన్నిహితుడుగానో లేక మంచి స్నేహితుడి మాదిరిగానో దారువాలా తన అంచనాను చెబుతున్నారు. పేదలు, గ్రామాలు, రైతుల అభివృద్ధిపై దృష్టి సారిస్తారని దారువాలా చెబుతున్నారు. ఇవన్నీ చూసిన అందరూ ముక్కు మీద వేళ్ళేసుకుంటున్నారు. ఒక న్యూమరాలజిస్టో, జ్యోతిష్యుడో కేంద్ర బడ్జెట్‌లో ఇవుంటాయని ఎలా ఊహించగలరని ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టే బడ్జెట్‌ను వీళ్ళెలా ఊహిస్తారనేది వారికి సమాధానం లేని ప్రశ్న. బడ్జెట్లు కూడా ఎన్నికల ఫలితాలను జ్యోతిష్యులు ఊహించిన మాదిరిగా మారిపోతాయా? అనేది వారి సందేహం. బడ్జెట్లో ఏం ఉండబోతోందో స్వామీజీలూ, బాబాలు కూడా చెప్పేరోజు ఎంతో దూరంలో లేనట్టే ఉంది. వినియోగదారులకూ, పారిశ్రామిక సంస్థలకూ కూడా వారు తమ అంచనాలు చెప్పేస్తారేమో!

కలల బడ్జెట్ అనే మాట వినే ఉంటారు. మాజీ ఆర్థికమంత్రి పళనియప్పన్ చిదంబరం 1997లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు ఈ పేరు పెట్టారు. ఆ ఏడాది మార్చిలో ఆయన కలల బడ్జెట్‌ని పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అది అప్పట్లో భారతీయ పారిశ్రామికవర్గాలకు ఎంతో ప్రీతిపాత్రమైంది. ఆదాయం పన్ను రేటును గరిష్ఠంగా 30 శాతానికి తగ్గించారు. కార్పొరేట్ పన్నును 35 శాతానికి తగ్గించారు. టారిఫ్‌లను సగటు స్థాయిలకు కుదించేశారు. రెండో బడ్జెట్‌లో 25 శాతానికి తగ్గించారు. యూపీఏ తొలి ప్రభుత్వంలో ఆయన 70 వేలకోట్ల

బడ్జెట్ 2018

రూపాయల మేర వ్యవసాయ రుణాలను మాఫీ చేశారు. ప్రధానమంత్రి గ్రామీణ రోజ్ గార్ యోజన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మొదలైనవన్నీ యూపీఏ కొనసాగడానికి ఉపయోగపడ్డాయి.

అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ సొంత నియోజకవర్గాల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటారు. గ్రామీణ పేదలు, భూమిలేని నిరుపేదలు, చిన్న, మధ్యతరహా రైతులు, నీడలేనివారు ... ఇలా ఎంతోమందికి ఊతం ఇవ్వడం కోసం ఎన్నో పథకాలు, కార్యక్రమాలను ప్రవేశపెట్టడం స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి జరుగుతున్నదే. లబ్ధిదారుల సంఖ్య కూడా ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. ఇంతవరకూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అభివృద్ధి లక్ష్యాలను చేరుకున్నప్పటికీ, మన దేశం ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశమే. విద్యలో వెనకబడి ఉన్నామనే మాట తరచూ వినిపిస్తూ ఉంటుంది. సర్వశిక్ష అభియాన్, ఇతర విద్యాభివృద్ధి పథకాలలో ఎక్కడ లోపాలు ఉన్నాయన్న సందేహం కలుగుతూ ఉంటుంది.

ఆర్థికవ్యవస్థలో స్టాక్ మార్కెట్ల పని తీరు ఇన్వెస్టర్లు, కేపిటల్ మార్కెట్లతో సహా సంబంధితవర్గాలన్నింటి ప్రయోజనాలతో ముడిపడి ఉంది. స్టాక్ ఎక్స్ఛేంజి, ప్రభుత్వమూ మధ్య సంబంధం, రాజకీయాలు, మదుపుదా రుల ధోరణిల మధ్య సంబంధాలను వివిధ దేశాల్లో వివిధ సంద ర్భాల్లో అధ్యయనం చేశారు. బడ్జెట్‌కి ముందూ, తర్వాత వెలు వడే ఊహాగానాలు మార్కెట్లను కలవర పెడుతూ ఉండటం అనివార్యం. మార్కెట్ సంక్షోభానికి దారి తీయడంకూడా సహజమే. ఇటీవల సిఎస్‌డిఎస్ మూడ్ జాతీయ సర్వే 2018లో చాలా తమ అసంతృప్తిని వ్యక్తం చేశాయి. గతంలో కన్నా ఇంటి ఖర్చులు 41 శాతం పెరిగాయని పేర్కొన్నాయి. తమ ఆర్థిక పరిస్థితి పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశాయి. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు అధికారాన్ని నిలబెట్టుకోవడానికి బడ్జెట్ ముఖద్వారమని భావిస్తాయి. దురదృష్టమేమంటే, యూపీఏ కూటమి పదేళ్ళ పాటు అధికారంలో కొనసాగినా, తన పథకాలు, కార్యక్రమాలను స్థిరపర్చడంలో విఫలమైంది. మోడీ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విజయం సాధించింది.

అందుకే ప్రధాని మోడీ రాజకీయ ఆలోచన ఈ ఏడాది బడ్జెట్ లో ప్రతిబింబించాలి. రాజకీయ ప్రయోజనాలు లేనిదే బడ్జెట్‌లను తయారు చేయరు. ప్రధాన విధాన మార్పులు, సంస్కరణలు ఏడాదిలో ప్రకటిస్తూనే ఉంటారు. ఇందుకు మంచి ఉదాహరణ డీమానిటైజేషన్. రానున్న మాసాల్లో కూడా ఇలాంటి సంస్కరణలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉండాలి. రాష్ట్రాల్లో వచ్చే ఎన్నికలను బట్టి ఇవి ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతానికి 2018 బడ్జెట్ సహేతుకంగానూ, ఆర్థిక కార్యకలాపాలను పెంచేదిగానూ ఉండాలి.

బాలలూ-నేరాలూ 10,14 స్థానాల్లో తెలుగు రాష్ట్రాలు

జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) నివేదిక ప్రకారం బాలలు చేసిన నేరాల జాబితాలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు వరసగా 10, 14 స్థానాల్లో ఉన్నాయి. బాలలపై నేరాల్లో ఇవి 16, 17 స్థానాల్లో నిలిచాయి. దేశవ్యాప్తంగా జైళ్ళను తనిఖీచేసి, 16 ఏళ్లు నిండనివారుంటే పరివర్తన గృహాలకు (జువైనల్ హోమ్) తరలించాలని ఢిల్లీ హైకోర్టు గతంలోనే ఎన్‌సీపీసీఆర్ ని ఆదేశించింది. దరిమిలా సామాజికవేత్తలు, న్యాయవాదులతో కూడిన కమిటీలను రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. జిల్లాస్థాయి కమిటీలో నలుగురికి చోటు కల్పించారు. నేరంచేసి పట్టుబడిన బాలలకు సరైన సంస్కారం నేర్పడం, పునరావాసం కల్పించడం చక్కని పరిష్కారమవుతుందని ఐరాస సూచించింది. ఇకదేశంలో బాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాల్సిన అవసరముందని సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల స్పష్టీకరించింది. బాలల నేర న్యాయ చట్టం అమలు గురించి కేంద్రం అరకొరగా ప్రమాణపత్రం దాఖలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది. కేంద్రం సమర్పించిన ప్రమాణ పత్రంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇచ్చిన వివరాలను క్రోడీకరించలేదని పూర్తి సమాచారాన్ని న్యాయస్థానానికి నివేదించలేదని ఆక్షేపించింది. పిల్లలంటే కేంద్రానికి పట్టింపు లేదా అని జస్టిస్ మదన్‌లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. రాష్ట్రాల్లో బాలల హక్కుల రక్షణ కమిషన్‌లు, రాష్ట్ర బాలల సంక్షేమ సొసైటీలు, బాలల నేర న్యాయచట్టం అమలు, జిల్లాల స్థాయిలో బాలల న్యాయబోర్డులపై పూర్తి వివరాలు సమర్పించాలని 6 నెలల క్రితమే ఆదేశించినా సరైన స్పందనలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్లమెంటు ఉభయ సభలూ ఆమోదించిన బాలల న్యాయ (బాలల రక్షణ, సంరక్షణ) చట్టం 2015 ప్రకారం క్రూరమైన నేరాలకు పాల్పడిన వ్యక్తుల వయస్సు 16 నుంచి 18ఏళ్ళ మధ్య ఉంటే వారిని వయోజనులుగా గుర్తించాలా లేదా పిల్లలు గానా అనే విషయాన్ని బాలల న్యాయబోర్డులు నిర్ణయిస్తాయి. నేరం రుజువైతే శిక్ష విధించవచ్చు. మరణశిక్ష, జీవితఖైదు మాత్రం ఉండదు. వారికే ఉద్దేశించిన ప్రత్యేక కేంద్రంలో 21 ఏళ్ళ వయస్సు వచ్చేవరకు ఉంచుతారు. అప్పుడు వారి ప్రవర్తనను అంచనా వేస్తారు. ఒకవేళ నేరస్తుడు పరివర్తన చెందితే శిక్షను తగ్గించవచ్చు. బాలల న్యాయబోర్డులో ఒక సామాజిక శాస్త్రవేత్త ఒక పిల్లల హక్కుల కార్యకర్త ఉంటారు. పిల్లలేం చేస్తున్నారు. ఎలా వ్యవహరిస్తున్నారనే దానిపై కొందరు తల్లిదండ్రులు ఉదాసీనంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. వారు చెడుమార్గంలో పయనిస్తున్నా గుర్తించలేకపోవడంతో విపరీత పరిణామాలు తలెత్తుతున్నాయి. అత్యంత హింసాత్మకమైన నేరాలుగా పరిగణించే వాటిలోనే ఎక్కువ మంది బాలలు నిందితులుగా ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. హత్యలు, హత్యాయత్నాలు దోపిడులు, తదితర నేరాలను పోలీసు శాఖ అత్యంత హింసాత్మక నేరాలుగా పరిగణిస్తుంది. పర్యవేక్షణ లేమి, పెంపకంలో లోపాల ఫలితంగా పిల్లలు పక్కదారి పడుతున్నారని జాతీయ నేర గణాంక సంస్థ తాజా నివేదిక వెల్లడించింది. నేరాలకు పాల్పడుతున్న బాలల్లో అత్యధికులు కుటుంబ సభ్యులతో జీవిస్తున్నవారేనని తెలిపింది. పేదరికం కూడా పిల్లలను తప్పుదారి పట్టిస్తోంది. దొంగతనాలు, దోపిడీల వంటి నేరాలకు పురికొల్పుతోంది. గతంలో పోలీసులకు పట్టుబడే బాలనేరస్తుల్లో ఎక్కువమంది వీధిబాలలు, ఎలాంటి ఆశ్రయం లేనివారే ఉండేవారు. ప్రస్తుతం పరిస్థితి మారిందని అధ్యయనాలు తేల్చిచెబుతు న్నాయి. 2001లో బాల నేరస్తులు చేసిన అత్యాచారాలు 399, 2011 నాటికి అవి 1149కు పెరిగాయని జాతీయ నేర గణాంక సంస్థ నివేదించడం సమస్య తీవ్రతను బయటపెట్టింది. ఈ పరిస్థితుల్లో జెజె చట్టం 2000ను రద్దుచేసి, కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ ప్రక్రియలో కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ, మానవ వనరుల శాఖకు చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘం, ప్రత్యేకంగా ఏర్పాటైన మంత్రుల బృందం పాలు పంచుకున్నాయి. 2012 డిసెంబర్‌లో ఢిల్లీలో నిర్భయ అత్యాచార ఘటన అనంతరం జెజె చట్టాన్ని సవరించాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి. హత్యలు, అత్యాచారాల వంటి ఘోరనేరాలకు పాల్పడే 16-18 ఏళ్ళ బాలలను పెద్దవారితో సమానంగా పరిగణించి శిక్షించాలన్న వాదన గట్టిగా వినిపిస్తోంది. కొందరు బాలలు కౌమారంలోకి అడుగుపెట్టే దశలో జల్సాలకు అలవాటుపడి డబ్బులకోసం చోరీలు చేస్తున్నారు. వివిధ ఆకర్షణలకు లోనై మహిళలను వేధిస్తున్నారు. చెడు సావాసాల ప్రభావంతో హింసాత్మక నేరాలకు పాల్పడుతు న్నారు. బాల నేరగాళ్ళలో 41, 45 శాతం ప్రాథమిక విద్యతో ఆపేసిన వారేనని ఓ అధ్యయనం తేల్చింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, విద్యానేపథ్యం, చెడు స్నేహాలు, తల్లిదండ్రుల అజాగ్రత్త వంటివి. ఇలాంటి ఘటనలకు ముఖ్య కారణాలుగా స్పష్టీకరించింది. నేరాల్లో బాలల ప్రమేయం ఏటేటా పెరుగుతూనే ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితి సరికొత్త సామాజిక సమస్యగా పరిణమిస్తోంది. గత ఏడాది బాలలు పాల్పడిన 638 నేరాలు హింసాత్మకమైనవని వెల్లడైంది. తెలుగు రాష్ట్రాల్లో నమోదైన 802 నేరాల్లో 1229 మంది బాలలు నిందితులుగా ఉన్నారు. వారిలో 910 మంది (74.04 శాతం) తల్లిదండ్రుల దగ్గర పెరుగుతున్నారు. మహిళలను వేధించడం, కించపరచడం వంటి నేరాలకు సంబంధించి బాలలపై 49 కేసులు నమోదయ్యాయి. వీటిలో లైంగిక వేధింపులపై ఏడు కేసులున్నాయి. పదో తరగతి లోపు విద్యార్హతలు కలిగిన పిల్లలే ఎక్కువమంది ఉన్నారు. కిందటేడాది బాల నేరస్థులకు సంబంధించి 871 కేసులు నమోదయ్యాయి. 1018 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు పాల్పడిన నేరాల్లో 57.74 శాతం దోపిడీలు, బందిపోట్లు, దొంగతనాలు చోరీల కేసులున్నాయి. మహిళలపై అకృత్యాలకు సంబంధించిన కేసులు 11.36 శాతం ఉన్నాయి. బాల నేరస్థుల్లో 83 శాతం, రూ.50 వేల లోపు వార్షిక ఆదాయం కలిగిన కుటుంబాలకు చెందిన వారేనని గణాంకాలు చెబుతున్నాయి. బాల నేరస్థులకు రక్షణ, పునరావాసం కల్పించడం ఎంత ముఖ్యమో, వాళ్ళచేతిలో అఘాయిత్యాలకు గురికాకుండా మహిళలు, ఇతరులకు రక్షణ కల్పించడమూ అంతే ప్రధానం. బాలనేరస్థుల (జువైనల్ జస్టిస్ జెజె) చట్టం-2000 ప్రకారం బాలలకు జైలు శిక్ష నిషిద్ధం, హత్య, అత్యాచారం, దోపిడీ వంటి ఘోరాలకు పాల్పడే బాలల సంఖ్య పెరిగిపోతున్న దృష్ట్యా జెజె చట్టానికి సవరణలు తేవాలని సర్వోన్నత న్యాయస్థానం 2011 లోనే అటార్నీ జనరల్‌ను కోరింది. నేరస్థుడిది చిన్న వయస్సు కాబట్టి తాను చేసిన పని ఎక్కడికి దారితీస్తుందో తెలియదనుకోవాలా, మనసు ఎదగలేదు కాబట్టి అతడు చేసింది నేరం కాదని నిర్ధారించవచ్చునా, బాలనేరస్థుడి దృష్టిలో హతుడి ప్రాణాలకు విలువే లేదా అని ఓ హత్య కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రశ్నించింది.

● కీర్తి నాగరాజు, 9652404611

శాంతి, సౌభాగ్యాలకు ఆసియాన్ బంధం

ఆసియా- పసిఫిక్ ప్రాంతంలో శాంతి సౌభాగ్యాలు నెలకొనడానికి భారత - ఆసియన్ దేశాల బంధం మరింత బలపడాలని కొత్త ఢిల్లీలో నిర్వహించిన అగ్రనాయక సమావేశం అభిప్రాయ పడటం సముచితమూ, అవసరమూ, అభిలషణీయమూ. భారత 69వ గణతంత్ర దినోత్సవాలకు 10 ఆసియన్ దేశాల అధినేతలను గౌరవ అతిథులుగా ఏకకాలంలో ఆహ్వానించడం ద్వారా ఈ దేశాలతో ఆర్థిక, వాణిజ్య, స్నేహ, సుహృద్భావ సంబంధాలను మరింత దృఢపరచుకునే మోడీ ప్రభుత్వ యత్నాలు అభినందనీయం. ఆగ్నేయాసియా దేశాలతో స్నేహసంబంధాలను పెంపొందించుకోవడానికి భారత్ 25 ఏళ్ళ క్రితమే తూర్పు వైపు చూపును ప్రసరించి ఆ దిశగా అనేక ప్రయత్నాలు సాగిస్తూ ఇప్పుడు ఢిల్లీలో రజతోత్సవ సంబరాలను- గణతంత్ర దినోత్సవ వేడుకలతో మేళవించి తన సైనిక పాటవాన్ని ఆర్థిక వాణిజ్య, వైవిధ్య భరిత సాంస్కృతిక వైభవాన్నీ ప్రదర్శించి అధినేతలను ఆకట్టుకోవడం ముదావహం. నిజానికి ఆగ్నేయాసియా దేశాలతో భారత్ చారిత్రక మైత్రీ వాణిజ్య - సాంస్కృతిక బంధం 2 వేల ఏళ్ళనాటిది. కాంబోడియాలోని అంగ్‌కోర్ (విష్ణు) దేవాలయ సముదాయం, ఇండోనేసియా లోని బోరోబుదార్, ప్రంబనన్ మలేసియాలోని కేడాలో ప్రాచీన ఆలయాలూ, భారత హిందూ, బౌద్ధ సంస్కృతులతో ప్రభావితమై నిర్మించినవే. ఇండోనేసియా, బర్మా (మయన్మార్), థాయ్‌లాండ్ సహా అనేక ఆగ్నేయాసియా దేశాల్లో రామాయణం స్థానిక సంస్కృతులతో మమేకమై వివిధ రూపాల్లో నృత్య నాటికలుగా ప్రదర్శిత మవుతుండటం శతాబ్దాలుగా సాగుతున్న సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకే. ప్రస్తుతం ఏసియన్ దేశాల సంఘానికి సింగపూర్ ప్రధాని లీసియేన్ లూంగ్ అధ్యక్షత వహిస్తున్నారు. నగర దేశమైన సింగపూర్ సంస్కృత నామం సింహపురి భారత్ 1992 లో ఆసియన్ దేశాలచర్చల్లో భాగస్వామి అయి. 2005 నుండి తూర్పు ఆసియా దేశాల శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొంటూ, 20వ వార్షికోత్సవం సందర్భంగా 2012 లో వ్యూహాత్మక భాగస్వామిగా ఎదిగింది. భారత - ఏసియన్ స్వేచ్ఛా వాణిజ్య అవగాహనలో భాగంగా 1993లో కేవలం 29 బిలియన్‌లుగా వున్న వాణిజ్యం 2016 నాటికి 78 బిలియన్‌లకు పెరిగింది. సామాజిక -సాంస్కృతిక రంగంలో ఏసియన్ -భారత విద్యార్థుల మార్పిడి, ఢిల్లీలో వార్షిక చర్చల ద్వారా విద్యా, వాణిజ్య వేత్తలు, యువత మధ్య పరస్పర ప్రయోజనకరమైన సత్సంబంధాలు నెలకొన్నాయి. ఏషియన్ దేశాలతో వాణిజ్యం, అనుసంధానత, సాంస్కతిక సంబంధాల పెంపుదలకు భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఏసియన్ సభ్యదేశాలు బర్మా, కాంబోడియా, వియత్నాం, సింగపూర్, లావోస్, ఫిలిప్పీన్స్, మలేసియా, థాయ్‌లాండ్, బ్రునై, ఇండోనేసియా. భారత్ ఏసియన్ దేశాలు 180 కోట్ల జనాభాతో ప్రపంచ జనాభాలో నాలుగో స్థానంలో ఉన్నాయి. ఈ దేశాల ఉమ్మడి జిడిపి 4.5 ట్రిలియన్ లకు పెరుగుతుందని అంచనా.

భారత్ 2025 కి ప్రపంచంలో 5వ పెద్ద వినియోగదార్ల మార్కెట్‌గా అవతరించనుంది. ఆగ్నేయాసియాలో మధ్యతరగతి కుటుంబాలు 16.3 కోట్లకు పెరగనున్నాయి. 2020 నాటికి భారత జనాభాలో సగటు వయస్సు 29 ఏళ్ళ లోపే. వచ్చే మూడేళ్ళలో నవయువ భారతం అవతరించనుండగా, అప్పటికి ఏసియన్ దేశాల జనాభాలో 60 శాతం 35 ఏళ్ళ లోపువారే. ఈ యువ శ్రామిక శక్తితో ఉభయులూ సమిష్టిగా శ్రమిస్తే వివిధ రంగాల్లో పరస్పర ప్రయోజనకరమైన అద్భుత ఫలితాలను సాధించడానికి ఎన్నో అవకాశాలున్నాయి. ఏషియన్ దేశాలతో భారత వాణిజ్యం 2016 నాటికి కేవలం 2.6 శాతమే. అందువల్ల ఆర్థిక - వాణిజ్య సంబంధాలను మరింత పెంపొందించుకోవడానికి, ప్రాంతీయ భాగస్వామ్య ఒప్పందాల ద్వారా ప్రయత్నాలు సాగిస్తే, ప్రపంచ జనాభాలో దాదాపు సగం, ఆసియా సమగ్ర మార్కెట్‌ను అభివృద్ధి చేసుకుని ప్రయోజనం పొందడానికి సమిష్టి ప్రయత్నాలు సాగించాలి. భూతల, గగనతల, సముద్ర రవాణా మార్గాలను ప్రజల రాకపోకలను మరింత పెంచే విధంగా అభివృద్ధి చేయడం అందరికీ ఉపయోగం. భారత్ - బర్మా, థాయ్‌లాండ్ రహదారి మార్గం అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు భారత్ 100 కోట్ల డాలర్ల సాయం అందించడం ప్రయోజనకరమే. రవాణా మార్గాల అభివృద్ధితో భారత్ ఏసియన్ దేశాలు కొత్త మార్కెట్‌లను అన్వేషించుకుని, వాణిజ్యం, పెట్టుబడులు, వినోద పర్యటనలను పెంచుకోవచ్చు. డిజిటల్ అనుసంధానంతో సత్ఫలితాలు పొందవచ్చు. భారత ప్రభుత్వం ఇటీవల 100 ఆకర్షణీయ నగరాల అభివృద్ధికి చర్యలు చేపట్టిన పూర్వరంగంలో సింగపూర్ తదితర దేశాలు సహకారంతో జీవించడానికి అనువైన పర్యావరణ రహిత నగరాలను నిర్మించుకోవచ్చు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి నగర నిర్మాణంలో అత్యాధునిక సౌకర్యాలను, పర్యావరణ ప్రమాదరహిత చర్యలనూ అమలు చేయొచ్చు.

ఆసియన్ దేశాల అనుభవాలను స్వీకరించి ఉగ్రవాద నిర్మూలనకై, యువతలో ఉన్మాద మతభావనలు - ద్వేషాలు రగిలించి వారిని ఉగ్రవాదులుగా మార్చే యత్నాల నిరోధానికి ప్రపంచ సమావేశాన్ని నిర్వహించాలని ప్రధాని నరేంద్రమోడీ తలపెట్టారు. ఉగ్రవాదానికి సరిహద్దులు, మతం లేదని, మానవాళికి తెలిసిందే.

ఆసియన్ దేశాలతో సామాజిక, విద్యాసంబంధాల వృద్ధికి భారత్ ఐఐటి లలో చదివేందుకై 1000 మంది ఆసియన్ విద్యార్థులు పిహెచ్‌డి చేసేందుకు ఫెలోషిప్‌లు ఇవ్వాలని భారత్ సంకల్పించడం హర్షణీయం. ప్రధాని నరేంద్రమోడీ, ఇండోనేసియా అధ్యక్షుడు జోకోవిదోదో, మలేసియా ప్రధాని నజీబ్ రజాక్, లావోస్ ప్రధాని డోంగ్లాన్ సిసోలిక్‌లతో రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు ఇతర ద్వైపాక్షిక అంశాలపై చర్చలు సత్ఫలితాల దిశగా జరిగాయి. పశ్చిమ దేశాల్లో దశాబ్ద కాలంగా ఆర్థిక మాంద్యం ఆవరించిన కారణంగా వస్తువులకు గిరాకీ తగ్గినందున భారత- ఆసియన్ దేశాలు తమ వస్తువుల కోసం కొత్త మార్కెట్‌లకై పరస్పర ప్రయోజనకరంగా వాణిజ్యాన్ని పెంపొందించుకోవడం అవసరమైంది. అదీగాక ఇటీవల అమెరికా- చైనా, అమెరికా- రష్యాల మధ్య ఆర్థిక, రాజకీయ, వాణిజ్య వైరాలు అధికమైనందున, ఆసియా -పసిఫిక్ ప్రాంతంలో ప్రాబల్య విస్తరణకు, ఆర్థిక - సైనిక పాటవాన్ని ప్రదర్శించే చైనా దూకుడును నిలువరించాలంటే, సముద్ర మార్గాల్లో నిరాటంకంగా ముఖ్యంగా దక్షిణ చైనా సముద్రంలో చైనా ప్రాబల్యాన్ని కట్టడి చేయాలంటే భారత్ - ఆసియన్ దేశాలు ఉమ్మడి వాణిని శక్తివంతంగా వినిపించాల్సి ఉంది. చైనా ఒకే బెల్ట్ -రోడ్ సంధాన ప్రతివాదన, పాక్‌గదర్ రేవుకు ఆక్రమిత కాశ్మీర్ ద్వారా ఆర్థిక కారిడార్ ద్వారా ప్రాబల్య విస్తరణ - పాక్‌ను భారత్‌కు వ్యతిరేకంగా ఎగదోసే వ్యూహాలు పన్నుతున్నందున ఆగ్నేయాసియా దేశాలతో సహకారాన్ని, మైత్రిని భారత్ మరింత పెంపొందించుకోవలసిన అవసరం ఏర్పడింది.

భారత - ఏసియన్ వాణిజ్యం 2014 - 15 నాటికి కేవలం 76.53 బిలియన్‌లు కాగా ఏసియన్‌తో చైనా వాణిజ్యం విలువ 452 బిలియన్‌లు. ఏసియన్ దేశాల్లో 2016 నాటికి భారత పెట్టుబడులు కేవలం 224 మిలియన్‌లు కాగా చైనా పెట్టుబడులు 3 బిలియన్ డాలర్లు, థాయ్‌లాండ్ రాజధాని బాంకాక్- బర్మా రాజధాని రంగూన్- భారత రాజధాని ఢిల్లీ మధ్య రోడ్డు, రైలు మార్గాల నిర్మాణం పూర్తికావాలంటే అది బంగ్లాదేశ్ మీదుగానే జరగాలి. దక్షిణాసియా దేశాల నేతగా ఎదగాలనుకుంటున్న భారత్ - పాక్‌ను పక్కన బెట్టి బంగ్లా తదితర దేశాలతో సంబంధాలు పెంచుకుంటే అది ఉభయతారకం కాగలదు. ఐటి రంగంలో మేటిగా, ఔషధాలు, తక్కువ ధరకే ప్రాణాధార మందుల ఉత్పత్తిలో ప్రముఖ దేశంగా, క్రమశిక్షణ గల శ్రామికశక్తి గల భారత్ ఆసియాలో ఇతర దేశాల్లో తన సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేక పోతున్నది చైనా - తూర్పు ఆసియా దేశాలకు మలక్కా జలసంధి ద్వారా ఆ 80 శాతం సరకుల రవాణా జరుగుతున్నందున ఇండోనేసియాతో కలసి హిందూ మహాసముద్ర రవాణా నుండి ప్రయోజనం పొందేందుకు భారత్ ప్రయత్నించాలి. భారత్ అమెరికాకు దగ్గరవుతోందనే దుగ్ధతో చైనా పాక్‌ను భారత వ్యతిరేక శక్తులను దువ్వడం కొనసాగిస్తూనే ఉంది. చైనాతో డొక్లాం, ఇతర సుదీర్ఘ సరిహద్దు వివాదాలున్నా పరస్పర ప్రయోజనకర రీతిలో ద్వైపాక్షిక సంబంధాల వృద్ధికి ప్రయత్నాలు సాగించాలి. చైనా తన చౌక ఉత్పత్తులను భారత్ పెద్ద మార్కెట్‌గా పరిగణిస్తున్నందున వాటిని ఏదో రూపంలో చేరవేస్తోంది. బర్మా అధినేత్రి అంగ్‌సాన్ సూకీ సహా 10 ఆసియన్ దేశాల అగ్రనాయకులు శిఖరాగ్ర సమావేశం, భారత గణతంత్ర దినోత్సవాలలో వారికి గౌరవ అతిథులుగా విశిష్ట ఆతిథ్యమిచ్చి సుహృద్భావాన్ని ప్రోది చేశారు. రానున్న కాలంలో ఆర్థిక, వాణిజ్య, సాంస్కృతిక, రాజకీయ సంబంధాలను దృఢపరచుకునే ప్రయత్నాలను భారత్ - ఏసియన్ దేశాలు కొనసాగిస్తే అది ఉభయతారకం కాగలదు.

❑ పతకమూరు దామోదర్ ప్రసాద్
సీనియర్ జర్నలిస్ట్, 9440990381

'కరంజ్' జలప్రవేశం



ముంబై : స్కార్పిన్ శ్రేణి సబ్ మెరైన్లలో మూడో సబ్‌మెరైన్ ఐఎన్ ఎస్ కరంజ్ బుధవారం జల ప్రవేశం చేసింది. ముంబైలోని మజ్‌గావ్ డాక్ యా ర్డులో కరంజ్‌ను నేవీ అధికారులు అధికారిక లాంఛనా లతో నిర్వహించింది. ఈ కార్య క్రమానికి నేవీ చీఫ్ సునీల్ లాంబా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫ్రాన్స్ సాంకేతిక సహకారంతో మజ్‌గావ్ డాక్‌లో స్కార్పిన్ తరగతికి చెందిన ఆరు సబ్ మెరైన్లను భారత్ రూపొందిస్తున్నది. నీటి లోపల శత్రువుల సోనార్‌కు తన ఉనికిని తెలియనివ్వకుండా దాడులు చేయగల సామార్థ్యం దీనికి ఉంది.

బీఎస్ఎఫ్, ఐటీబీపీలకు రూ.370 కోట్లు: కేంద్రం

ఇటీవల కాలంలో సరిహద్దు దేశాలతో ఏర్పడుతున్న వివాదాలు, ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ భద్రతకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ కేంద్రం నిర్ణయాలు తీసుకుంటోంది. ఇం దులో భాగంగా కేంద్ర హోం మం త్రిత్వ శాఖ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), ఇండో-టిబెట్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ)లకు 369.84 కోట్ల రూపాయలను విడుదల చేసింది.

● కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కాస్లీ జాకెట్ రాజకీయ వర్గాల్లో పెను దుమారాన్ని రేపుతోంది. రాహుల్ జాకెట్‌పై అధికార, ప్రతిపక్షాల మ ధ్య మాటల యుద్ధం నడుస్తున్నది. రాహుల్ ధరించిన ఖరీదైన జాకెట్‌పై మేఘాలయ బీజేపీ నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధించడంతో కమలం, హస్తం పార్టీల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు సాగుతున్నాయి.

మోడీ ఎన్నికల బడ్జెట్ నేడే

● ఇదే ఆఖరి బడ్జెట్ ● ఉదయం 11గంటలకు ప్రవేశపెట్టనున్న జైట్లీ ● వరుసగా అయిదు బడ్జెట్లు ప్రవేశపెట్టిన మంత్రిగా రికార్డు ● ఎన్నికల బడ్జెట్‌పై అందరిలోనూ ఆశలు ● వ్యవసాయానికి పెద్దపీట వేసే అవకాశం!



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్రమోడీ ప్రభుత్వం పూర్తి స్థాయి ఆఖరి సాధారణ బడ్జెట్ నేడు ప్రవేశపెట్టనుంది. గురువారం ఉదయం 11గంటలకు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ముహూర్తం ఖరారైంది. మహారాష్ట్ర ఎంపీ చింతమాన్ వనగా (67) బుధవారం ఆకస్మికంగా చనిపోయిన నేపథ్యంలో సభ ఆయనకు నివాళి అర్పించిన అనంతరం బడ్జెట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. గత ఏడాది కూడా బడ్జెట్ సమయంలోనే ఓ ఎంపీ చనిపోవడంతో సంతాపం ప్రకటించిన అనంతరం బడ్జెట్‌ను కొనసాగించారు. వరుసగా అయిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన అయిదో ఆర్థిక మంత్రిగా అరుణ్‌జైట్లీ రికార్డు లకెక్కున్నారు. ఇప్పటిదాకా మొరార్జీదేశాయ్, మన్మోహన్‌సింగ్, యశ్వంత్‌సిన్హా, చిదంబరం మాత్రమే వరుసగా అయిదుకు మించి బడ్జెట్లు ప్రవేశపెట్టారు. ఎన్నికల ఏడాది 2018-19 సంవత్సరానికి గాను ప్రవేశపెడుతున్న ఈ బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలకు, గ్రామీణ, వ్యవసాయరంగాలకు, ఆదాయ పుప న్ను మినహాయింపు తదితర అంశాల్లో సామాన్యుడికి ఊరట కల్పిస్తారనే అంచనాలు వినిపిస్తున్నాయి. జీఎస్టీ అమలు తర్వాత ప్రవేశపెడుతున్న బడ్జెట్ స్వరూపం ఎలా ఉంటుం దనేది అందరిలోనూ ఆసక్తి నెలకొంది. అయితే మధ్య తరగతి ప్రజలకు మేలు చేసే విధంగా వ్యక్తిగత ఆదాయపు పన్ను పరి మితిని పెంచుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఎన్నికల బడ్జెట్ కావడంతో మోడీ తనస్వభావానికి విరుద్ధంగా సామాన్యులపై వరాల వానకురిపిస్తారేమోనని ఆశిస్తున్నారు. అన్ని రంగాల నుంచి ఈ బడ్జెట్‌పై భారీగా ఆశలు నెలకొన్నాయి. జిడి పి వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 77.5 శాతం గాఉంటుందని అంచనాలు వేసిన నేపథ్యంలో సామాన్యులకు ఊరట కల్పిస్తారని ఆశిస్తున్నారు. బడ్జెట్ తయారీ వెనుక పెద్ద కసరత్తు దాగి ఉంటుంది. బడ్జెట్ పత్రాల రూపకల్పనకు రెండు నెలల ముందు నుంచే ఈ ప్రక్రియ కొనసాగుతున్న నార్త్‌బ్లాక్ ఆర్థికశాఖ కార్యాలయంలో నిషేధాజ్ఞలు అమలవుతాయి. ఇం దులో భాగస్వాములయ్యే వారిని కూడా చివరి దశలో కార్యాలయంలోనే ఉండేలా ఏర్పాట్లు చేసస్తారు. పూర్తి నిఘా మ ధ్యలో అత్యంత రహస్యంగా ఈ బడ్జెట్ పత్రాలు తయా రవుతాయి.

వ్యవసాయానికి పెద్దపీట!

రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్రపతి ప్రసంగంలో వెల్లడించడంతో ఆ రంగానికి ఈ బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయిస్తారని అంచనా వేస్తున్నారు. వ్యవసాయరంగాన్ని చేయూతనిచ్చేందుకు పలు చర్యలు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గుజరాత్ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బాగా దెబ్బతిన్న నేపథ్యంలో రైతులపై వరాల జల్లు కురిపించే అవకాశాలున్నాయి. అలాగే ఉపాధికల్పన కోసం భారీగా పెట్టుబడులు ఆకర్షించేందుకు అవసరమైన ఆర్థికచర్యలు ప్రకటిస్తారని ఆర్థికరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

రైల్వే భద్రతపై దృష్టి

రైల్వే రంగానికి సంబంధించినంత వరకు భద్రతకు పెద్దపీట వేస్తారని అంచనా వేస్తున్నారు. ఇటీవల కాలంలో భారీ రైలు ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో దిద్దుబాటు చర్యల కోసం భద్రతకు నిధులు కేటాయిస్తారని తెలిసింది. అలాగే అన్ని రైళ్లలో సిసిటీవీలు అమర్చేందుకు భారీగా నిధులు వెచ్చించనున్నట్లు సమాచారం. రైల్వేల కోసం సాధారణ బడ్జెట్ నిధులపై ఆధారపడకుండా అంతర్గతంగా సమకూర్చుకోవాలని రైల్వేశాఖ నిర్దేశించుకుంది. రైల్వే మౌలిక సదుపాయాలను భారీస్థాయిలో అభివృద్ధి చేసే దిశగా చర్యలు ప్రకటించే అవకాశముంది.

తక్కువ పన్ను... రైతుకు దన్ను


● వైద్యం, విద్యకు అధిక కేటాయింపులు ● జైట్లీ పద్దుపై ప్రజల మనోగతం



న్యూఢిల్లీ: కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్ ఎలా ఉండాలి? ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి? సామాన్య మధ్యతరగతి ప్రజానీకం మొదలు సంపన్నులు, ఉద్యోగులు, మహిళలు, పారిశ్రామికవేత్తలు జైట్లీ పద్దునుంచి ఏం కోరుకుంటున్నారనే అంశాలపై జాతీయ స్థాయిలో నిర్వహించిన ఓ సర్వేలో ప్రజలు తమ మనోభావాలను వెల్లడించారు. మెజార్టీ ప్రజలు తక్కువ పన్నులు.. పారదర్శక ఇంధన పాలసీ.. వ్యవసాయానికి ప్రోత్సాహం అవసరమని అభిప్రాయపడ్డారు. సర్వేలో యువ ఉద్యోగులు (35శాతం), విద్యార్థులు (5శాతం), వృద్ధులు (33శాతం), రిటైర్డ్ ఉద్యోగులు (10శాతం), ఇతరులు (9శాతం), వ్యాపార, వాణిజ్య (8శాతం) రంగాలకు చెందిన వారి తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

- ఎవరికి ఎక్కువ మేలు జరిగే అవకాసం ఉందన్న ప్రశ్నకు 65 శాతం మంది 'వేతన జీవులు, మధ్యతరగతికి' లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా, 28 శాతం మంది మాత్రం రైతులు, వ్యవసాయ కార్మికులకు లబ్ధి చేకూరుతుందని అంచనా వేశారు.
- ఇంధనంపై పన్ను పాలసీ విధానాన్ని పూర్తిగా ఎత్తివేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రస్తుత విధానం నుంచి దీన్ని తొలగించి, పన్ను వ్యవస్థలో మార్పులు తేవడం ద్వారా మరింత పారదర్శకతకు దారులు వేయాలని కోరుతున్నారు. అసలు దీన్ని జీఎస్టీ పరిధిలో తేవడమే అసలైన పరిష్కారమని 63 శాతం మంది స్పష్టం చేశారు.
- ఇక కీలకమైన ఆదాయపన్ను పరిమితిని పెంచాలన్నదే అత్యధికుల వాదన. ప్రస్తుతం ఉన్న గరిష్ఠపరిమితి లోని 10-15 లక్షల శ్లాబ్‌ను పెంచాలని 40శాతం మంది సూచిస్తున్నారు. అదేసమయంలో 2.5-5 లక్షల శ్లాబ్‌ను మరింత పెంచాలని 36శాతం మంది అభిలషిస్తున్నారు. సెక్షన్ 80 సి కింద పన్ను రాయితీని 1.5 లక్షలకు విస్తరించాలని 46 శాతం మంది డిమాండ్ చేస్తున్నారు. ఆదాయపన్ను వడ్డింపులు తక్కువగా ఉండాలని దాదాపు 80 శాతం మంది ప్రజలు కోరుతున్నారు. ఇదిలావుండే దేశం కోసం మరిన్ని పన్నులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని 4 శాతం మంది పేర్కొనగా, 13 శాతం మంది మాత్రం ప్రస్తుత పన్ను శ్లాబుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.
- తక్కువ పన్నులపై భారీ ఆశలున్నాయి. 37 శాతం మంది గరిష్ఠ పన్ను 25శాతానికి దిగొస్తుందని అంచనా వేస్తుండగా, ప్రస్తుత ఆదాయపన్నుతోపాటు కార్పొరేట్ పన్నులు దిగొస్తాయని 25శాతం మంది పేర్కొన్నారు. చైనా, ఇతర పొరుగు దేశాలతో పోల్చుకుంటే పన్ను రేటు పోటీని ఎదుర్కొంటుందని 19శాతం మంది తెలిపారు. 14శాతం మంది మాత్రం ఎలాంటి మార్పులు అవసరం లేదన్నారు. 5శాతం మంది పన్నులు పెరగాలని ఆకాంక్షిస్తున్నారు.
- మొత్తం సర్వేలో మరో ప్రాధాన్యతాంశం ఏమంటే వృద్ధులకు ఆరోగ్య రక్షణ. సర్వేలో ఈ అంశానికి సంపూర్ణ మద్దతు లభించింది. దీంతోపాటు వైద్య ఆరోగ్యానికి పెద్దమొత్తంలో కేటాయింపులు ఉండాలన్న డిమాండ్లు వినిపించారు. వ్యవసాయం, ఆరోగ్య రంగాలకు ఆర్థికమంత్రి పెద్దపీట వేయాలని కోరారు.
- సీనియర్ సిటిజన్లకు దన్నుగా నిలిచేలా సులభతర ఆరోగ్య పాలీసీ ఉండాలని 44శాతం సూచిస్తున్నారు. వారి ఆదాయంలో గరిష్ఠభాగానికి పన్ను లేకుండా చూడాలని 36శాతం మంది పేర్కొన్నారు. ప్రయాణాల్లో రాయితీలు ఉండాలని సూచిస్తున్నారు.
- క్రిప్టోకరెన్సీపై ప్రభుత్వం స్పష్టత ఇస్తుందని ఎక్కువ మంది భావిస్తున్నారు. బిట్‌కాయిన్, ఇతర క్రిప్టోకరెన్సీపై స్పష్టత వస్తుందని 40 శాతం మంది ఆశిస్తుండగా, దీన్ని చట్టబద్ధం చేయాలని 24 శాతం కోరుతున్నారు.
- వైద్యం, విద్య, విద్యుత్, విద్యుదీకరణ, రక్షణ, రైల్వే రంగాలకు అదనంగా నిధుల కేటాయింపు ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వైద్యానికి జైట్లీ పెద్దపీట వేస్తారని 42శాతం, విద్యకు ప్రాధాన్యత ఉంటుందని 35శాతం మంది చెప్పారు. రక్షణరంగ కేటాయింపులకు 8శాతం మంది మద్దతు పలికారు.
- జీఎస్టీ శ్లాబుల కుదింపు అంశానికి అనుకూలంగా జైట్లీ నిర్ణయం ఉంటుందని 45 శాతం మంది పేర్కొనగా, ఈ నిర్ణయాన్ని కౌన్సెల్‌కే వదిలేస్తారని 42శాతం మంది అభిప్రాయపడ్డారు. ఇటీవల కాలంలో చేపట్టిన మార్పులు సరిపోతాయని 7శాతం మంది చెప్పారు.
- రానున్న బడ్జెట్ అంచనాల్లో తయారీ రంగం జీడీపీకి ఊతమిస్తుందని 39 శాతం మంది, దేశీయ వినిమయం ప్రభావితం చేస్తుందని 29శాతం మంది, సేవారంగవృద్ధి కీలకం అవుతుందని 12శాతం మంది చెప్పుకొచ్చారు.

బడ్జెట్ పెట్టె



న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ ప్రక్రియలోని వివిధ సంప్రదాయాలు, ఆసక్తికర వాస్తవాలు ఎన్నో ఉన్నాయి. హల్వా వేడుక మొదలు ముదురు ఎరుపు రంగు సూట్‌కేస్ దాకా బడ్జెట్ సంప్రదాయంలో భాగంగా ఉన్నాయి. బడ్జెట్ రోజు పార్లమెంటుకు బయలుదేరే ముందు ఆర్థిక మంత్రి ముదురు ఎరుపు రంగు లెదర్ సూట్‌కేసును చూపించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంప్రదాయం 18వ శతాబ్దంలో బ్రిటీషు సామ్రాజ్యం నాటిది. దీని పట్ల భారత్ కూడా మక్కువ చూపిస్తూ వస్తోంది. నేటికీ మనదేశంలో ఈ సంప్రదాయం బడ్జెట్ రోజు ప్రస్ఫుటమవుతున్నది.

సూట్‌కేసు చరిత్ర

ప్రప్రథమంగా 1960లో ఈ తరహా బడ్జెట్ పెట్టెను నాటి బ్రిటన్ చాన్స్‌లర్ కోసం రూపొందించారు. ఆ తర్వాత విలియం ఇవార్ట్ గ్లాడ్‌స్టోన్ హయాంలో, లెదర్ కవర్ అతికించిన చెక్క పెట్టెలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చారు. పెట్టెపై భాగంలో మూడు వరుసల్లో నల్లని గీతలతో డిజైన్ ఉండేది. దీనికంటే ముందు, చాన్స్‌లర్లు ఆర్థిక పాలసీ ప్రకటను లెదర్ బ్యాగుల్లో సాధారణ సభకు తీసుకొచ్చేవారు. సుదీర్ఘ ప్రసంగానికి అనుగుణంగా డాక్యుమెంట్లను భద్రపరిచేందుకు పెట్టెను అందుబాటులో ఉంచాలని గ్లాడ్‌స్టోన్ ఆదేశించినట్లు చరిత్ర చెబుతున్నది. బడ్జెట్ అనే పదం బౌగెట్టె అనే ఫ్రెంచి పదం నుంచి వచ్చింది. బౌగెట్ అంటే చిన్న సంచి అని అర్థం. కాలక్రమంలో దీనిని బ్రిటన్‌లో బడ్జెట్ పెట్టెగా వ్యవహరించారు. ఇప్పటికీ భారత్ ఈ పెట్టెలో బడ్జెట్ ప్రతులను ఉంచేసంప్రదాయాన్ని పాటిస్తున్నది.

- బ్రిటన్‌లో ఓ సంప్రదాయం ఉండేది. అధికారంలో నుంచి తప్పుకుంటున్న చాన్స్‌లర్ తదుపరి చాన్స్‌లర్‌కు ఎర్రపెట్టెను ఇవ్వడం ఆనవాయితీ. అయితే 2011లో జార్జ్ ఒస్బోర్న్ హయాంలో ఈ బాక్సును మార్చివేశారు. కొత్త బాక్సును ప్రవేశపెట్టారు. నాటి బాక్సు మరీ పాతదై, చిరుగులు పట్టడంతో కొత్తదాన్ని సిద్ధంచేశారు. అయితే, బ్రిటన్‌లో మాదిరిగా తదుపరి ఆర్థికమంత్రికి ఎర్రపెట్టెను ఇచ్చే ఆనవాయితీ లేకున్నా, బడ్జెట్‌నాడు మాత్రం ఎర్రపెట్టెను ఆర్థికమంత్రి చేబూనడం కొనసాగుతున్నది.

వేర్వేరు ఆర్థికమంత్రులు, వేర్వేరు నమూనాలు..

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో బడ్జెట్ రోజు సూట్‌కేసు పట్టుకునే సంప్రదాయానికి భారత్‌లో తొలి ఆర్థికమంత్రి ఆర్.కె.షన్ముఖం శెట్టి శ్రీకారం చుట్టారు. 1947 నవంబర్ 26న ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. మన్మోహన్ హయాంలో గ్లాడ్‌స్టోన్ తరహా బాక్సును ఉపయోగించేవారు. కాకుంటే నలుపు రంగులో ఉండేది. చిదంబరం కూడా బ్రిటీషు నమూనా సూట్‌కేసునే చేపట్టారు. 1998-99 కాలంలో యశ్వంత్ సిన్హా నల్లరంగు లెదర్ బ్యాగును వాడారు. దానికి బకెల్స్, తొడుగులు ఉండేవి. యూపీఏ హయాంలో ఆర్థికమంత్రిగాఉన్న ప్రణబ్ ముఖర్జీ తిరిగి ఎరుపు రంగు సూట్‌కేసును వెలుగులోకి తెచ్చారు. ప్రస్తుత ఆర్థికమంత్రి జైట్లీ 2015నుంచి ట్యాన్ సూట్‌కేసునే వాడుతున్నారు.

బడ్జెట్ వేళల్లో మార్పులు..

- 21వ శతాబ్దంలో బడ్జెట్ ప్రవేశపెట్టడంలో చిన్నచిన్న మార్పులు చోటుచేసుకున్నాయి. 2001లో యశ్వంత్ సిన్హా ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అంతకు ముందు వరకు సాయంత్రం 5గంటలకు ప్రవేశపెట్టే సంప్రదాయం ఉండేది. బ్రిటీషు కాలం నుంచి వస్తున్న ఆచారాన్ని యశ్వంత్‌సిన్హా బ్రేక్ చేశారు. అప్పట్లో లండన్‌లోనూ, ఢిల్లీలోనూ ఒకే సమయంలో బడ్జెట్ పార్లమెంటుకు వచ్చేది.
- 1982లో సుమారు 1.35 గంటలపాటు ప్రణబ్ బడ్జెట్ ప్రసంగం వినిపించారు. అప్పట్లో పొట్టి ఆర్థికమంత్రి సుదీర్ఘ ప్రసంగంగా నాటి ప్రధాని ఇందిరా గాంధీ కొనియాడారు. ఆ తర్వాత 1991లో సంస్కరణల పర్వంలో వచ్చిన బడ్జెట్ ప్రసంగాన్ని మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టారు. దాదాపు రెండు గంటలు ఏకబిగిన ప్రసంగ పాఠం వినిపించారు. ఈ రికార్డులను 2003లో జశ్వంత్ సింగ్ తిరగరాశారు. రెండు గంటలకు పైగా ప్రసంగం చేశారు.


కేంద్ర బడ్జెట్ ఎలా రూపొందిస్తారంటే!

న్యూఢిల్లీ: మరికొద్ది గంటల్లో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటులో 2018-19 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్ట బోతున్నారు. నరేంద్ర మోడీ సార్థ్యంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఇది ఐదవ బడ్జెట్. మోడీ సర్కార్ పూర్తిస్థాయి చివరి పద్దు కూడా ఇదే. దానికితోడు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ ప్రతికూల ప్రభావాల తర్వాత వస్తున్న బడ్జెట్. ఈ నేపథ్యంలో రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల సమతుల్య మేళవింపు జైట్లీ బృందానికి సవాల్‌గా నిలవనుంది. 2018లో ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు మాత్రమే కాకుండా, 2019లో జరగనున్న 17వ సార్వత్రిక పోలింగ్‌కు ఎన్డీయే ప్రభుత్వం సన్నద్ధం కావాల్సి ఉంది. అందువల్ల ఈ బడ్జెట్‌ను కేవలం ఆదాయ, వ్యయాల గణింపు, కేటాయింపుల ప్రకటనగా గాక, ఎన్డీయే ప్రభుత్వ ఆర్థిక విధానాలను ప్రతిబింబిందే పద్దుగా నిలుస్తుంది. ఇంతటి బృహత్తర ఘట్టాన్ని సుదీర్ఘ సంక్లిష్ట ప్రక్రియగా పేర్కొనవచ్చు. బడ్జెట్ రూపకల్పనలో వివిధ దశలతోపాటు ప్రత్యేకతలను పరిశీలిద్దాం.

☛ కొత్త సంప్రదాయం అమల్లోకి వచ్చిన తర్వాత ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం వరుసగా ఇది రెండో ఏడాది. గతంలో ఫిబ్రవరి 28న కేంద్ర వార్షిక పద్దును ప్రవేశపెట్టేవారు. అనాదిగా వస్తున్న ఈ సంప్రదాయానికి మోడీ ప్రభుత్వం స్వస్తి చెప్పింది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా రైల్వే, సాధారణ సంయుక్త బడ్జెట్‌ను ఆర్థికమంత్రి జైట్లీ ప్రవేశపెడతారు. ☛ ఏయే రంగాలకు ప్రాధాన్యమివ్వాలి? వేటికి ఎంతెంత కెటాయింపులు ఉండాలి? తదితర అంశాలపై సుదీర్ఘ కసరత్తును ఆర్థిక శాఖ నిర్వహిస్తుంది. ఆర్థికవేత్తలు, నిపుణులతోపాటుగా, మంత్రి మండలి సభ్యులతో చర్చిస్తుంది. సంబంధిత మంత్రిత్వశాఖల ప్రతిపాదనలపై అవగాహనకు వచ్చిన పిదప, రాబడులు, కేటాయింపులపై ఆర్థిక మంత్రిత్వశాఖ బడ్జెట్‌ను రూపొందిస్తుంది. ☛ రెండు నెలల ముందుగానే, అంటే డిసెంబర్ మాసంలోనే ప్రభుత్వం బడ్జెట్ ముందు కసరత్తు ప్రారం భిస్తుంది. వివిధ వర్గాలతో, మంత్రులతో సంప్రదింపులు జరుపుతుంది. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, బ్యాంకులు, వ్యవసాయవేత్తలు, ఆర్థికవేత్తలు, పారిశ్రామిక గ్రూపులతో వేర్వేరుగా సమావేశం అవుతుంది. వారి వారి డిమాండ్లను ప్రతిపాదనలుగా స్వీకరిస్తుంది. సలహాలు, సూచనలను తీసుకొంటుంది. ☛ ఇక బడ్జెట్ తయారీ ప్రక్రియ అంతా అత్యంత రహస్యంగా జరుగుతుంది. ఇందుకు కేంద్ర బిందువైన ఆర్థికశాఖ విభాగం ఉండే నార్త్‌బ్లాక్ వద్ద ఆంక్షలు విధిస్తారు. ప్రసార మాధ్యమాల ప్రతినిధులను సైతం ఇటువైపు అనుమతించరు. డిసెంబర్ మొదటి వారం నుంచే ఇక్కడ నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ☛ బడ్జెట్ పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి వారం ముందు, ఈ ప్రక్రియలో భాగస్వాములైన ముఖ్య అధికారులు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పో తారు. అంటే ఇంటికి కూడా వెళ్లకుండా, ఫోన్లకు దూరంగా నార్త్‌బ్లాక్‌కే పరిమితం అవుతారు. ఇక్కడి మొదటి అంతస్తులో బడ్జెట్ ప్రతుల ముద్రణ చేపడతారు. ☛ కేంద్ర ప్రసార, సమాచార విభాగం పత్రికా ప్రకటన ప్రతుల రూపకల్పనలో నిమగ్నం అవుతుంది. హిందీ, ఆంగ్లం, ఉర్దూలో వీటిని ముద్రించడంపై దృష్టిసారిస్తుంది. బడ్జెట్ రోజు పార్లమెంటు సమావేశాలకు ముందు బడ్జెట్ సారాంశాన్ని కేంద్ర కేబినెట్‌కు వివరిస్తారు.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

ఆటో రంగానికి రాయితీలివ్వండి




హైదరాబాద్: దేశంలో ఆటోరంగం పూర్తి స్థాయిలో రూపాంతం చెందు తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొన్ని ప్రభుత్వం ఆటోరంగంలో అనుకూలమైన విధానలను ప్రకటించాలని రెనో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సుమిత్ సహానే ప్రభు త్వానికి విజ్ఞప్తి చేశారు. ఆటో రంగం అభివృద్ధి చెంద డానికి ప్రభుత్వం కార్పొరేట్ టాక్స్‌తో పాటు ఆదాయపు ప న్నును మిన హాయింపులు ఇవ్వాలని కోరారు. ఆర్థిక మంత్రి 2015-16 బడ్జెట్‌లో కార్పొరేట్ టాక్స్‌ను తగ్గిస్తామని హామీఇచ్చారు. అలాగే బడ్జెట్లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి పెద్దమొత్తంలో కేటా యింపులు చేయాలన్నారు. గ్రామీణ మౌలి కరంగంపై పెద్దేత్తున వ్యయం చేయాలన్నారు. గ్రామీ ణాభివృద్దితో పాటు రైతుల సంక్షేమం కోసం ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల, ఎంట్రీ లెవెల్ ప్యాసింజర్‌కార్లపై ఫోకస్ పెట్టాలని కోరారు. ఉద్యో గావకాశాలు కల్పించాలని, గ్రామీణాభివృద్ధితో పాటు ఉద్యోగాలు పెద్దె త్తున కల్పించే రంగాలు తయారీరంగంతో పాటు సేవల రం గంపై దృష్టి పెట్టాలని సహానే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే పాతకార్లను స్క్రాప్ (ధ్వంసం) చేసి కొత్త కార్లు కొనుగోలు చేసే వారి కి రాయితీలు ఇవ్వాలని దీంతో ఆటో రంగం బలోపేతం అవు తుందని ఆయన అభిప్రాయపడ్డారు.




ఆర్థిక క్రమశిక్షణా... ప్రజాకర్షక బడ్జెటా?

•నేడే కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ : ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2018-19 బడ్జెట్‌ను పార్లమెంటులో గురువారం ఉదయం ప్రవేశపెట్టడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఐదవ, అతి సంక్లిష్టమైన బడ్జెట్‌గా ఇది చెప్పుకోవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం దేశంలో వ్యవయసారంగం కుదేలైంది. దీనిపై దృష్టిపెట్టాల్సి ఉంది. దీంతో పాటు వృద్ధిరేటును పెంచుకుంటూనే ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట వేయాల్సి ఉంటుంది. త్వరలోనే దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని మోడీ సర్కార్ ప్రధానంగా గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి కొత్త పథకాలు ప్రకటించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలు ఎంఎన్‌ఆర్‌ఈజీఏ, గ్రామీణ గృహ పథకాలు, నీటిపారుదల ప్రాజెక్టులతో పాటు, పంట బీమా పథకాలకు పెద్దమొత్తంలో కేటాయింపులు జరపవచ్చు.ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ వోటు బ్యాంకు చెల్లాచెదురైంది. దీంతో జైట్లీ బడ్జెట్‌లో రైతాంగానికి పెద్దెత్తున ప్రోత్సాహకాలు ప్రకటించవచ్చు. చిన్న చిన్న వ్యాపారులు సంప్రదాయబద్ధంగా చూస్తే బీజేపీకే అనుకూలంగా ఉంటారు. నవంబర్ 8,2016 అర్ధ రాత్రి మోడీ సర్కార్ చడీచప్పుడు లేకుండా పెద్దనోట్ల రద్దు చేయడంతో చిన్న చితకా వ్యాపారులు బాగా దెబ్బతిన్నారు. గతేడాది జులై 1 నుంచి జీఎస్టి అమల్లోకి తేవడంతో కూడా చోటా మోటా వ్యాపారులు దెబ్బతిన్నారు. వీరిని ప్రసన్నం చేసుకోడానికి జైట్లీ కొన్ని రాయితీలు ప్రకటించవచ్చు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రభుత్వంపై సామాన్యుడు గుర్రుగా ఉన్నాడు.. వారిని దృష్టిలో ఉంచుకొని ఆదాయపు పన్నులో కాస్తా ఊరట కలిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆదాయపు పన్ను పరిమితిని పెంచే అవకాశాలున్నాయి. అలాగే జైట్లీ మెనులో మౌలికరంగానికి చెందిన ప్రాజెక్టులపై పెద్దెత్తున వ్యయం చేయనున్నారు. ప్రధానగా జాతీయ రహదారులతో పాటు రైల్వేలను ఆధునీకరణ చేయడానికి పెద్దపీట వేస్తారని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఎందుకంటే వృద్ధిరేటు నాలుగు సంవత్సరాల కనిష్ఠానికి పడిపోయింది. ఇదంతా ఒక ఎత్తయితే ద్రవ్యలోటును అదుపు చేసుకోవాల్సిన బాధ్యత మోడీ సర్కార్‌పై ఉంది. లేదంటే గ్లోబల్ ఇన్వెస్టర్ల నుంచి రేటింగ్ ఏజెన్సీల వరకు రేటింగ్ ఏజెన్సీలకు తప్పుడు సంకేతాలు వెళతాయి. ఇప్పుడిప్పుడే గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు అనుకూలమైన రేటింగ్‌లు ఇవ్వడం ప్రారంభించాయి. అరుణ్‌జైట్లీ ద్రవ్యలోటును ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీలో 3.2 శాతానికి తీసుకురావాలని 2018-19 నాటికి మూడు శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గురువారం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో కొద్ది గంటల్లో తేలిపోతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇటీవల కాలంలో వచ్చే బడ్జెట్ ప్రజాకర్షక బడ్జెట్ ఉండదని స్పష్టం చేశారు. సామాన్యుడు ప్రభుత్వం నుంచి రాయతీలు కోరడని పలు మార్లు చెప్పిన విషయం తెలిసే ఉంటుంది. ప్రభుత్వం ఆర్థికసంస్కరణలకు పెద్దపీట వేస్తోంది. స్వాతంత్ర్య తర్వాత అతి పెద్ద సంస్కరణ వస్తు సేవల పన్ను జీఎస్టి.. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత ఇదే మొదటి బడ్జెట్. వృద్ధిరేటు పెంచుకోడానికి బడ్జెట్‌లో జైట్లీ ఎలాంటి ప్రకటనలు చేస్తారని అందరూ ఆసక్తిగా ఎదరుచూస్తున్నారు. జైట్లీ ఇప్పటికి పలువార్లు స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టిన పెట్టుబడులపై క్యాపిటల్ గెయిన్ టాక్స్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై ఆయన ఎలా స్పందిస్తారో చూడాల్సిందే. అలాగే 2015లో వచ్చే నాలుగు సంవత్సరాల కాలంలో కార్పొరేట్ టాక్స్‌ను 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తామని హామీ ఇచ్చారు. జైట్లీకి ఇవన్నీ అమలు చేయాలంటే పరిమిత స్థాయిలో అవకాశాలున్నాయి. ఎందుకంటే జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో ఉత్పత్తి చేసే వస్తవులపై సెంట్రల్ ఎక్సైజ్, సేవల పన్ను పూర్తిగా ఎత్తివేయడం జరిగింది. ప్రస్తుతం జీఎస్టి అమల్లోకి వచ్చింది కాబట్టి ఈ పన్నులను తీసుకురావడానికి వీల్లేదు. ఇటీవల కాలంలో గ్లోబల్ మార్కెట్లో ముడిచమురు ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. దీంతో ద్రవ్యోల్బణం కోరలు చాచే అవకాశాలున్నాయి. కరెంటు ఖాతాలోటు కూడా పెరిగిపోతుంది. కరెంటు ఖాతాలోటు అదుపు చేయడానికి ప్ర భుత్వం ఎగుమతులను ప్రోత్సహిం చడానికి కొన్ని ప్రోత్సాహకాలు ప్రకటిం చాల్సి ఉంటుంది. వీటితో పాటు స్టార్టప్‌లకు కూడా ఇవి అమలు చేస్తే మంచిది. అయితే ద్రవ్యలోటు అదుపు గురించి ప్రభుత్వంలోనే మిశ్రమ స్పందనలు వినిపిస్తున్నాయి. ప్రధాన ఆర్థిక సలహాదారులు అరవింద్ సుబ్రహ్మణ్యం ఈ వారం ప్రారంభంలో మాట్లాడుతూ... ఆర్థిక క్రమశిక్షణలో కాస్తా సడలింపు ఉంటుందని అంటే నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్‌కుమార్ మాత్రం ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యానికి కట్టుబడి ఉందంటున్నారు. ఈ ఆర్థికసంవత్సరం 2017-18 ద్రవ్యలోటు లక్ష్యం నవంబర్‌లో 112 శాతాన్ని మించిపోయింది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వరంగానికి చెందిన కంపెనీల నుంచి డివిడెండ్ తగ్గడమే. దీంతో ప్రభుత్వం ఈ లోటు పూడ్చుకోవడానికి ప్ర భుత్వరంగానికి చెందిన కంపెనీల్లో వాటాలు విక్రయించుకుని ఒడ్డున పడాలనుకుంటోంది. మొత్తానికి జైట్లీ బడ్జెట్ పట్ల ఆమ్ ఆద్మీ నుంచి పెద్ద కార్పొరేట్లకు వరకు అందరూ ఆత్రుతతో ఎదరుచూస్తున్నారు. కొన్ని గంటల్లోనే ఈ సస్పెన్స్‌కు తెరపడనుంది.



ఫోర్డ్ 'ఫ్రీ స్టయిల్'



న్యూఢిల్లీ : ఫోర్డ్ ఇండియా బుధవారం కొత్త కాంపాక్ట్ కారు 'ఫ్రీస్టయిల్'ను ఆవిష్కరించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మార్కెట్లో అందుబాటులోకి వస్తుంది. ఫీచర్ల విషయానికి వస్తే 1.2 లీటర్ 3 సిలిండర్ పెట్రోల్ ఇంజిన్, ఫైవ్ స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో పాటు 96 పీఎస్ పవర్‌ఔట్‌పుట్‌ను విడుదల చేస్తుంది. దీంతో పాటు 6.5 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్‌తో ఆపిల్‌కార్‌ప్లే, ఆండ్రియాడ్ ఆటో కూడా అందుబాటులో ఉంచుతోంది. ఈ మోడల్‌కారు గ్లోబల్ ఆవిష్కరణలో భాగంగా భారత్‌మార్కెట్లో విడుదల చేసింది. కొద్ది గంటల్లోనే దక్షిణాఫ్రికా మార్కెట్లో కూడా ఈ వాహనాన్ని విడుదల చేస్తుందని ఫోర్డ్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ అనురాగ్ మెహరోత్రా చెప్పారు. ఈ వాహనాన్ని గుజరాత్‌లోని సనంద్‌లో ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడి నుంచి యూరోప్‌తో పాటు మధ్యప్రాచ్యదేశాలకు కూడా ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం ఫోర్డ్ భారత్ నుంచి సుమారు 50 దేశాలకు ఎగుమతులు చేస్తోంది. ఉత్తర అమెరికాకు కూడా కాంపాక్ట్ ఎస్‌యూవీ యూకోస్పోర్ట్‌ను ఎగుమతి చేస్తున్నట్లు మెహరోత్రా తెలియజేశారు.

శాంసంగ్ ఇండియాలో 1000 కొలువులు

•ఆర్ అండ్ డీలో ఇంజినీర్ల నియామకం

ముంబై : దక్షిణ కొరియాకు చెందిన సాంసంగ్ భారత్‌లో మూడు రెసెర్చ్ అండ్ డెవలెప్‌మెంట్ (ఆర్‌అండ్‌డి) సెంటర్‌లలో సువూరు 1,000 మంది ఇంజినీర్లను నియమిస్తున్నట్లు బుధవారం నాడు ప్రకటించింది. దేశంలని టాప్ ఇన్సిస్టిట్యూట్‌ల నుంచి వీరిని ఎంపిక చేస్తామని వెల్లడించింది. ఐఐటి, ఢిల్లీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, బిట్స్ పిలానీ, మనీపాల్ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఐఐటిల నుంచి యువ ఇంజనీర్లను ఎంపిక చేస్తుంది. గత 22 సంవత్సరాల నుంచి భారత్ మార్కెట్లో బలంగా ఉన్నామని.. భారత్‌లో మూడు ఆర్‌అండ్‌టి సెంటర్లు ఉన్నాయని, పలు అత్యాధునిక టెక్నాలజీలను ఇక్కడ ఆవిష్కరించడం జరిగిందిన సాంసంగ్ గ్లోబల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ సాంసంగ్ ఆర్‌అండ్‌డి ఇన్సిస్టిట్‌ట్యూట్ బెంగళూరు దీపేశ్ షా చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సింగిల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ విజన్, మొబైల్ సెక్యూరిటి, బయోమెట్రిక్‌లతో పాటు ఇతర రంగాల కోసం వీరిని నియమించడం జరుగుతుందని ఆయన వివరించారు. గత ఏడాది తమ ఆర్‌అండ్‌డి కోసం 800 మంది యువ ఇంజినీర్లను తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సాంసంగ్‌కు ప్రపంచవ్యాప్తంగ 32 ఆర్‌అండ్‌డి సెంటర్‌లున్నాయి. భారత్‌లో బెంగళూరు, నోయిడా, ఢిల్లీలో ఉన్నాయి. భారత్ మార్కెట్లకు వినూత్నమైన ఉత్పత్తులను అందించడం ఈ ఆర్‌అండ్‌డి పని.

ఎస్ఎంఈల కోరికల చిట్టా

•పన్ను రేట్లు తగ్గించండి

•ఎక్కువ ప్రాజెక్టులు ప్రకటించండి

న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19 బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి కేవలం కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉంది. చిన్న, మధ్య తరహాతో పాటు రవాణా రంగానికి చెందిన వారి కోరికల చిట్టా ఇలా ఉంది. సర్వేలో పాల్గొన్న 87.5 శాతం మంది బడ్జెట్‌లో ఎక్కువ ప్రాజెక్టులు ప్రకటించాలని.. ఉదాహరణకు భారత్‌మాలా రోడ్డ నిర్మాణ ప్రాజెక్టులను చేపట్టాలని కోరితే.. 54 శాతం రిటైల్.. ఈ కామర్స్, ఎస్ఎంఈలు జాతీయ రిటైల్ విధానం ప్రకటించాలని కోరారు. డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ ఎస్‌ఏపీ ఎస్ఎంఈలు బడ్జెట్‌పై నిర్వహించిన సర్వేలో వివిధ రంగాలకు చెందిన వారిలో 43 శాతం మంది లోహ, గనుల రంగాల వారు లా భాలపై ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరారు. ఈ రంగాల్లో మూలధనంపై కూడా ప్రోత్సహకాలు ప్రకటించాలని కోరాయి. 88 శాతం మంది ఈ రంగంలో ప్ర భు త్వం రక్షణాత్మకధోరణిని ప్రదర్శించాలని.. దేశీయంగా తయారీరంగాన్ని ప్రోత్సహించాలని కోరారు. చిన్న మధ్య తరహారంగానికి చెందిన ఆటో రంగానికి చెందిన వారు మాత్రం ఆటో విడిభాగాలపై జీఎస్టిరేట్లను తగ్గించాలని డిమాండ్ చేయగా.. 88 శాతం మంది భారత్ స్టేజీ -6 ప్రమాణాలను ప్రోత్సహించాలని కోరారు.ఇండస్ట్రియల్ మెషిన్ విడిభాగాల రంగానికి చెందిన వారిలో ప్రతి ముగ్గురిలో ఒకరు టెక్నాలజీని అప్‌గ్రేడ్ కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే క్యాపిటల్‌గూడ్స్‌పై సున్నా పన్ను విధించాలని కోరారు. అలాగే 50 శాతం మంది రసాయనాలు, ఫార్మారంగానికి చెందిన వారు బడ్జెట్‌లో ఆర్‌అండ్‌లో వెయిటెడ్ డిడక్షన్ ప్రొవిషన్‌ను 200 శాతానికి మార్చాలని సూచించారు. ప్రొఫెషనల్ సర్వీసెస్ విభాగానికిచెందిన వారిలో 48 శాతం మంది పన్ను చెల్లింపుల్లో మిన హాయింపులు ఇవ్వాలని కోరారు. రిటైల్, ఈ కామర్స్ రంగానికి చెందిన వారిలో 52 శాతం మంది యూనిఫైడ్ జాతీయ మార్కెట్ రిటైల్, ఎఫ్ఎంసీ.ఈ రంగానికి కల్పిం చాలని కోరితే.. 88 శాతం రవాణా, లాజిస్టిక్స్ రంగానికి చెందిన వారు లాజిస్టిక్ పార్కులను ఏర్పాలు చేయాలని కోరారు. సర్వేలో పాల్గొన్న వారిలో 91 శాతం మం ది ప్రభుత్వ ప్రోత్సాహాలతో విధానాలతో కొత్త టెక్నాలజీకి మారేందుకు చేయూత నివ్వాలని కోరారు. మెజారిటీ చిన్న, మధ్య తరహా రంగానికి చెందిన వారిలో టెక్నా లజీ ద్వారానే తమ వ్యాపారం అభివృద్ధి చెందు తుందని నమ్ముతున్నారు.

63.59 శాతం మంది కొత్త టెక్నాలజీ ద్వారా మా ర్కెట్లో నిలదొ క్కుకునేం దుకు తాము కోరడం లేదని.. తమ వ్యాపారాన్ని మరింత పెంచుకో వచ్చ ననేదే తమ ప్రధాన ఉద్దేశవ న్నారు.ఎస్ఎంఎస్ రం గానికి చెందిన 29 శాతం మంది బడ్జె ట్‌లో తమకు రుణాలు అందుబాటులో ఉంచాలని కోరారు. 21 శాతం మంది ఎస్ఎంఈ స్టార్ట ప్‌లను ప్రభుత్వం ప్రోత్సా హకాలు అందివ్వాలని కోరారు.



ఇంకా కోలుకోని సిమెంట్ రంగం

•ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు 2శాతమే •రేటింగ్ ఏజెన్సీ ఇక్రా



న్యూఢిల్లీ : సిమెంట్ రంగం ఈ ఆర్థిక సంవత్సరంకూడా బలహీనంగానే కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం 2017-18లో ఈ రంగంలో వృద్ధిరేటు కేవలం రెండు శాతం కంటే ఎక్కువ కనిపిం చడం లేదని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా పేర్కొంది. ఈ రంగం వృద్ధి చెందకపోవడానికి ప్రధాన కారణం రియల్ ఎస్టేట్ రంగంలో ఊపందుకోకపోవడం, ఇసుక లభ్యత తక్కువ కావడంతో పాటు కొత్తగా ప్రభు త్వం తీసుకొచ్చిన జీఎస్టి తదితర అంశాలు సిమెంట్ రంగం పుంజుకోవడానికి అడ్డంకిగా మారాయి. నెల వారి ప్రాతిపదికన చూస్తే నవంబర్ 2017లో సిమెంట్ కర్మాగారాల నుంచి 0.5 శాతం పెరిగి 24.1 మిలియన్ టన్నులకు చేరింది. ఈ పరిణా మాల నుదృ ష్టిలో ఉం చుకుంటే ఈ ఆర్థికసంవత్సరం సిమెంట్ రంగంలో వృద్ధి రేటు కేవలం రెండు శాతం మించే పరి స్థితి కనిపించడం లేదని ఇక్రా నివేదికలో పేర్కొంది. ఏడాది ప్రాతిపదికన చూస్తే నవంబర్ 2017 వరకు సిమెంట్ డిమాండ్ 17.3 శాతం వరకు ఉంటుంది. దీనికి ప్రధాన కారణం నవంబర్ 2016లో పెద్దనోట్ల రద్దు ప్రకటతన తర్వాత ఉత్పత్తి 20.5 మిలియన్ మెట్రిక్ టన్నులకు పడిపోయింది. ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు సిమెంట్‌ఉత్పత్తి స్వల్పంగా 0.6 శాతం పెరిగి 190.0 ఎంఎంటికి చేరగా.. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో 188.8 ఎంఎంటిలని తెలి పింది. జూన్ త్రైమాసికంలో ఉత్పత్తి 3.3 శాతానికి పడిపోగా.. సెప్టెంబర్ త్రైమాసానికి 0.4 శాతానికి చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమా సికంలో స్థానిక అం శాల కారంగా డిమాండ్‌పై ప్ర భావం చూపించింది. ఉత్తరాది రాష్ట్రాల విష యానికి వస్తే ముఖ్యంగా పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లలో ఇసుక కొరతతో పాటు కూలీలు లభించకపోడం ఒక కారణమైతే దేశంలోని పశ్చిమ ప్రాంతంతో రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ అథారిటీ (రేరా) బిల్లు తీసుకు రావడంతో నిర్మాణం రంగంలో కార్యకలాపాలు మందగించాయి. దక్షిణాది విషయానికి వస్తే, తమి ళనాడు, కేరళలో ఇసుక కొరతతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కరువుకాటకాల వల్ల నిర్మాణరంగం దెబ్బతింది. ప్రభుత్వం చౌకరకం గృహాలతో పాటు గ్రామీణ గృహ నిర్మాణరంగంతో పాటు మౌలి కరం గానికి చెందిన ప్రాజెక్టులు ముఖ్యంగా రోడ్డు, నీటిపా రుదల ప్రాజెక్టులపై దృష్టిపెట్టడంతో సిమెంట్ డి మాండ్ పెరుగుతుందని వచ్చే ఆర్థికసంవత్సరం 2018-19 ఈ రంగంలో 4-5 శాతం వృద్ధి చెందు తుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గ్రూపు హెడ్ సబ్యసాచి మజుందార్ చెప్పారు.

వాల్‌మార్ట్ చేతికి ఫ్లిప్‌కార్ట్ వాటాలు



న్యూఢిల్లీ : ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో వాల్‌మార్ట్ స్టోర్ ఐఎన్‌సీ 15-20 శాతం వాటాలు కొనుగోలు చేయనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. వాల్‌మార్ట్ గ్లోబల్ సీఈవో డగ్ మెక్ మిల్లన్ ఇటీవల భారత్ పర్యటనకు వచ్చినప్పుడు ఆయన బెంగళూరులోని ఫ్లిప్‌కార్ట్ కార్యాలయంలో కంపెనీకి చెందిన ఇద్దరు ఎగ్జిక్యూటివ్‌లతో కొంత సమయం గడిపినట్లు చెబుతున్నారు. అయితే దీనిపై ఇప్పటి వరకు తుది నిర్ణయం జరగలేదని చెబుతున్నారు. వాల్‌మార్ట్ ఫ్లిప్‌కార్ట్‌లో బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టాలని చూస్తున్నట్లు చెబుతున్నారు. దీనిపై ఫ్లిప్‌కార్ట్ అధికారని సంప్రదించగా ఆయన దీనిపై స్పందించడానికి నిరాకరించారు. వాల్‌మార్ట్ ఇండియా అధికార ప్రతినిధి సమాచారం ప్రకారం తమ గ్లోబల్ సీఈవో ఇటీవల భారత్ మార్కెట్ విచ్చేసినప్పుడు ఆయన మూడు కంపెనీలతో చర్చలు జరిపారని వాటిలో ఇండియా క్యాష్ అండ్ క్యారీ బిజినెస్, గ్లోబోల్ టెక్నాలజీ సెంటర్, గ్లోబల్ సోర్సింగ్‌తో చర్చలు జరిపారు. అయితే మార్కెట్లో వస్తున్న ఊహాగానాలపై స్పందించమని ఆయన చెప్పారు.

కార్ల ఎగుమతులు 8శాతం పెరిగాయి

•భారత్ నుంచి బ్రిటన్‌కు

లండన్: భారత్ నుంచి బ్రిటన్‌కు గతేడాది కార్ల ఎగుమతులు 8.3 శాతం పెరిగాయి. తాజా గణాంకాల ప్రకారం చూస్తే భారత్ నుంచి ఎగుమతులు పెరిగితే, బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతులు తగ్గాయని బ్రిటన్ ఆటోమెటివ్ ఇండస్ట్రీ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ది సొసైటీ ఆఫ్ మోటార్ మాన్యూఫ్యాక్చరర్స్ అండ్ ట్రేడర్స్ (ఎస్ఎంఎంటి) విడుదల చేసిన ప్రకటనలో ప్రకారం భారత్‌లో తయారైన కార్లకే బ్రిటన్ మంచి డిమాండ్ ఏర్పడిందని.. 2017లో 34,149 కార్లను దిగుమతి చేసుకున్నారు. 2016తో పోల్చుకుంటే ఇది 8.3 శాతం పెరిగినట్లు లెక్క అని పరిశ్రమవర్గాలు తెలియజేశాయి. బ్రిటన్‌లో భారత్ మోడల్స్ డిమాండ్‌ను ఇలా ఉంది. ఫోర్డ్ ఈకో స్పోర్ట్స్, ఫోర్డ్ కెప ఫ్లస్, నిస్సాన్ మైక్రా, సుజుకి బలెనోకు మంచి డిమాండ్ ఉంది. ఇక బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతుల విషయానికి వస్తే 2016లో 8 ర్యాంకు నుంచి 2017లో 12వ ర్యాంకుకు పడిపోయింది. 2016లో 3,372 యూనిట్లు భారత్ దిగుమతి చేసుకుంటే 2017లో 1,144 యూనిట్లు పరిమితం అయ్యింది. టాటామోటార్స్‌కు చెందిన జాగ్వార్ అండ్ ల్యాండ్ రోవర్ (జెఎల్‌ఆర్)కు భారత్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో పాటు రేంజిరోవర్, ల్యాండ్‌రోవర్ డిస్కవరా, రేంజిరోవర్ వేలార్; రేంజిరోవర్ ఎస్‌యూవీలకు భారత్‌లో మంచి స్పం దన ఉందని.. ఒక్క మిని వన్ తప్పించి మిగి లిన బ్రాండ్‌లకు మంచి డిమాండ్ ఏర్పడిందని ఎస్ఎంఎంటి చీఫ్ ఎగ్జి క్యూటివ్ మైక్ హావేస్ చెప్పారు. టాటా మోటార్స్ జాగ్వార్ ల్యాండ్ రోవర్ కార్లను బ్రిటన్‌లో ఉత్పత్తి చేసి ప్రపంచంలోని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తోంది.



కోరమాండల్ లాభంలో 34శాతం వృద్ధి

హైదరాబాద్ : కోరమాండల్ ఇంటర్నేషనల్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 34 శాతం వృద్ధితో రూ.172 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.112 కోట్లు నమోదు చేసింది. వ్యవసా య రంగం పుంజు కోవడంతో మంచి ఫలితాలను ఆర్జించింది. రెవెన్యూ రూ.2,707 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమా సికంలో రూ.2,283 కోట్లు ఆర్జించిం నట్లు కంపెనీ ఎండి సమీర్ గోయెల్ చెప్పారు. ఇదిలా ఉం డగా రూ. 30వేల కోట్ల మురుగప్ప గ్రూపు ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎ వెల్లి యన్ 65 సంవత్సరాలు పూర్తైనం దుకు చైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

బడ్జెట్‌లో రైల్వేకు ఊరట?



న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19 బడ్జెట్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. అందరి కళ్లు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రసంగంపై కేంద్రీకృతమయ్యాయి. నిపుణుల అంచనా ప్రకారం ఆర్థికమంత్రి బడ్జెట్‌లో రైల్వేలకు భారీ ఊరట కలిగించే ప్రకటనలు చేయవచ్చునని చెబుతున్నారు. గత ఏడాది మోడీ సర్కార్ సంప్రదాయబద్ధంగా వస్తున్న రైల్వే బడ్జెట్‌కు స్వస్తి చెప్పి.. రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేశారు. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో అరుణ్‌జైట్లీ ప్రత్యేకంగా రైల్వేలపై ఎలాంటి ప్రకటనలు చేస్తారో నిపుణుల అంచనా ప్రకారం ఇలా ఉండవచ్చు.

ప్రయాణికుల భద్రతకు పెద్దపీట : గతేడాది కూడా భారతీయ రైల్వేలు ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చాయి. అయినా.. దురదృష్టవశాత్తు రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వచ్చే బడ్జెట్‌లో జైట్లీ భద్రతా ఫీచర్లను బలోపేతం చేయడానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెద్దెత్తున ప్రకటనలు గుప్పించవచ్చునని చెబుతున్నారు.ఇప్పటికే పలుమార్లు ట్రాక్స్‌లో పగుళ్లు ఏర్పడి డైవర్లను సిగ్రల్స్ ద్వారా అప్రమత్తం చేసే వ్యవస్థ కొనసాగుతోంది. దీంతో పాటు పొగమంచు కారణంగా రైళ్లు నత్తనడక నడవకుండా చూసేందుకు కొత్త పరికరం ఫాగ్‌పాస్ (ఫాగ్ పైలెట్ అసిస్టెంట్ సిస్టమ్) లేదా ఎఫ్‌స్‌డీ,తో పాటు జీపీఎస్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి తదుపరి సిగ్నల్ ఎక్కడ ఉందో తేలిగ్గా గుర్తుపట్టే వ్యవస్థను తీసుకురావచ్చు. దీంతో పాటు రైళ్లలో శుచి శుభ్రతతో పాటు రైళ్లను వేగాన్ని పెంచడం. ప్రస్తుతం ప్రయాణికుడు అదనపు సౌకర్యాల కోసం అదనంగా డబ్బు చెల్లించానికి వెనుకాడ్డం లేదు. ముఖ్యంగా శుభ్రతతో పాటు త్వరగా గమన్యానికి చేరుకోవడానికి ఎక్కువ చార్జీలు చెల్లించడానికి అభ్యంతరం తెలుపడు.

చార్జీల్లో కోత: వచ్చే ఏడాది ఎన్నికల సందర్భంగా మోడీ సర్కార్ రైల్వే ప్రయాణికులపై వరాల జల్లు కురిపించే అవకాశాలున్నాయి. డిజిటల్ లావాదేవీలకు పెద్దపీట వేయడంతో పాటు ప్రస్తుతం ఈ టిక్కెట్లపై సర్వీసు చార్జీలు ఎత్తివేసిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.

ప్రీమియం రైళ్ల ప్రకటన : ప్రీమియం రైళ్లు శతాబ్ది, రాజధాని రైళ్ల స్థానంలో ప్రపంచస్థాయి రైళ్లను జైట్లీ బడ్జెట్‌లో ప్రకటించే అవకాశాలున్నాయని మీడియాలో వార్తలు వస్తున్నాయి. ప్రపంచస్థాయి రైళ్లను ట్రెయిన్ 18ని పిలుస్తారు. ఈ ఏడాదిజూన్ నాటికి శతాబ్ది స్థానంలో ఈ రైళ్లను ప్రవేశపెడతారు. 2020 నాటికి ట్రెయిన్20 ని రాజధానిలో స్థానంలో తీసుకువస్తారు. ఈ ప్రత్యేక రైళ్లను రైల్వే ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో డిజైన్ చేస్తారు. వీటిని హైస్పీడ్ రైళ్లకు వాడుతారు. ఆర్థిక సర్వేలో కూడా రైల్వేలపై ప్రత్యేక దృష్టి పెడతామని, హైస్పీడ్ రైళ్లకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, సరకు రవాణాకు ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేస్తామన ప్రకటించింది.

అటవీ సేవా కేంద్రాలుగా నర్సరీలు

• వనమిత్రగా నామకరణం: మంత్రి శిద్దా రాఘవరావు



అటవీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి శిద్దా రాఘవరావు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అటవీ నర్సరీలను అటవీ సేవా కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. ఈ సేవా కేంద్రాలకు వనమిత్రగా నామకరణం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం అమలుకు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారులకు సమీపంలో ఉన్న 20 నర్సరీలను గుర్తించినట్లు తెలిపారు. ఈ వనమిత్రలను ఉగాది నాటికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. మంగళవారం మంత్రి శిద్దా రాఘవరావు సచివాలయంలోని తన కార్యాలయంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలోని రాయవలస, తామరాపల్లి, విజయనగరం జిల్లాలోని కంకటాపల్లి, విశాఖ జిల్లాలోని యెండాడ, తూర్పు గోదావరి జిల్లాలోని అన్నవరం, తలపులమ్మ లోవా, పశ్చిమ గోదావరి జిల్లాలోని తడికలపూడి, వెంకటరామన్న గూడెం, కృష్ణాజిల్లాలోని బత్తుల వారి గూడెం, ప్రకాశం జిల్లాలోని మేదరమెట్ల, నెల్లూరు జిల్లాలోని ముంగమూరు, వెంకటాచలం, చిత్తూరు జిల్లాలోని తొండివాడ, కడప జిల్లాలోని మద్దిమడుగు, ఒంటిమిట్ట, వెంకటాపురం, కర్నూలు జిల్లాలోని ఎనుగు మర్రి, వనవాసి, అనంతపురం జిల్లాలోని మృనాలిలను అటవీ సేవా కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. వీటిని నర్సరీలుగానే కొనసాగిస్తూ పర్యావరణ ఉద్యానవనం, థీమ్ పార్క్, విత్తన కేంద్రాలుగా అభివృద్ధి చేయడంతో పాటు అటవీ ఉత్పత్తులను కూడా విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పర్యాటకుల కోసం వనరుచి రెస్టారెంట్, టాయిలెట్స్ తదితర సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. గిద్దలూరు ఫారెస్ట్ డివిజన్ కార్యాలయంతో పాటు రాష్ట్రంలోని అన్ని ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లను ఆధునికరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి శిద్దా రాఘవరావు అధికారులను ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణా, స్మగ్లింగ్‌ను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో పీసీసీఎఫ్ పి.మల్లిఖార్జునరావు, సీసీఎఫ్ ఎ.కె.ఝా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి

మంత్రి కామినేని శ్రీనివాస్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కామినేని శ్రీనివాస్

అమరావతి, ఆంధ్రప్రభ: గతంలో ఏ కేంద్ర ప్రభుత్వం చేపట్టని విధంగా ప్రధాని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం పేదవారి కోసం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం విజయవాడలోని ప్రైవేటు సమావేశ మందిరంలో పత్రికా సమాచార కార్యాలయం ఆధ్వర్యంలో వార్తాలాప్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్తాలాప్ కార్యక్రమానికి హాజరైన జర్నలిస్టులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పత్రికా సమాచార కార్యాలయం ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ విలేఖరులకు ఒక రోజు వర్క్‌షాప్ ఏర్పాటు చేయడం వలన వార్తలు రాసేటప్పుడు ప్రభుత్వ పథకాల పట్ల వారికి అవగాహన కలుగుతుందన్నారు.విజయవాడ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కాంతి రాణా టాటా మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్, చైల్డ్ ట్రాఫికింగ్, ఉమెన్ ట్రాఫికింగ్ కేసుల్లో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. తాను సివిల్ సర్వీస్ క్యాడర్‌కు ఎంపిక కాకుంటే జర్నలిస్టును అయ్యేవాడినని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఐబి డిప్యూటీ డైరెక్టర్ పి.రత్నాకర్, విజయవాడ మీడియా, కమ్యూనికేషన్స్ ఆఫీసర్ హెన్రీరాజ్, పీఐబీ అధికారులు శ్రీరామ్, శివచరణ్ రెడ్డి, దూరదర్శన్ డిప్యూటీ డైరెక్టర్ జి.సురేష్ కుమార్, ఏఎన్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిత, జర్నలిస్టులు పాల్గొన్నారు.

చర్మకారులను కార్మికులుగా
గుర్తించే అంశాన్ని పరిశీలిస్తాం: డిప్యూటీ సీఎం



ఉప ముఖ్యమంత్రితో ఎంఆర్‌పిఎస్ ప్రతినిధి బృందం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో చర్మకారులను కార్మికులుగా గుర్తించే విషయాన్ని పరిశీలిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప హామీ ఇచ్చారు. అదే విధంగా వారికి పెన్షన్ సౌకర్యాన్ని కల్పించే విషయమై ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ తామని అన్నారు. మాదిగ రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ఆధ్వర్యంలో బుధవారం వెలగపూడి సచివా లయంలో ఒక బృందం ఉప ముఖ్యమంత్రిని కలుసుకుంది. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ఇతర పలు డిమాం డ్లను కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

కోడి పందెలపై ప్రత్యేక చట్టం: చినరాజప్ప

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో సాంప్రదాయంగా జరిగే కోడి పందాల నిర్వహణపై హైకోర్టు సీరియస్ అయిన నేపథ్యంలో వాటికి చట్టబద్ధత కల్పించేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నట్లు హోంమంత్రి చినరాజప్ప వెల్లడించారు. బుధవారం సాయంత్రం ఆయన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే రాష్ట్రంలో పోలీసులు వ్యవహరించారని, ఇప్పటి వరకు 3 వేల మందిపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఇందులో పోలీసుల తప్పేమి లేదన్నారు. కోడిపందాల విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రి అధికార పార్టీ నేతలను కూడా మందలించడం జరిగిందన్నారు. కోడిపందాల నిర్వహణలో ఎంతటి వారు ప్రమేయం ఉన్న వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కోడిపందాల నిర్వహణ ప్రమేయం ఉన్న ప్రజా ప్రతినిధులపై కూడా కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. నక్సల్స్ దాడుల్లో మృతి చెందిన హోం గార్డులకు రూ.30 లక్షలు ఆర్ధిక పరిహారం చెల్లించనున్నట్లు మంత్రి వెల్లడించారు. గతంలో ఈ పరిహారం రూ.5 లక్షలు ఉండేదని ప్రస్తుతం కానిస్టేబుల్స్‌కు మాదిరిగా హోం గార్డులకు కూడా పరిహారాన్ని పెంచడం జరిగిందన్నారు. కానిస్టేబుల్ నుంచి కానిస్టేబుల్ పై స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ స్థాయి వరకు ఒక పద్దతి, ఐపీఎస్ అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రూ.కోటి పరిహారం ఉంటుందన్నారు. రాష్ట్రంలో మావోల సంచారం లేదన్నారు. మన రాష్ట్రానికి సరిహద్దుల్లో ఉన్న ఇతర రాష్ట్రల్లో ఉన్న మావోలు ఇక్కడ అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అయిన వాటిని తిప్పి కొట్టేందుకు పోలీసు దళాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో గంజాయి సాగులు కూడా సమర్ధవంతంగా అరికడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నేరాల సంఖ్య పెరిగిందని అయినా శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న డిజిపి మాలకొండయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో నేరాల అదుపుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అమలు చేస్తామన్నారు. సైబర్ నేరాలు పెరిగాయని, భూకబ్జాలు లాంటి నేరాలు తగ్గాయని డిజిపి స్పష్టం చేశారు.

ప్రతి పౌరుడికి ఆహార భద్రత
రాజ్యాంగ హక్కు

- రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ఆహార భద్రత కల్పిస్తాం
- అవకతవకలకు పాల్పడే రేషన్ డీలర్లపై క్రిమినల్ కేసులు
- సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవు
- సీఎంఆర్ రైస్ నిబంధనలు ఉల్లంఘించే మిల్లర్లపై పీడీ యాక్ట్ ప్రయోగం

\- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ జేఆర్ పుష్పరాజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ జేఆర్ పుష్పరాజ్

నెల్లూరు, ప్రభన్యూస్: ప్రతి పౌరుడికి ఆహార భద్రత రాజ్యాంగ హక్కు అని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మెన్ జేఆర్ పుష్పరాజ్ పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్ గ్రీవెన్స్ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పించే విషయంలో రేషన్ దుకాణాలు, మధ్యాహ్న భోజనం, ఐసీడీఎస్ కీలక విభాగాలుగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 1.42 కోట్లు బీపీఎల్ రేషన్ కార్డులు ఉన్నాయని ఇటీవల జన్మభూమిలో 1.60 లక్షల నూతన బీపీఎల్ కార్డుల మంజూరుతో మొత్తం 1.44 కోట్లు బీపీఎల్ కార్డులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం నిర్వహించిన ప్రజాసాధికార సర్వేలో 1.37 కోట్ల కుటుంబాలు ఉన్నట్లు తెలిసిందని, ఇంకా 2.60 లక్షల రేషన్‌కార్డులకు దరఖాస్తులు వచ్చాయన్నారు. కుటుంబాల కన్నా కార్డులు ఎక్కువ ఉన్నాయని ఈ విషయంపై ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు. ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం, పీడీఎస్ బియ్యం పంపిణీలలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో రేషన్ దుకాణాల్లో అవకతవకలు తగ్గేందుకు ఈ-పాస్ విధానాన్ని తీసుకొచ్చామని, ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా మించిపోయి జిల్లాలో ఇటీవల సంభవించిన బియ్యం అవకతవకలకు సంబంధించి 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో జరిగినట్లుగానే మిగిలిన జిల్లాల్లో కూడా జరిగే అవకాశం ఉన్నందున నెల్లూరు ఉదంతాన్ని రాష్ట్రవ్యాప్తంగా కేస్ స్టడీ క్రింద తీసుకుని అన్నిజిల్లాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలియజేశారు.అలాగే సీఎంఆర్ రైస్ విషయంలో నెల్లూరు జిల్లాలో మిల్లర్ల నుంచి రూ. 60 కోట్లు రావాల్సి ఉందని, అందులో నలుగురిని అరెస్టు చేయడం జరిగిందని, మిగిలిన 20 మంది బెయిల్‌పై తిరుగుతున్నారన్నారు. జిల్లాలో రేషన్ డీలర్ల కుంభకోణాన్ని సమర్ధవంతంగా గుర్తించి చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్, జేసీలను ఆయన అభినందించారు. నెల్లూరు రేషన్ కుంభకోణానికి సంబంధించి 38 మంది రేషన్ డీలర్ల లైసెన్సులు, ఆథరైజేషన్ రద్దుచేయడం జరిగిందని వాటికి వెంటనే రిజర్వేషన్ మస్టర్ ప్రకారం నోటిఫికేషన్ విడుదలచేసి నూతన రేషన్ డీలర్లను నియమించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇంకా 80 వేలమందికిపైగా చిన్నారులు పూర్తి పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, 1.39 లక్షలు ఓ మోస్తరు పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. అవకతవకలకు పాల్పడిన రేషన్ డీలర్లపై, సహకరించిన అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు డీవి స్వర్ణగీత, జి కృష్ణమ్మ, ఎన్ విజయకుమార్, వెంకటరావు, ఎన్ శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ ఏఎండీ ఇంతియాజ్, జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి, డీఈఓ శామ్యూల్, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వరసుందరం, డీఆర్‌డీఏ పీడీ లావణ్యవేణి తదితర అధికారులు పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించిన ప్రియుడికి
ప్రియురాలి దేహశుద్ధి

పెద్దల జోక్యంతో ప్రేమకథకు సుఖాంతం



ప్రియుడికి దేహశుద్ధి చేస్తున్న ప్రియురాలు. (ఇన్‌సెట్‌లో గుడిలో ఒక్కటైన ప్రేమజంట)

నంద్యాల క్రైం, ప్రభ న్యూస్ : మూడేళ్ళు ప్రేమించి పెళ్లికి నిరాకరించిన ప్రియుడుకి ప్రియురాలు దేహశుద్ది చేసిన సంఘటన కర్నూలు జిల్లా నంద్యాలలో చోటు చేసుకుంది. పెద్దలు జోక్యం చేసుకొని ఇరువర్గాలను ఒప్పించి ప్రేమికులకు పెళ్లి చేయడంతో కథ సుఖాంతమైంది. వివరాల్లోకి వెళ్లితే. . . నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన పుల్లయ్య కుమారుడు మద్దెల చంద్రశేఖర్ కడప జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్నాడు. పాణ్యం మండలం రాంభూపాల్ తాండాకు చెందిన వెంకట్ నాయక్ కుమార్తె మునావత్ దివ్యాబాయి అదే జిల్లాలోని వీరభద్ర షాపింగ్ మాల్‌లో క్యాషియర్‌గా పని చేస్తుంది. ఇద్దరి మధ్య మూడేళ్ళక్రితం ప్రేమ వారిద్దరిని దగ్గర చేసింది. అయితే ప్రియుడు చంద్రశేఖర్ అత్త కుమార్తెతో పెళ్లికి సిద్ధమైనట్లు ప్రియురాలు దివ్య గ్రహించింది. గత కొద్దిరోజులుగా చంద్రశేఖర్ కనిపించకపోవడంతో ఆమె నంద్యాలకు చేరుకుంది. చంద్రశేఖర్‌స్వగ్రామమైన కానాలకు చేరుకొని తన ప్రేమ వ్యవహారాన్ని బయట పెట్టింది. పెళ్లికి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ససేమిరా అన్నారు. న్యాయం కోసం నంద్యాల రూరల్ పోలీసులను ఆశ్రయించింది. ఇదే సమయంలో ఇరువర్గాల పెద్దలు జోక్యం చేసుకొని నంద్యాల పట్టణంలోని నిశాంత్ భవనంలో పంచాయితీకి దిగారు. ఒక సమయంలో కోపోద్రికురాలైన దివ్య అందరు చూస్తుండగా ప్రియుడిని, అతని తల్లిని ఇష్టం వచ్చినట్లు చితకబాదింది. తన ప్రేమకు పెళ్లితో ముడిపెట్టేంత వరకు విడిచిపెట్టేది లేదని తెగేసి చెప్పింది. పంచాయితీకి వచ్చిన పెద్దలు ఇరువర్గాలతో చర్చించి పెళ్లికి ఒప్పించారు. ఒక సమయంలో తన అత్తకు రూ. 2 లక్షలు బాకీ ఉన్నానని, ఆమె బిడ్డను చేసుకోక పోతే అప్పు కట్టలేనని ప్రియుడు పెద్దల ముందు వాపోయాడు. మూడేళ్ళ నుంచి దివ్య నగదు, బంగారం, తదితర వాటిని చంద్రశేఖర్ తీసుకొని ఖర్చు చేసినట్లు దివ్య పెద్దల దృష్టికి తెచ్చింది. ఇరువర్గాలను రాజీ చేసిన పెద్దలు పెళ్లికి ఒప్పించారు. టెక్కెలోని సుంకులమ్మ దేవాలయంలో ఇద్దరు దండలు మార్చుకున్నారు. మూడేళ్ళ ప్రేమ రెండు రోజుల పాటు విభేదాలను పొడచూపినా బుధవారం ఇద్దరికి పెళ్లి కావడంతో దివ్య,చంద్రశేఖర్‌ల ప్రేమ కథకు శుభం కార్డు పడింది. భార్య, భర్తలు వారి కుటుంబాలకు కొద్దిరోజులు దూరంగా ఉండాలని పంచాయితీ పెద్దలు సూచించడంతో మధ్యవర్తిత్వం వహించిన గ్రామ పెద్దలు దివ్యకు అండగా నిలిచిన ఒక మహిళ ఇంట్లో ఉంచేందుకు అంగీకరించారు. ప్రస్తుతం వారిద్దరు భార్య భర్తలుగా జీవనం ప్రయాణం మొదలు పెట్టారు.

బాబు పాలనలో దుర్భిక్షంలో వ్యవసాయం

వైకాపా నేత నాగిరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో వ్యవసాయరంగం తీవ్రమైన దుర్భిక్ష్యంలో కొట్టుమిట్టాడుతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం పార్టీ కేంద్రకార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ ఏపీలో పంటల సాగు తగ్గుముఖం పట్టగా సీఎం మాత్రం గణనీయమైన అభివృద్దిని సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని అన్ని మండలాలు కరువుతో అల్లాడుతున్నాయన్నారు. 140టీఎంసీల నికర జలాల కేటాయింపు ఉన్న నాగార్జుసాగర్ కుడికాలువ ఆయకట్టుకే నాలుగేళ్లుగా నీటివిడుదల లేదన్నారు. పశుగ్రాసం లేక పశువులు కబేళాలకు తరలించాల్సిన దుర్భర పరిస్థితులు నెలకున్నాయన్నారు. వాస్తవ పరిస్థితులను దాచి చంద్రబాబు ప్రభుత్వం మోసపూరిత అంకెలు చూపించి ప్రజలను మోసం చేస్తోందన్నారు. 2017-18కిగాను ప్రభుత్వం ఏవిధంగా 16శాతం వృద్దిరేటును సాధించిందో చెప్పాలన్నారు. 6.5లక్షల ఎకరాల్లో వేరుశనగ ఎండిపోయిందన్నారు.

పేద విద్యార్థులకు
విదేశీ విద్యా పథకం భరోసా

• ముగిసిన రెండు రోజుల కౌన్సెలింగ్

అమరావతి, ఆంధ్రప్రభ : పేద విద్యార్థులకు సైతం ఉన్నత వర్గాలతో సమానంగా విదేశీ విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం చేస్తున్న కృషికి పేద వర్గాల నుంచి మంచి స్పందన లభిస్తోంది.ప్రభుత్వ ప్రోత్సాహంతో బీసీ,ఈబీసీ,మైనార్టీ,కాపు వర్గాలకు చెందిన పేద విద్యార్థులు విదేశీ విద్యను నభ్యసిస్తూ ,ఆర్థిక స్వాలంబనను సాధిస్తూ ప్రగతిపథంలో పయనిస్తున్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో బీసీ సంక్షేమ శాఖ,కాపు కార్పొరేషన్ ఇప్పటి వరకు రాష్ట్రంలోని పేద వర్గాల పిల్లల కోసం నాలుగు విడతలుగా కౌన్సిలింగ్ నిర్వహించి విదేశీ విద్యా పథకం కింద ఎంపికలు చేసింది.ఈనెల 30,31వ తేదీల్లో నాలుగో విడత కౌన్సింగ్ నిర్వహించి, అభ్యర్థుల ధృవపత్రాలను పరిశీలించారు. మూడు విడతల్లో 1,050 మంది దరఖాస్తు చేసుకుంటే 847 మంది అర్హత సాధించారు. వారికి ఇప్పటికే మొదటి విడతగా రుణాన్ని విడుదల చేశారు. కాగా మంగళ,బుధవారాల్లో నిర్వహించిన కౌన్సిలింగ్‌కు 1225 మంది దరఖాస్తు చేసుకోగా, వారికి కౌన్సింగ్ నిర్వహించి, ధృవపత్రాలు పరిశీలించారు. బుధవారం 50 మంది కాపు విద్యార్థులతో పాటు బీసీ 25, ఎస్‌సి 25,మైనార్టీ నుంచి 10 మందికి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. వీరందరికీ ఒక వారంలో రుణం మంజూరుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు తెలియజేస్తారు. ధృవపత్రాలు సమర్పిస్తే సకాలంలో రుణం మంజూరు చేయడం జరుగుతుందని ఉమాదేవి వెల్లడించారు.

'నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి రూ.10 వేలు ఆదాయం'

అమరావతి, ఆంధ్రప్రభ: నాలుగేళ్లలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 10వేల ఆదాయం కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం కమిషనర్ బి. రామాంజనేయులు అన్నారు. బుధవారం ఆంధ్రప్రభ ప్రతినిధితో మాట్లాడుతూ ప్రతి జిల్లాలో రూ.5వేల లోపు ఆదాయం ఉన్న 1-1.4లక్షల కుటుంబాల ఆదాయాన్ని రూ. 10వేల పెంచుతామన్నారు. మార్చి- 2019 నాటికి రాష్ట్రంలోని 20-25 లక్షల కుటుంబాల ఆదాయం రూ.10వేలు ఉండే విధంగా చేస్తామని, దీనికి అనుగుణంగా కలెక్టర్లకు ఆదేశాలిచ్చామన్నారు. క్షేత్రస్థాయిలో 10స్టార్ గ్రామ అభివృద్ధి ప్రణాళిక, నరేగా పథకం, యూఎన్డీపీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, మిషన్ అంత్యోదయ, ఓడిఎఫ్, వాటర్ షెడ్స్, ఎన్టీఆర్ జలసిరి, గ్రామాల్లో భూగర్భ డ్రైనేజీ, ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు తదితర అంశాలపై చిత్తూరు జిల్లాలో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించామన్నారు. ఫిబ్రవరి 6న కడపలో, 7న కర్నూలులో చేస్తా మని, ఫిబ్రవరి16తేదీలోపు అన్ని జిల్లాలలో చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకం నిధు లను వచ్చే బడ్జెట్‌లో 25శాతం అదనంగా కేటాయించాలని కోరనున్నట్లు తెలిపారు. ఇప్ప టికే ఐదు జిల్లాలను ఓడిఎఫ్‌గా మార్చామని, రెండు నెలల్లో మిగితా జిల్లాలను కూడా ఓడి ఎఫ్‌గా తీర్చిదిద్దుతామని, మార్చి లోపు రాష్ట్రం ఓడిఎఫ్ రాష్ట్రంగా తయారవు తుంద న్నా రు.

అక్రమ లేఅవుట్లపై సీఆర్డీఏ ఉక్కుపాదం

అమరావతి,ఆంధ్రప్రభ: ఏపీ సీఆర్డీఏ పరిధిలో అనధికారికంగా వెలుస్తున్న లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత కొద్దిరోజులుగా సిఆర్డీఏ అధికారులు పలు ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను ధ్వంసం చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నాడు యనమలకుదురు ప్రాంతంలో అనేక అక్రమ లేఅవుట్లను తొలగించారు. అనేక నిర్మాణాలను కూడా ధ్వంసం చేశారు. అనధినకార నిర్మాణాలపై సిఆర్డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు డెవలప్‌మెంట్ ప్రమోషన్ విభాగం డైరెక్టర్ కె నాగసుందరి, అధికారులు, సిబ్బంది రంగం లోకి దిగారు. అనుమతి లేఅవుట్లు ఐదు, వాటిలో అనధికారికంగా చేపట్టిన ఆరు నిర్మాణాలను కూడా తొలగించారు. వాటిలో మూడు బేస్‌మెంట్ లెవల్, రెండు పిల్లర్ లెవల్ నిర్మాణాలతో పాటు కొన్ని షెడ్లను కూడా తొలగించారు. అనుమతి లేకుండా లే అవుట్లు వేయరాదని, పర్మిషన్‌లు పొందాక మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని ఈ సందర్భంగా నాగసుందరి తెలిపారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే తాము నష్టపోవాల్సి వస్తుందన్న విషయాన్ని నిర్మాణదారులు గుర్తుంచుకోవాలని ఆమె కోరారు. లేఅవుట్లు, నిర్మాణాలకు సంబంధించి నిబంధనలు తెలియచేస్తు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని నాగసుందరి చెప్పారు. సిఆర్డీఏ జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ గుమ్మడి ప్రసాదరావు, సర్వేయర్ వెంకటేశ్వర్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీలేఖ, కరుణకుమారి తదితరులు కూడా తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లిస్తే కఠిన చర్యలు'

అమరావతి, ఆంధ్రప్రభ: దళిత సంక్షేమం కోసం కేటాయిస్తున్న ప్రత్యేక ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు కె.రాములు హెచ్చరించారు. బుధవారం గుంటూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళిత గ్రామాల్లో ప్రభుత్వం విడుదల చేసిన సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపణలు, విమర్శలు వస్తున్న నేపథ్యంలో తక్షణమే విచారణ చేయిస్తామని చెప్పారు. గొట్టిపాడు గ్రామంలో దళితులపై అగ్రవర్ణాల దాడిపై కులంకషంగా విచారణ చేపట్టి అసలు దోషులను గుర్తించామని, వారిపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం ఆయనను మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, జిల్లా కలెక్టర్ కోన శశిధర్, అర్బన్, రూరల్ ఎస్పీలు సిహెచ్ విజయరావు, వెంకటప్పలనాయుడులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు.

ఇంద్రకీలాద్రి పేరిట ఢిల్లీకి
సూపర్ ఫాస్ట్ రైలును నడపాలి

కొలనుకొండ డిమాండ్

అమరావతి, ఆంధ్రప్రభ: విజయవాడ నుంచి ఢిల్లీకి ఇంద్రకీలాద్రి పేరిట ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాజధాని నగరం విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ చక్ర అదిష్టాన దేవతగా వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారిని భక్తులు కోరిన కోర్కెలు కొంగు బంగారంగా భావిస్తారని, దేశవిదేశాల నుండి లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి విజయవాడకు వచ్చి వెళ్తుంటారన్నారు. బెజవాడ అన్నా.. విజయవాడ అన్నా అందరికీ మొదటగా గుర్తుకు వచ్చేది కనకదుర్గమ్మ వారి ఆలయమే. అమ్మవారి మహిమను, ఆలయ విశిష్టతను గుర్తుకు తెచ్చే విధంగా అతిపెద్ద రైల్వే జంక్షన్ విజయవాడ నుండి దేశ రాజధాని నగరం ఢిల్లీకి ఇంద్రకీలాద్రి పేరుతో సరికొత్త సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలని కేంద్ర ప్రభుత్వాన్ని శివాజీ డిమాండ్ చేశారు. రాజధాని నగరానికే తలమానికంగా ఇంద్రకీలాద్రి విరాజిల్లుతున్నందున ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం తరపున పంపాలని కోరారు. నవ్యాంధ్రప్రదేశ్ ఎంపీలంతా ఈ మేరకు ఢిల్లీలో రైల్వే మంత్రిని కలిసి వినతిపత్రం అందించాలని శివాజీ డిమాండ్ చేశారు.

పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి: మాజీ ఎమ్మెల్సీ గిడుగు

పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. పోలవరం ఆర్అర్ ప్యాకేజీ వల్ల నిర్వాసితులు నష్టపోయారని, 18 ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పోలవరం పనులపై సమీక్షించి, పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించే అంశంపై ఒక స్పష్టత ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ పోరాటాల ఫలితమే అని గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. జనవరి 7 నుండి పోలవరం నిర్మాణం సత్వరం జరగాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మహాపాదయాత్రను, 10న సామూహిక సత్యాగ్రహం నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

నెల్లూరు సీనియర్ రెసిడెంట్ల సమ్మెకు కాంగ్రెస్ మద్దతు

నెల్లూరు సార్వజనిక ఆస్పత్రి సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ డాక్టర్ల సెల్ కో-ఛైర్మన్ డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ మద్దతు ప్రకటించారు. నెలల తరబడి జీతాలు రాక ఆఖరి ప్రయత్నంగా సమ్మెకు దిగిన నెల్లూరు సార్వజనిక ఆసుపత్రి డాక్టర్ల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ తన పూర్తి మద్దతును తెలియజేస్తుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యుల సమస్యలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొని ఉందని, కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న డాక్టర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ చేస్తామన్న ఎన్నికల హామీని ప్రభుత్వం నిలబెట్టుకోకపోగా కనీసం వారు చేసిన పనికి సకాలంలో జీతాలు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం డాక్టర్లను వేధిస్తుందన్నారు. నెల్లూరు ఆసుపత్రిలో జరుగుతున్న సమ్మెను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆసుపత్రులలో వైద్యులు చేపట్టకముందే బకాయిపడిన వారి జీతాలను, పెరిగిన పిఆర్‌సితో కలిపి వెంటనే చెల్లించాలని, వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

'స్వచ్ఛతకు ప్రభుత్వ ఉద్యోగులు కృషి చేయాలి'




జీఎస్టీ కార్యాలయాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఉద్యోగులు స్వచ్ఛత మార్గాన్ని అనుసరించాలని జీఎస్టీ(సెంట్రల్) కమిషనర్ ఎమ్. శ్రీహరి రావు సూచించారు. బుధవారం గుంటూరులోని జీఎస్టీప్రధాన కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్షోత్సవ (పక్వాడా) ముగింపు కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. గత పక్షం రోజులుగా ఉద్యోగులు కొంత సమయాన్ని వెచ్చించి కార్యాలయాన్ని శుభ్రపరచడం, ఉపయోగం లేని ఫైళ్లు, పాత వస్తువులను స్టోర్ రూమ్‌లకు తరలించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరిరావు మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం ప్రతి వ్యక్తి బాధ్యతన్నారు. సంస్కృతిలో భాగంగా పరిశుభ్రతను చేర్చుకోవాలని సూచించారు. స్వచ్ఛత అంటే పరిసరాలే కాదని చెపుతూ ప్రవర్తను కూడా స్వచ్ఛంగా ఉండాలన్నారు. పరిశుభ్రతలోనే మహాత్ముడు ఉంటాడనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ సందేశాన్ని వ్యాప్తి చేడయంలో ఉద్యోగులు విశేషంగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అడిషినల్ కమిషనర్ వి.నాగేంద్రరావు మాట్లాడుతూ పరిశుభ్రత అనేది నిరంతర ప్రక్రియ అని చెపుతూ దీనిని జీవనశైలిలో శాశ్వతం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ మిషన్ మార్గదర్శకసూత్రాలను కమిషనర్ ఉద్యోగులకు వివరించారు. అనంతరం హోదాలకు అతీతంగా ఉద్యోగులు కార్యాలయ పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు మహిపాల్, చాన్ భాషా, సూపరింటెండెంట్లు విల్సన్, గద్దె తిలక్, ఎమ్.నాగరాజు, కొండయ్య, వై.శ్రీనివాస్, మల్లెల శ్రీనివాస్, షబ్బీర్, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి ఎక్కువ కారణంగానే
రైతుకు గిట్టని గిట్టుబాటు

సీఏసీపీ చైర్మన్ ప్రొఫెసర్ విజయ్‌పాల్ శర్మ



సదస్సులో ప్రసంగిస్తున్న విజయ్‌పాల్ శర్మ. హాజరైన అధికారులు

అమరావతి, ఆంధ్రప్రభ: పంట పండించే రైతులకు తక్కువ ధర లభించడంలో వినిమయం కంటే ఉత్పత్తి ఎక్కువగా రావడం, తృణధాన్యాల సాగువైపు కాకుండా సాంప్రదాయ సాగు ఉత్పత్తులను సాగు చేయడం ప్రధాన కారణంగా నిలుస్తోందని కమిషనర్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైజెస్ (సిఎసిపి) ఛైర్మన్ ప్రొఫెసర్ విజయపాల్ శర్మ పేర్కొన్నారు. గతంలో జాతీయ స్థాయిలో నిర్వహించే సదస్సును ప్రాంతీయంగా జరుపుకునే విధానంలో విజయవాడలో దక్షిణ భారతదేశ రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు ఇక్కడి హోటల్‌లో బుధవారం జరిగింది. సదస్సును ఉద్దేశించి సిఎసిపి కమిషనర్ శర్మ మాట్లాడుతూ, వ్యవసాయ విధానంలో యాంత్రీకరణను అమలు చేయడంలో వ్యక్తిగత స్థాయిల కంటే సంఘాల,సామాజిక విధానంలో అమలు చేయడం ద్వారా యాంత్రీకరణ కోసం అయ్యే ఖర్చు తగ్గుతుందన్నారు. దక్షిణ భారత దేశ రాష్ట్రాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆశించిన స్థాయిలో సమావేశాల ఫలితాలు రావడం సంతోషంగా ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర లభించడంలో క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను సరైన ధృకృథంతో వెల్లడించారని అయితే సాగు చేసే పంటలు ఆయా ప్రాంతాలలో భూసార పరీక్షల ఆధారంగా చేపట్టడంతో పాటు ఎరువుల వినియోగాన్ని కూడా అందుకనుగుణం గానే చేపట్టాల్సి ఉంటుందన్నారు.ఏపి అగ్రికల్చర్, సహకార సంస్థ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బి. రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ఉత్పత్తుల స్థాయి పెరగడంలో కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం వల్ల సాధ్యమైందని జూన్ నాటికే కృష్ణా డెల్టా ప్రాంతంలో నీరు అందించడం వల్ల నవంబర్, డిసెంబర్‌నెలల్లో వచ్చే ప్రకృతి విపత్తుల నుండి పంటను కాపాడగలిగామన్నారు. రాష్ట్రంలో సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు.తెలంగాణా అగ్రికల్చర్ కమిషనర్ ఎం. జగన్మోహన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 24గంటలు వ్యవసాయ విద్యుత్‌ను అందిస్తున్నామని తెలంగాణాలో పంటల దిగుబడికి రైతులు చేసే ఖర్చుల వివరాలను వివరించారు. ఈ సమావేశానికి సమన్వయ కర్తగా ప్రాథమిక సెక్టార్ మిషన్ కో ఆర్డినేటర్ డా. ఎన్టీఆర్ కె. శర్మ, డిప్యూటీ డైరెక్టర్ బాలు నాయక్ వ్యవహ రించారు. ఈ సమీక్షలో తెలంగాణ ప్రతినిధి సునందిన , డా. సుహాసిని, తమిళ నాడుకు చెందిన రైతు ఎంఎస్ ధనపాల్ పుణ్యమ్, కర్నాటకకు చెందిన జగన్నాథ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రైతులు డి. జయరామిరెడ్డి, రమేష్ కన్నబాబు లు వారి అభిప్రాయాన్ని తెలిపారు. కూలీ రేట్లు అత్యధికంగా ఉన్నందున యాంత్రీకరణ విధానాన్ని మరింతగా అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు పేర్కొన్నారు.

వ్యవసాయ పరిశ్రమలు పెట్టండి

● ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు నేరుగా నాతో మాట్లాడండి
● మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



అమరావతి,ఆంధ్రప్రభ: నూతనంగా ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్‌కు వ్యవసాయం, పారిశ్రామికరంగం రెండు కళ్లుగా పనిచేస్తోంది. వ్యవసాయరంగంతో పాటు ఉద్యానవన పంటల అభివృద్ధికి ఉద్యానశాఖ అభివృద్ధి కోసం వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని, వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన పరిశ్రమలకు అవసరమైన యంత్ర సామాగ్రిని రాయితీలతో ఇస్తామని, ఇందుకు పారిశ్రామికవేత్త లు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసే పారిశ్రామిక వేత్తలకు పరిశ్రమలు పెట్టడానికి అనుకూలతతో పాటు విస్తారమైన మార్కెట్ అవకాశాలు రాష్ట్రంలో విస్తృతంగా ఉన్నాయని మంత్రి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఇక్కడి బందరు రోడ్డులోని ప్రైవేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన పరిశ్రమల ఏర్పాటుపై పారిశ్రామికవేత్త ల కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ యంత్ర పరికరాల తయారీకి ముందుకు వచ్చే సంస్థలకు మం చి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవ డంతో పాటు తగిన విధంగా సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించాలని కృషి చేస్తున్నామన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్తల్లో అవగాహన కల్పించి రాష్ట్రంలో తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేయించాలనేదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ యంత్ర పరికరాలు తయారు చేసే కంపెనీలు ఇతర రాష్ట్రాల్లోనే ఉన్నాయన్న ఉద్దేశ్యంతో ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పే వారికి మంచి రాయితీలు ఇవ్వబోతోందన్నారు.

రూ. 680 కోట్లతో కర్నూల్‌లో మెగాఫుడ్ పార్క్

అమెరికాకు చెందిన ఐయోవా స్టేట్ యూనివర్సిటీతో ఎంవోయూ కుదుర్చుకోవడం ద్వారా రూ.680 కోట్లతో 600 ఎకరాలలో మెగాఫుడ్ పార్కును కర్నూలులో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రంలో కోల్డ్ చైన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏపిఐఐసి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు వివరించారు. అనంతపురం జిల్లా ప్లాస్టిక్ పరిశ్రమకు, కృష్ణపట్నం వ్యవసాయ యాంత్రీకరణ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమన్నారు. ఏపీఐఐసీ ఛైర్మన్ జెఎస్ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ ఫుడ్ ఇండస్ట్రీలో బ్రాండ్ అంబాసిడర్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఉద్యానవన, సెరికల్చర్ శాఖల కమిషనర్ చిరంజీవి చౌదరి మాట్లాడుతూ మైక్రో ఇరిగేషన్ పంటల ద్వారా రైతులకు అధిక ఆదాయం అందించేందుకు తగిన తోడ్పాటు అందిస్తామన్నారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ రుతుపవనాలు సమయానుకులంగా రాకపోయినా మైక్రో ఇరిగేషన్‌తో నీటిని పొదుపుగా ఉపయోగిస్తూ సేద్యం చేసి పంటలు పండించవచ్చని, ఇందులో ఖర్చు తక్కువ దిగుబడి ఎక్కువగా ఉంటుందన్నారు. ముందుగా కొద్ది మంది ఎంటర్‌ప్రెన్యూర్స్‌తో కలిసి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించాఉ. వ్యవసాయ, ఉద్యానవన పరిశ్రమల ఏర్పాటు చేసిన పారిశ్రామిక వేత్తల శిబిరం-2018 కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనర్ హరిజవహర్ లాల్, సూక్ష్మసాగునీట పరికరాల తయారీ కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి వాణిజ్య లక్ష్మి అక్రమాస్తుల ప్రసాదం!

(మొదటిపేజీ తరువాయి)

వడ్డీ వ్యాపారం చేస్తున్న విషయాన్ని కూడా అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించి విలువైన పత్రాలు, పెద్ద మొత్తంలో ప్రామిసరీ నోట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెండేళ్ల కిందట కోమాలోకి వెళ్లిన భార్యకు ఇంటి వద్దనే ఆయన వైద్యం చేయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లక్ష్మీప్రసాద్ ఆరోగ్యం విషయంలో చెపుతున్న వాదనలను ఏసీబీ అధికారులు కొట్టిపడేశారు. సాయంత్రం లక్ష్మీప్రసాద్‌ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు విజయవాడలోని ఏసీబీ న్యాయమూర్తి సమక్షంలో హాజరుపరిచారు. లక్ష్మీప్రసాద్ అక్రమాస్తులకు సంబంధించిన వివరాలను అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ ఆర్.పి.ఠాకూర్ వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం కాకరపల్లి గ్రామానికి చెందిన గెడ్డపు లక్ష్మీప్రసాద్ 1987లో వాణిజ్య పన్నుల శాఖలో సీటీవోగా చేరారు. 1994లో అసిస్టెంట్ కమిషనర్‌గా గుంటూరు, 1998లో డెప్యూటీ కమిషనర్‌గా హైదరాబాద్‌లోని చార్మినార్ డివిజన్, విజయవాడ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, హైదరాబాద్, కర్నూలులో పని చేశారు. 2017 జూన్ నుంచి ఏపీ వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ హోదాలో అదనపు కమిషనర్(జీఎస్టీ)గా పని చేస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో నిర్వహించిన సోదాల్లో 11 నివేశన స్థలాలు, ఒక నివాస భవనం, మూడు ఫ్లాట్లు, 4.5ఎకరాల వ్యవసాయ భూమితో పాటు పెద్ద మొత్తంలో నగదు, నగలు గుర్తించినట్లు ఏసీబీ డీజీ ఠాకూర్ వెల్లడించారు.

ఆస్తుల వివరాలు..

- లక్ష్మీప్రసాద్ పేరిట శ్రీకాకుళం పట్టణంలో అత్యాధునిక హంగులతో జీ ప్లస్ టూ నివాస భవనం నిర్మించారు.
- 1997లో గుంటూరు గోరంట్లలో 400 చదరపు గజాల స్థలం కొనుగోలు చేశారు.

మొదటి భార్య అలివేలు పేరిట ఆస్తులు..

- 2014లో విశాఖపట్టణంలో 366.66 చదరపు గజాల నివేశన స్థలం కొనుగోలు చేశారు.
- 2001లో విశాఖపట్టణంలో 200 చదరపు గజాల నివేశన స్థలం ఆర్జించారు.
- 2011లో హైదరాబాద్‌లోని పరిగిలో 200 చదరపు గజాల చొప్పున రెండు నివేశన స్థలాలు కొన్నారు.
- 2009లో హైదరాబాద్ పరిగిలో 200 చదరపు గజాలు, 2011లో మరో 200 చదరపు గజాలు కొన్నారు.
- గుంటూరు జిల్లా గోరంట్లలో 1993లో 889 చదరపు గజాల స్థలం ఆమె పేరిట కొన్నారు.

రెండో భార్య మల్లిక పేరిట..

- 2014లో గుంటూరు జిల్లా తాడికొండ మండలం లామ్ గ్రామంలో 172 చదరపు గజాలు, 400 చదరపు గజాల చొప్పున రెండు నివేశన స్థలాలు, గోరంట్లలో 240 చదరపు గజాలు కొనుగోలు చేశారు.
- 2004లో హైదరాబాద్ అశోక్‌నగర్‌లో ఫ్లాటు, 2010లో హైదరాబాద్ నారాయణగూడలో 1594 చదరపు అడుగుల ఫ్లాటు, 2014లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో 2040 చదరపు అడుగుల ఫ్లాటును మల్లిక పేరిట కొన్నారు.
- 2013లో రంగారెడ్డి జిల్లా అమీర్‌పేటలో గుంట భూమి, 2013లో 1.14 గుంటలు, 2017లో విశాఖపట్టణం జిల్లా అచ్యుతాపురం మండలం దుప్పిటూరు గ్రామంలో 0.17 సెంట్ల భూమిని కొనుగోలు చేశారు.
- అత్త ఎరబాటి అప్పల నరసమ్మ పేరిట 2013లో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలో రెండెకరాల వ్యవసాయ భూమి కొన్నారు.
- మరదలు పేరిట 2013లో అమీర్‌పేటలో రెండెకరాల వ్యవసాయ భూమి, 2015లో గుంటూరు జిల్లా గోరంట్లలో 222 చదరపు గజాల ఖాళీ స్థలం కొనుగోలు చేశారు.

చరాస్తుల వివరాలు..

- రూ.కోటి విలువైన ప్రామిసరీ నోట్లు.
- బ్యాంకులో నగదు రూ.34 లక్షలు
- ఇంట్లో నగదు రూ.32లక్షలు
- రూ.40లక్షల విలువైన బంగారు ఆభరణాలు.
- రూ.10లక్షల విలువైన గృహోపకరణాలు.
- మూడు ఖరీదైన కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు ఉన్నాయి.
- హైదరాబాద్ చిక్కడపల్లి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో లాకర్ తెరవాల్సి ఉంది.

అరెస్ట్ ఆపడం కుదరదు!

-గెజిటెడ్ సంఘానికి చుక్కెదురు

అమరావతి, ఆంధ్రప్రభ: అక్రమాస్తుల కేసులో చిక్కిన వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర కమిషనర్ గెడ్డపు లక్ష్మీప్రసాద్‌ను అరెస్టు నుంచి తప్పించేందుకు ఆ శాఖ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బుధవారం ఉదయం నుంచే ఆయన ఆస్తులపై దాడులు చేస్తున్న విషయం తెలుసుకున్న గెజిటెడ్ ఉద్యోగుల సంఘం వాణిజ్య పన్నుల శాఖ మంత్రి యనమల రామకృష్ణుడుని కలిసింది. భార్య అనారోగ్య కారణాలను దృష్టిలో ఉంచుకొని మానవతా దృక్పథంతో ఆయనను అరెస్టు నుంచి కాపాడాలంటూ మంత్రికి వారు విజ్ఞప్తి చేయగా కుదరదని చెప్పినట్లు తెలిసింది. సంబంధిత మంత్రి నుంచి సానుకూలత వ్యక్తం కాకపోవడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిసేందుకు వారు ప్రయత్నించారు. అయితే విశాఖపట్టణం రేంజ్ అధికారులు కేసు నమోదు చేయడంతో ఆయనను అక్కడి కోర్టులో హాజరుపరచాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని విజయవాడలో అదుపులోకి తీసుకున్నందున ఇక్కడి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచడంతో ఉద్యోగ సంఘాల నేతలు చేసిన ప్రయత్నాలకు అడ్డుకట్ట పడినట్లు చెప్పొచ్చు. గతంలో విజయవాడ వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఉప కమిషనర్‌గా పని చేసిన ఎస్.శేఖర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేయకుండా నిలువరించడంలో ఈ సంఘం నేతలు సఫలీకృతం అయ్యారు. ఇదే ధీమాతో ఉన్న సంఘం నేతలకు ప్రభుత్వం నుంచి సానుకూలత వ్యక్తం కాకపోవడం, ఏసీబీ అధికారులు వెనువెంటనే అరెస్టుకు చర్యలు చేపట్టడంతో ఖంగుతిన్నారు.

రైతుల సంక్షేమం, ఉద్యోగుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

● ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయిస్ సర్వీసెస్ కౌన్సిల్‌లో మంత్రి సోమిరెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ: రైతులు, ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ శాఖలో ఖాళీలను భర్తీ చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. బుధవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ 27వ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు, కార్యక్రమాలను వారికి అందేలా వ్యవసాయ శాఖ ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందింపుచ్చుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆదాయం రైతులకు చేకూ రేలా ఉద్యోగులు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉద్యోగులపై పనిభారం , ఒత్తిడి లేకుండా అన్ని చర్య లు చేపడుతున్నామని, త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామన్నా రు. అనంతరం ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయీస్ డైరీని మంత్రి ఆవిష్కరించారు. ఉద్యోగులు మంత్రి సోమిరెడ్డి, చంద్రమోహా న్ రెడ్డి, కమిషనర్ హరిజవహర్ లాల్‌లను గజమాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరిజవహర్ లాల్, ఏపీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు పి. అశోక్‌బాబు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వ్యవసాయ శాఖ ఎ.డి విజయలక్ష్మీ, వినయ్ చంద్, ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి అధ్యక్షుడు డాక్టర్ కె. కమలాకరశర్మ, కార్యదర్శి ప్రవీణ్, వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రొయ్యల సాగులో యాంటీ బయాటిక్స్ నిలువరిస్తాం

● మంత్రి ఆదినారాయణ రెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ: దేశంలోని రొయ్యల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన ఉందని, ఇక్కడ ఉత్పత్తి అవుతున్న రొయ్యల్లో ఎలాంటి యాంటీ బయాటిక్స్ అవశేషాలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సమాయత్తం అయ్యిందని రాష్ట్ర మార్కెటింగ్, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం సచివాలయంలో రొయ్యల సాగులో యాంటీ బయాటిక్స్ వినియోగంపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా రిజిస్టర్ కాని రొయ్యల చెరువులు ఉండకూడదని, గుర్తింపు లేని చెరువులను తక్షణమే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. లైసెన్స్‌ల రెన్యువల్స్‌ను ఏడాది కాకుండా మరికొంత గడువు పెంచాలని సూచించారు. మత్స్య విశ్వవిద్యాలయాలన్ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్నట్లుగా వెల్లడించారు. సాగరమాల పథకం కింద రాష్ట్రంలోని ఐదు ఫిషింగ్ హార్బర్‌లను రూ.15 వందల కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంతర్వేది ఫిషింగ్ హార్బర్ ఏర్పాట్ల జాప్యంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. మత్స్య శాఖలో నిధుల వినియోగంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి వారం జిల్లాల వారీగా వీడియో సమా వేశాలు నిర్వహించి పురోగతి తెలుసుకోనున్నట్లు మంత్రి చెప్పారు. ఈ సమీక్షలో మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణద్వివేది, కమిషనర్ రామశంకర్ నాయక్, అదనపు కమిషనర్ సీతారామ రాజు, అఖిల భారత రొయ్యల రైతు సమాఖ్య అధ్యక్షుడు ప్రసాద్ మోహన్ రాజు, ప్రధాన కార్యదర్శి బాల సుబ్రహ్మణ్యం, ఈక్వెడార్ దేశ సలహాదారు యహిరా పాల్గొన్నారు.

రేషన్ బియ్యం రీసైక్లింగ్‌పై కఠిన దండన: పత్తిపాటి

అమరావతి, ఆంధ్రప్రభ : రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్‌చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి అన్న క్యాంటీన్లు, విలేజ్ మాల్స్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఆయన బుధవారం వెలగపూడి సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ క్యాంటీన్లు, మాల్స్‌ను మే, జూన్ నెలల్లో ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రైస్ మిల్లులో రీసైక్లింగ్ ను అ డ్డుకునేందుకు వి ద్యుత్ వాడకాన్ని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. పీడీఎస్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసే మిల్లర్లకు చెల్లింపులు నిలిపివేస్తామని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీడీఎస్ బియ్యం రీ సైక్లింగ్ చేయకూడదని, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా రైస్ మిల్లర్ల సంఘాలు తీర్మానం చేశాయని గుర్తుచేశారు. మిగిలిన జిల్లాల మిల్లర్లు కూడా ఇదే విధంగా నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

సింహపురిలో అవయవదానం

● ఐదుగురి జీవితాలలో వెలుగు నింపిన పోతురాజు బుజ్జయ్య ● చెన్నై గ్లోబల్‌కు గుండె, ఊపిరితిత్తులు ● తిరుపతి సిమ్స్‌కు ఒక కిడ్నీ.. సింహపురి హాస్పిటల్‌కు మరో కిడ్నీ ● మోడ్రన్ ఐ హాస్పిటల్‌కు రెండు నేత్రాలు తరలింపు







నెల్లూరు (దర్గామిట్ట), ప్రభ న్యూస్: ఆయన పేరు పోతురాజు బుజ్జయ్య. ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయ్యారు. ఆయన భార్య మణి కుమారి విశాల హృదయంతో తన భర్త అవయవాలను దానం చేసేందుకు అంగీకరించింది. అవయవదానంతో బుజ్జయ్య అమరుడయ్యాడని మోడేగుంట గ్రామస్థులు కొనియాడారు. బుధవారం సింహపురి హాస్పిటల్ ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ ఛైర్మెన్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. జనవరి 27వ తేది విడవలూరు మండలం మోడేగుంట గ్రామానికి చెందిన పోతురాజు బుజ్జయ్య (34) పొలం పనులకు వెళుతూ ప్రమాదవశాత్తు క్రిందపడి తలకు గాయం కావడంతో తమవద్దకు రావడం జరిగిందన్నారు. అతనికి స్కాన్ పరీక్ష చేసి చూడగా తలలో రక్తం గడ్డకట్టి ఉందని, దీనికి శస్త్రచికిత్స ద్వారా తొలగించడం జరిగిందన్నారు. అయితే 30వ తేదీన పేషెంట్ వెంటిలేటర్‌పై ఉండగానే బ్రెయిన్ డెడ్ అయినట్లు ఇంటెన్సివిస్ట్, న్యూరాలజిస్ట్, న్యూరోసర్జన్‌లతో కూడిన వైద్యబృందం నిర్ధారించారు. ఇతనికి భార్య మునికుమారి, కుమారులు హేమంత్, జశ్వంత్‌లు ఉన్నారు. ఈ విషయాన్ని వెంటనే వారి కుటుంబసభ్యులకు తెలియజేశామన్నారు. ఇలా బ్రెయిన్ డెడ్ అయిన పేషెంట్లు నుండి ప్రభుత్వ సంస్థ అయిన జీవన్‌దాన్ ద్వారా అవయవాలను సేకరించి అవసరమైన వారికి అమర్చే బృహత్తర పథకం గురించి పేషెంట్ భార్యబిడ్డలకు, బంధువులకు వివరించడం జరిగిందన్నారు. వారు దానికి సానుకూలంగా స్పందించి వెంటనే అవ యవదానం చేసేందుకు ముందుకొచ్చారన్నారు. ఇందుకు వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వారి పిల్లల చదువుల నిమిత్తమై తమవంతు ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. అదేవిధంగా పేషెంట్ నుండి సేకరించిన గుండె, ఊపిరితిత్తుల ను చెన్నై గ్లోబల్ హాస్పిటల్‌కు, ఒక కిడ్నీని తిరుపతి సిమ్స్‌కు, మరో కిడ్నీని సింహపురి హాస్పిటల్‌లోని పేషెంట్‌కు, రెండు నేత్రాలను నెల్లూరు మోడ్రన్ ఐ హాస్పిటల్‌కు పంపించడం జరిగిందన్నారు. మా హాస్పిటల్ నందు ఈ అవయవదానం చేయడం ఇది మూడవసారి అని, ఇదంతా కూడా మా హాస్పిటల్ నందు అపార అనుభవం కలిగిన వైద్య నిపుణులు ఉండడం వల్లే సాధ్యపడిందన్నా రు.అనంతరం మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జీవన్‌దాన్ ద్వారా అవయవాలను సేకరించ డంలో ఎన్నో వ్యయప్రయాస లకు ఓర్చి అత్యంత పారదర్శ కంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఎటువంటి అపోహలకు, అనుమానాలకు తావులేకుండా అవయవదాతలు, గ్రహీతలు జీవన్‌దాన్ వద్ద సలహాలు, సూచనలు తీసుకుని అవయవదానాలను చేస్తున్నారని తెలిపారు. ఈ అవయవదానాన్ని చేసేవారు ముందస్తు రిజిస్ట్రేషన్ జీవన్‌దాన్ ద్వారా చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యూరాలజిస్ట్ డాక్టర్ దీక్షాంతి నారాయణ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

చందమామ కనువిందు

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంలో సూపర్ మూన్,బ్లూ మూన్, బ్లడ్ మూన్‌ల రూపంలో దర్శనమివ్వడం ఆశ్చర్యమే మరి. ఇన్ని రంగుల్లో కనిపించడం ద్వారా సూపర్ బ్లూ బ్లడ్ మూన్‌గా పిలవబడింది. ఇలాంటి అరుదైన ఆవిష్కరణ దృశ్యం చివరి సారిగా 1982లో చోటు చేసుకుందంటున్నారు. ఇలాంటిది మళ్లీ 2037లోనే మళ్లీ సంభవిస్తుందని చెప్పడంతో అనేక ప్రాంతాల్లో జనం ఆరు బయటకు వచ్చి,చంద్రగ్రహన్ని తిలకించి,ఆనందం వ్యక్తం చేశారు. భ్రమణ సమయంలో భూమికి దగ్గరగా వచ్చినప్పుడు సంభవించే పౌర్ణమినే సూపర్‌మూన్‌గా పిలుస్తారు. ఈ సమయంలో చంద్రుడు సాధారణ పౌర్ణమి కంటే కాస్తా పెద్దగా కనిపించింది. అంతే కాకుండా ఒకే నెలలో రెండుసార్లు పౌర్ణమిగా చంద్రుడు రావడంతో బ్లూ మూన్‌గా పిలుస్తున్నారు. చంద్రగ్రహణం రోజు భూమి వాతావరణం గుండా వచ్చినప్పుడు చంద్రుడిపై సూర్యకిరణాలు పడడంతో చంద్రుడు గోదుమ రంగులో కనిపించాడు. ఈ పరిణామాన్నే బ్లడ్ మూన్‌గా పిలుస్తున్నారు. అయితే బ్లూ,బ్లడ్,సూపర్‌మూన్‌లు కలిసిరావడమే ఈసారి అరుదైన ఆవిష్కరణగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సాయంత్రం 5:18 గంటలకు ప్రారంభమైన సంపూర్ణ చంద్రగ్రహణం రాత్రి 7:30 గంటల వరకు కొనసాగి,సమాప్తమయ్యింది. కాగా బీజింగ్ వంటి దేశాల్లో ఈ ఖగోళ అద్భుతాన్ని తిలకించేందుకు పోటీ పడ్డారు. నాసా కూడా తన వెబ్‌సైట్ ద్వారా గ్రహనాన్ని లైవ్ ఇచ్చింది.భారత్‌తో పాటు ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర ప్రాంతాల్లో ఈ సూపర్ బ్లూబ్లడ్ మూన్ కనిపించి,జనానికి కనువిందు చేసింది. అయితే భారత్‌లో మాత్రం సంపూర్ణంగా కనిపించింది. మనవద్ద తూర్పు వైపున ఆకాశంలో కనిపించింది.దీని వల్ల సముద్రంలో కొద్దిగా అలల్లో తేడా వచ్చిందంటున్నారు. చంద్రుడు పరిణామం పెరిగి కనిపించింది. పౌర్ణమినాడు భూమికి దగ్గరగా వచ్చినప్పుడు ఇది సాధ్యమైందంటున్నారు. సాధారణంగా కనిపించే చంద్రుడి కంటే ఈరోజు 14 శాతం రెట్టింపు ఆకారంలో కనిపించింది. అంతేకాకుండా ఎంతో ప్రకాశవంతంగా కనిపించింది. ఈ అరుదైన దృశ్యాలను తిలకించేందుకు అనేక విధాలుగా ప్రయత్నించారు. బైనాక్యులర్లు,టెలిస్కోప్‌లు ఉపయోగించారు. ఒక విధంగా చెప్పాలంటే ప్రపంచ వ్యాప్తంగా ఈ అరుదైన దృశ్యాలు జనాన్ని అలరించాయి. అయితే ఈ అరుదైన దృశ్యాన్ని తిలకించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని సెంటర్లలో ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన టెలిస్కోప్‌ల ద్వారా జనం ఈ చంద్రగ్రహణం దృశ్యాలను తిలకించారు. సూర్యగ్రహణం అయితే కాస్తా ఇబ్బంది ఉంటుంది.కానీ చంద్రగ్రహణం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదని ప్రచారం చేసిన కారణంగా చాలా చోట్ల ముందుకొచ్చి,ఈ దృశ్యాలను తిలకించి, సంభ్రామాశ్చర్యాలకు లోనయ్యారు. అరిష్టమని శాస్త్రీయంగా ఎలాంటి నిరూపణలు లేదని చెప్పడంతో అనుమానం ఉన్న వారు టెలిస్కోప్‌ల ద్వారా తిలకించారు.

భూములు వాపస్!



(మొదటిపేజీ తరువాయి)

మంత్రి వర్గ ఉపసంఘం సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. పట్టణాభివృద్ధి విధానాల సంస్కరణపై ఉపసంఘం చర్చించింది. అదే విధంగా పర్యాటకశాఖ అభివృద్ధిపై కూడా చర్చించడం జరిగింది. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలలో పెద్ద ఎత్తున కుటుంబ వినోద కేంద్రాల ఏర్పాటును ప్రతిపాదించడం జరిగింది. అదే విధంగా కాకినాడలో రిసార్ట్, ప్రకాశం జిల్లా చీరాలలోని ఓడరేవు సమీపంలో రిసార్ట్ గురించి ప్రతిపాదించారు. విశాఖ ఎఫ్‌ఈసీలో ఒక ఐమాక్స్ థియేటర్, ఎనిమిది వెండితెరల మల్టీప్లెక్స్, 2 వేల సీట్ల సామర్థ్యం కలిగిన ఒక కాన్ఫరెన్స్ హాలు, ఇన్సెంటివ్స్, కన్వెన్షన్‌లు, ఈవెంట్‌లు, 50 వేల అడుగుల వాణిజ్య స్థలం, త్రిస్టార్ హోటల్ ఉండేలా ప్రతిపాదనలు వచ్చాయి. అదే విధంగా విజయవాడలోని ఎఫ్‌ఈసీలో ఒక ఐమాక్స్ థియేటర్, 8 వెండితెరల మల్టీప్లెక్స్, 2 వేల సీట్ల సామర్థ్యం కలిగిన ఎంఐసీఈ, 50 వేల అడుగుల వాణిజ్య స్థలం, త్రిస్టార్ హోటల్‌ను ప్రతిపాదించారు. తిరుపతిలోని ఎఫ్‌ఈసీలో ఒక ఐమాక్స్ థియేటర్, 6 వెండితెరల మల్టీప్లెక్స్, 2 వేల సీట్ల సామర్థ్యం కలిగిన ఎంఐసీఈ, 80 వేల అడుగుల వాణిజ్య స్థలం, త్రిస్టార్ హోటల్ ఉంటాయని ప్రతిపాదించారు. కాకినాడలో మొత్తం 10 ఎకరాల స్థలంలో ఒక రిసార్ట్ ఏర్పాటు చేసి అక్కడ వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ మొత్తం ప్రాజెక్టునకు రూ.100 నుంచి 150 కోట్లు పెట్టుబడులు వచ్చే అవకాశముందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పితాని సత్యనారాయణ, భూమా అఖిల ప్రియ, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వలవన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్య రాజ్, గృహ నిర్మాణ శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి కాంతిలాల్ దండే పాల్గొన్నారు.

గ్రహణం కారణంగా
శ్రీవారి ఆలయం మూసివేత

రాత్రి 9.30 గంటల నుంచి దర్శనం ప్రారంభం



తిరుమల, ప్రభ న్యూస్: చంద్రగ్రహణం కారణంగా బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేశారు. గ్రహణం అనంతరం రాత్రి 9.30 గంటల తర్వాత భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించారు. అంతకు మునుపు శ్రీవారి ఆలయం తలుపులు మూసిన అనంతరం జేఈవో విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం 5.18 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై రాత్రి 8.41 గంటలకు పూర్తి అయిందన్నారు. అనంతరం రాత్రి 9.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పున్యహ వచనం, రాత్రి కైంకర్యాలు అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించామన్నారు. చంద్రగ్రహణం కారణంగా సమయాన్ని సూచించే 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, దివ్యదర్శన టోకెన్ల జారీని నిలిపివేసినట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రత్యేక ప్రవేశ దర్శాలను రద్దు చేశామన్నారు. అన్నప్రసాద వితరణ లేనికారణంగా వైకుంఠం క్యూ కాంప్లెక్సులోకి భక్తులను అనుమతించలేదన్నారు.

కాణిపాకం ఆలయం మూసివేత

చంద్రగ్రహణం కారణంగా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయాన్ని బుధవారం ఉదయం 12 గంటల లనుంచి మూసివేశారు. భక్తులతో కళకళలాడే ఆలయం క్యూకాంప్లెక్స్ వెలవెల పోయింది. గ్రహణం అనంతరం ఆలయాన్ని శుద్ధి చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

అప్పన్న ఆలయం మూసివేత

విశాఖపట్నం (సింహా చలం), ప్రభన్యూస్ బ్యూరో: చంద్రగ్రహణం సందర్భంగా సింహాచలం శ్రీ వరాహాలక్ష్మీ నృసింహస్వామి ఆలయాన్ని బుధవారం మూసివేశారు. ఉదయం 6.30 నుంచి 8.30 వరకే భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. ఆ తరువాత ఆలయ ప్రధాన ద్వారంతోపాటు ఇతరత్ర మార్గాలను మూసివేయడం జరిగింది. ప్రతీ రోజు ఆలయంలో నిర్వహించే నిత్య కళ్యాణంఆర్జిత సేవలు రద్దు చేశారు. రాత్రికి గ్రహణం అనంతరం ఆలయ వర్గాలు సంప్రోక్షణ నిర్వహించారు. తదుపరి ఆయా విభాగాలను శుద్ధి చేసి తిరిగి మూసివేశారు.

చంద్రగ్రహణం సందర్భంగా బుధవారం మధ్యాహ్నం అన్నవరం సత్యనారాయణస్వామి వారి ఆలయం, ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయాలు మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం గురువారం ఉదయం తిరిగి దర్శనాలు మొదలౌతాయి.

- ప్రభన్యూస్, కాకినాడ





గ్రహణం వేళ రోకలి ఇలా...!

ఏలూరు, ప్రభన్యూస్ : పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామలలో చంద్ర గ్రహణం సందర్భంగా తుట్టగుంట అచ్యుతరామయ్య ఇంటి ఆవరణలో నీళ్లతో నిండిన పళ్ళెములో రోకళ్ళను ఉంచి పూజలు చేశారు. సాధారణంగా రోకలి పళ్ళెములో నిలబడదు. అయితే గ్రహణ సమయంలోనే ఇది నిలబడుతుంది అని గ్రామీణుల విశ్వాసం.

నిఘా నిద్దరోతోంది.. దగా సాగిపోతోంది

● అభాసుపాలౌతున్న ఉచిత ఇసుక విధానం!
● ఇసుకాసురులుగా మారిన ప్రజాప్రతినిధులు
● మాఫియా గుప్పెట్లో ఇసుక ర్యాంపులు
● అంతటా పర్సంటేజీల గోలే..!

ఏలూరు, ప్రభన్యూస్ ప్రతినిధి: ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అక్రమార్జనే ధ్యేయంగా తెగబడుతున్న ఇసుకాసురులను అడ్డుకునేందుకు ఎవ్వరూ సాహసించే పరిస్థితులు లేవు. రాజకీయ అండదండలతో ఇసుక సిండికేట్ల ఆగడాలకు అడ్డే లేకుండా పోతుంది. పేదోడి కోసం తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన ఉచిత ఇసుక విధానం అభాసుపాలౌతోంది. పేరుకే ఉచితం..ఎక్కడా తాము చెప్పిన రేటు ఇవ్వక పోతే కనీసం తట్టడైనా సరే ఇసుకను ర్యాంపు నుండి ఎవ్వరూ తీసుకు వెళ్లలేరంటున్నారు. ర్యాంపులు వద్ద ఎక్కడకక్కడ చెక్‌పోస్టులను పెట్టుకుని స్వంత సైన్యంతో మరీ మాఫియా తన దందాను సాగిస్తోంది. సామాన్యుడెవ్వరూ అసలు ఇసుక ర్యాంపుల్లో అడుగు పెట్టేందుకు సాహసం చేయలేని భయానక పరిస్థితులు నెలకున్నాయి. రాష్ట్రంలో దాదాపు 350కు పైగానే ఇసుక ర్యాంపులు ఉన్నాయి. గోదావరి, పెన్నా, వంశధార, తుంగభద్ర నదుల్లో ఈ ఉచిత ఇసుకను నామ మాత్రపు ధరపై అంతా తీసుకుని వాడుకోవచ్చు. కానీ ఎక్కడా ఉచితం సక్రమంగా అమలు కావడం లేదు. ప్రభుత్వ లక్ష్యానికి సాక్షాత్తు అధికార పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులే తూట్లు పోడుస్తూ నీరు గార్చడం బాధాకరం. రానున్నవి సార్వత్రిక ఎన్నికలు కావడం వల్ల నేతలు అక్రమార్జనకు తెరతీసుంటారనే ప్రచారం సాగుతోంది. నదులెన్ని ఉన్నా సరే గోదావరిలోని ఇసుక రేణువులే నిర్మాణ రంగానికి బలమనే వాదన బలంగా ఉంది. హైదరాబాద్, వైజాగ్, కాకినాడ, రాజమండ్రి, హనుమాన్ జంక్షన్, ఏలూరు ప్రాంతాల్లో నిర్మాణ రంగం పుంజుకోవడంతో ఇసుకకు భారీగా డిమాండ్ ఏర్పడింది. ఓ దశలో పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ర్యాంపుల నుండి సైతం సుదూరంలోని బెంగుళూరుకు ఇసుక రవాణా జరిగిందంటే ఇక్కడి ఇసుకకు ఉన్న క్రేజ్ అర్ధం కాగలదు. పోలవరం నుండి చించినాడ వరకు గోదావరి తీరం వెంట సుమారు 18 ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఎక్కడ చూసినా కానీ ర్యాంపుల్లో నిబంధనలు బేఖాతరే. ర్యాంపుల్లో జెసిబిలు, ప్రోక్లేయినర్లు వంటి యంత్రాలు దర్శనమిస్తున్నాయి. తిరునాళ్లను తలపించేలా ట్రాక్టర్లు, లారీల క్యూలతో ఇసుక ర్యాంపులు సందడి చేస్తున్నాయి. పోలవరం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లోనూ గోదావరి తీరపు ఇసుక ర్యాంపులు అక్రమాలతో కళకళలాడుతున్నాయి. ఇక్కడ్నుండి నిత్యం వందల సంఖ్యలో లారీలు ఇసుక లోళ్లతో బయట ప్రాంతాలకు వెళుతున్నాయి. రేయింబవళ్లు ఇక్కడ ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. పోలవరం, గూటాల, కొవ్వూరు రేవుల్లోనూ ఇసుకాసురులు తిష్టేశారు. పందలపర్రు, పెండ్యాల, సిద్ధాంతం రీచ్‌లలోనూ ప్రభుత్వం నోటిపై చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. యలమంచిలిలోని దొడ్డిపట్ల, చించినాడ ర్యాంపుల్లో ఈ మధ్యనే తవ్వకాలు ఆరంభించారు. వాస్తవానికి కూలీలు తవ్వే ఇసుకనే ఉచింతగా భావిస్తారు. కానీ నిబంధనలుకు పాతరేస్తూ బరితెగించి అధికార పార్టీ నేతలు దొరికినంతగా దోచుకుంటున్నారు, దాచుకుంటున్నారనే విమర్శలు జోరందుకున్నాయి. పలువురు రాజకీయ నేతల అండదండలతో దళారులు సిండికేట్‌గా మారి ఇసుక దందా చేస్తున్నారు. యూనిట్ ధర రూ.800 చెల్లించాల్సి ఉండగా



ఇక్కడ రూ.1500 నుండి రూ.2 వేల వరకు తీసుకుంటున్నా రు. కూలీలెక్కడా ఇక్కడ మచ్చుకైనా కానరారు. అంతా అదికార పార్టీకి చెందిన పలువురు రాజకీయ నేతల కనుసన్నల్లోనే ర్యాంపులు నడుస్తున్నాయనే విమర్శలున్నాయి. గతంతో పోల్చి చూస్తే కొందరి పాలిట ఇసుక వరమైందంటున్నారు. గతానికి ప్రస్తుతానికి పోల్చి చూస్తే పలువురు రాజకీయ నేతల భాగ్య రేఖలు బాగా మెరుగయ్యాయి. పోలీసు, రెవిన్యూ,మైనింగ్ శాఖల అధికారులు మూగనోము పట్టారు. రీచ్‌లలో కొన్నింటిని విభేదాలతో మూసేశారు. ఇది కూడా ఇసుకాసురులకు కలిసోచ్చేలానే ఉంది. ఎందుకంటే ఇసుకకు డిమాండ్ పెరిగి అడిగినంత కాసుల్ని చేతుల్లో పెడ్తున్నారు. మంత్లీ మామూళ్లతో పలు శాఖల అధికారులు మత్తులో జోగుతున్నారు. ఏటా ఇసుక అక్రమార్కులు దాదాపుగా పది వేల రూపాయల మేర రాష్ట్ర వ్యాప్తంగా ధనార్జన చేస్తున్నారనే అంచనాలున్నాయి. అమ్మేవారు ప్రజాప్రతినిధులైతే అడ్డుకునే వారెవ్వరనే ప్రచారం విస్తృతంగా ఉంది. యధేచ్చాసాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలతో భవిష్యత్‌లో పర్యావరణానికి పెనుముప్పును తెచ్చిపెడ్తుందనే ఆంధోళన వ్యక్తం అవుతోంది. వర్షాకాలంలో నదుల్లోని ఈ పెద్ద పెద్ద గోతులే పశువులకు, మనుషులకు సైతం మృత్యుకుహరాలుగా మారే ప్రమాదం లేకపోలేదంటున్నారు. ఏదేమైనప్పటికీ సిఎం చంద్రబాబు మంచి ఉద్దేశ్యంతో తెచ్చిన ఉచిత ఇసుక విదానం ప్రజల్లో వ్యతిరేక భావాన్ని తీసుకువచ్చేలా మారడం బాధాకరమే.





చందమామ త్రిపాత్రాభినయం

ఆకాశంలో అద్భుతం • ప్లానిటోరియమ్‌లకు పోటెత్తిన జనం • అబ్బురపరిచే ఖగోళ అద్భుత వీక్షణం

న్యూఢిల్లీ: చందమామ ఆకాశంలో అద్భుతాన్ని బుధవారం రాత్రి ఆవిష్కరించింది. అరుదైన చంద్ర గ్రహణం ఇదిగిదుగో అన్నట్టుగా అరుణ వర్ణం పులుముకున్న చందమామ రాగి రంగు అంచుతో గగనంలో కనువిందు చేసింది. కనువిందు గొలిపిన ఘట్టాన్ని వీక్షించడానికి దేశవ్యాప్తంగా వేర్వేరు ప్లానిటోరియంలకు ఖగోళ ప్రేమికులు సందర్శించారు. చందమామ తనంతటతానుగా త్రిపాత్రాభినయం చేసింది. మొదటగా భూమికి అత్యంత సమీపానికి చేరుకుంది. పరిమాణంలో భారీగా, అత్యంత ప్రకాశవంతంగా కనిపించింది. అదే సూపర్ మూన్. దశాబ్దాల తర్వాత మానవాళికి వీక్షించే మహత్తరమైన అవకాశాన్ని అందించింది. అలా మొదటి పాత్ర ముగిసింది. ఆ తర్వాత వచ్చింది బ్లూ మూన్. అదే ఒక క్యాలెండర్ మాసంలో సంభవించే రెండవ పౌర్ణమి బ్లూ మూన్. రెండవ పాత్ర పోషణ పూర్తయిపోయింది. ఇక 'త్రిపాత్రాభినయం'లో చివరిది బ్లడ్ మూన్. గ్రహణానికి ఎరుపు వర్ణాన్ని ఆపాదించింది. ఈ పాత్ర పోషణలో చందమామ గగనంలో పుట్టుకొచ్చిన కందగడ్డను తలపించింది. ఇలాంటి అవకాశం జీవితంలో ఒకసారి వస్తుంది సుమా అన్నట్టుగా ప్రపంచంలో అనేకచోట్ల ప్రజలకు మూడు రూపాల్లో చందమామ కనిపించింది. ఢిల్లీ, పూణే, కోల్‌కతా, తదితర నగరాల్లో ప్లానిటోరియంలకు ప్రజలు క్యూ కట్టారు. ఖగోళ శాస్త్రవేత్తల మార్గదర్శనంలో అద్భుతాన్ని వీక్షించారు. ఢిల్లీలో ఇండియా గేట్ ప్రాంతంలో చందమామను చూడటానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కానీ ఆరంభంలో వారిని నిరాశపరుస్తున్నట్టుగా చందమామ మేఘావృతమై కనిపించింది. కానీ కాసేపటికి మబ్బులు తొలగిపోవడంతో ఎరుపు రంగులో చందమామ వారికి కనువిందు చేసింది. అరుదైన చంద్రగ్రహణాన్ని అందరూ వీక్షించేలా చేయడం కోసం దేశవ్యాప్తంగా అనేక సంస్థలు రంగంలోకి దిగాయి. స్పేస్ ఇండియా అనే స్టార్టప్ ఢిల్లీలో ఇండియా గేట్ సహా చెన్నయ్, బెంగళూరు, సూరత్, డెహ్రాడూన్, మీరట్ నగరాల్లో చంద్ర గ్రహణ వీక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఇండియాగేట్ దగ్గర డాబ్సోనియన్ టెలిస్కోప్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచింది. ఈ టెలిస్కోప్‌తో సూపర్‌మూన్‌ను అత్యంత స్పష్టంగా, ఎంతో దగ్గరగా చూడవచ్చు. డాబ్సోనియన్ టెలిస్కోప్ పుణ్యమా అని ప్రజలు మామూలుగా చూసిన దాని కన్నా 20 రెట్లు పెద్దదిగా చందమామను వీక్షించారు. వందలాదిగా ఆబాలగోపాలం ఇండియా గేట్ చేరుకొని మూడు పాత్రల్లో చందమామను కనులారా చూశారు.

భారతదేశంలో చంద్రగ్రహణం సాయంత్రం 4.21 గంటలకు ప్రారంభమైంది. 6.25 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం దర్శనమిచ్చింది. సాయంత్రం7.25 గంటల నుంచి చంద్రుడి పరిమాణం తగ్గుతూ వచ్చింది. ఈ ఏటి తొలి సంపూర్ణ చంద్ర గ్రహణం భారతదేశంలో పాక్షికంగా కనిపించింది. జూలై 28న అలాంటి రెండవ గ్రహణం భారతదేశంలో సంపూర్ణంగా కనిపిస్తుందని ముంబయిలో నెహ్రూ ప్లానిటోరియమ్ డైరెక్టర్ అరవింద్ పరంజపే తెలిపారు. అరుదైన చంద్రగ్రహణాన్ని చూడ్డానికి నెహ్రూ ప్లానిటోరియమ్‌కు మూడు వేల మంది ప్రజలు వచ్చారని పరంజపే చెప్పారు. గ్రహణాలపట్ల మూఢనమ్మకాలను తోసిరాజని గ్రహణ వీక్షణకు వేల మంది రావడం సంతోషకరమని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో చంద్రగ్రహణం సాయంత్రం 5.18 గంటలకే ప్రారంభమైనప్పటికీ పొగమంచు కారణంగా కొన్ని చోట్ల సరిగ్గా కనిపించలేదు. అయితే సంపూర్ణ చంద్ర గ్రహణం సాయంత్రం 6.21 గంటలకు మొదలైందని ప్రతి ఒక్కరూ చూడవచ్చని ఎంపీ బిర్లా ప్లానిటోరియం డైరెక్టర్ దేబిప్రసాద్ దువారి తెలిపారు. బెంగళూరులో వేలాది మంది ప్రజలు నెహ్రూ ప్లానిటోరియంలో చంద్రగ్రహణాన్ని వీక్షించారు. చందమామను మూడు రూపాల్లో వీక్షించే అవకాశం ఉత్తర అమెరికా, తూర్పు ఆసియా వాసులకు కూడా దక్కింది.

1992, డిసెంబరు 10వ తేదీన సంభవించిన సంపూర్ణ చంద్ర గ్రహణానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన అంశాన్ని అరవింద్ పరంజపే వెల్లడించారు. అది ఎంత తీవ్రంగా ఉండంటే ఆకాశంలో చందమామ కొద్దిసేపు పూర్తిగా అదృశ్యమైపోయినట్టు అనిపించింది. అమావాస్య చీకటిని తలపించిందని తెలిపారు.

చంద్రబాబు హయాంలోనే
విద్యకు అధిక ప్రాధాన్యత

• డీఎస్సీ ద్వారా 10 వేల ఉపాధ్యాయుల నియామకం • ప్రైవేటు యూనివర్శిటీ బిల్లుతో రాష్ట్రానికి 15 పెద్ద విశ్వవిద్యాలయాలు • విశ్వవిద్యాలయాలకు రూ.175.55 కోట్ల క్యాపిటల్ గ్రాంట్ : మంత్రి గంటా శ్రీనివాసరావు • రాయలసీమ యూనివర్శిటీలో లైఫ్ సైన్స్ భవనం ప్రారంభం



కర్నూలు, ప్రభ న్యూస్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలోనే విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని ఆంధ్రప్రదేశ్‌ను విజ్ఞాన ఆంధ్రప్రదేశ్‌గా తీరుస్తున్నామని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాస్‌రావ్ పేర్కొన్నారు. బుధవారం కర్నూలులోని రాయలసీమ విశ్వ విద్యాలయంలో రూ.10కోట్లతో నిర్మించిన లైఫ్‌సైన్స్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గంటా శ్రీనివాస్‌రావ్ మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి విద్య ఎంతో కీలకం కాబట్టి బడ్జెట్‌లో 58 శాతం నిధులను ముఖ్యమంత్రి విద్యకు కేటాయించారని, గతంలో ఎవ్వరూ చేయలేనివిధంగా ముఖ్యమంత్రి విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం రూ.10కోట్లతో లైఫ్‌సైన్స్ భవనాన్ని నిర్మించామని, మౌలిక వసతులకుగానూ మరో రూ.2.45కోట్లు కేటాయించబోతున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థు లకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు రాష్ట్రంలో 14 విశ్వవిద్యాలయాలలో 1385 పోస్టులను ఎపిపి ఎస్సీ ద్వారా రెండు దశలలో భర్తీచేయనున్నట్లు తెలిపారు. కాం ట్రాక్టు లెక్చరర్ల సమస్యల ను పరిష్కరించేం దుక ం విశ్రాంత ఉపకులపతులతో కమిటీని ఏర్పాటుచేస్తా మన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్శిటీ బిల్లు వల్ల ప్రఖ్యాతిగాంచిన ఎ స్ఆర్ఎం లాంటి 15 పెద్ద విశ్వవిద్యాలయా లు ఏర్పాటు కాబోతున్నాయని, వీటితో పాటు వివిధ జాతీయ విశ్వవిద్యాలయాలు కూడా రాష్ట్రంలో ఏర్పాటుచేస్తున్నామ న్నారు. అనంతపురం కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది అడ్మిషన్లను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కేజీ నుండి పిజి, మెడిసిన్, ఇంజనీరింగ్ వంటి కోర్సులను ఒకే ప్రాంగణంలో చదివేందుకు విశాఖపట్నంలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయ బోతున్నామన్నారు. పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు తరగతి గదులు, కిచన్ షెడ్లు, లైబ్రరీ, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో కల్పిస్తున్నామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎస్సీ ద్వారా 10వేల ఉపాధ్యాయులను నియమించామని, రెండవసారి డీఎస్సీ ద్వారా నియామకానికై ఫిబ్రవరి 21న టెట్ పరీక్ష నిర్వహించబోతున్నామన్నారు. ప్రత్యేకస్పోర్ట్స్ పాలసీని తీసుకువచ్చామని దీనిద్వారా క్రీడలలో రాణించిన వారికి టెట్‌లో వెయిటేజ్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ ఎన్ఎండి ఫరూక్, ఎం ఎల్సిలు కేఈ ప్రభాకర్, కత్తి నరసింహారెడ్డి, శాసనసభ్యులు ఎస్వీ మోహన్ రెడ్డి, ఐజయ్య, మణిగాంధీ, కెడిసిసి బ్యాంకు అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, రాయలసీమ, ఉర్దూ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు డాక్టర్ నరసింహులు, ముజఫర్ అలీ, రిజిస్ట్రార్‌లు అమర్‌నాథ్, షహిదాఅక్తర్ పాల్గొన్నారు.

పాఠశాలలో రూ.4,848 కోట్లతో మౌలిక వసతులు : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్

అమరావతి: ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యాన్యుటీ ప్రతిపాదికన రూ. 4848 కోట్ల నిధులతో ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించింది. ఈ క్రమ ంలో గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలంలోని మ ందడం ఉన్నత పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టుగా నిర్ణయించారు. యాన్యుటీ ప్రతిపాదికన మౌళిక వసతులు కల్పిస్తున్న తొలి మోడల్ పాఠశాల ఇది. ఈ పాఠశాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ మంగళవారం సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. మౌలిక వసతులకు సంబంధించిన డిజన్లు ఇతర అంశాలకు సంబంధించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముందస్తుగా తయారు చేసిన మెటీరియల్ (ప్రీ కాస్ట్) భవన నిర్మాణాలు గురించి అధికారులు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎ చీఫ్ ఇంజనీర్ ఎంఆర్జీ నాయుడు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎవరి లెక్కలు వారివే...
జల వివాదాలు తేలేదెలా?

• బోర్డు ఛైర్మన్ పదవీ విరమణతో ఇబ్బందికర పరిస్థితి • బోర్డు మ్యాన్యువల్ ఆమోదానికి బ్రేక్ • ఫిబ్రవరి మొదటి వారంలో కృష్ణా బోర్డు సమావేశం • అమరావతికి బోర్డు కార్యాలయం • కొత్త ఛైర్మన్ వచ్చాకే ఫైళ్ల కదలిక

అమరావతి, ఆంధ్రప్రభ: కృష్ణా నది యాజమాన్య బోర్డు ఛైర్మన్ శ్రీ వాత్సవ పదవీవిరమణ నేప థ్యంలో ఈనెల 30న జరగాల్సిన బోర్డు సమావేశం మళ్లీ ఫిబ్రవరికి వాయిదా పడడంతో నీటి లెక్కల వినియోగంతో పాటు బోర్డుకు సంబంధించిన తుది వర్కింగ్ మ్యాన్యువల్ ఆమోదానికి కూడా బ్రేక్ పడింది.సమావేశం జరగాల్సిన తేదీల్లోనే బోర్డు ఛైర్మన్ శ్రీవాత్సవ పదవీ విరమణ చేయడం ఇబ్బందికరంగా మారిందంటున్నారు. తిరిగి బోర్డు సమాశాన్ని ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో నిర్వహించాలని నిర్ణయించారు. కాగా నీటిపారుదల వ్యవస్థలోఎంతో అనుభం ఉన్న శ్రీవాత్సవ పదవీ విరమణ చేయడంతో రెండు రాష్ట్రాలకు చెందిన నీటి వివాదాలన్నీ మళ్లీ మొదటికే వస్తాయంటున్నారు. ఆయన తర్వాత అంతటి అనుభవం,వ్యవస్థలోని లోటుపాట్లు తెలిసిన వ్యక్తి మరొకరు లేరంటున్నారు.ఈ పరిణామం రెండు రాష్ట్రాలకు కొంత ఇబ్బందికరమేనంటున్నారు. కృష్ణా నది బేసిన్‌కు సంబంధించిన అన్ని ప్రాజెక్టులపై సర్వాధికారాలు తమకే ఉండేలా బోర్డు తాజాగా తుది వర్కింగ్ మ్యాన్యువల్ సిద్దం చేసిన సంగతి తెలిసిందే.

ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణా రాష్ట్రాల పరిధిలోని కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు,వాటిల్లో పని చేస్తున్న ఉద్యోగులంతా బోర్డు ఆధీనంలోనే పనిచేసేలా బోర్డు తాజాగా మార్గదర్శకాలు రూపొందించింది. అయితే ఈనెల 30 న జరగాల్సిన సమావేశంలో ఈ విషయమై చర్చించి, ఆ మ్యాన్యువల్‌కు ఆమోదం తెలపాల్సి ఉంది. కానీ సమావేశం వాయిదా పడడంతో మ్యాన్యువల్ ఆమోదం మరింత ఆలస్యమవుతుంది. అంతేకాకుండా ఇదే సమావేశంలో బోర్డు ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలోఏర్పాటు చేసేందుకు



ఉద్దేశించిన అంశంపై కూడా చర్చించాల్సి ఉం ది. కానీ జరగడకపోవడం వల్ల ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిదందంటున్నారు. బోర్డు రూపొందించిన తాజా మ్యాన్యువల్ మార్గదర్శకాలకు సంబంధించి గతంలోనే బోర్డు కార్యదర్శి ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు ద్వారా తెలియజేయడం జరిగింది. ఇరు రాష్ట్రాలు ఆమోదం తెలిపిన తర్వాత వర్కింగ్ వ్యన్యువల్‌ను కేంద్ర జలవనరుల శాఖ ఆమోదానికి పంపుతారు. అక్కడ దానికి ఆమోదం లభిస్తే కృష్ణా బోర్డుకు సర్వాధికారాలు లభిస్తాయి. దీంతో రెండు రాష్ట్రాల దుకుడుకు కళ్లెం వేయడానికి బోర్డుకు అవకాశం దక్కుతుంది. మ్యాన్యువల్‌లోని మార్గదర్శకాల ప్రకారం బోర్డు పరిధిలోని ప్రాజెక్టుల్లో ఏ ప నులు చేయాలన్నా బోర్డు నుంచి అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది.

అయితే బేసిన్‌లోనెట్టెంపాడు, గాలేరు -నగరి, వెలిగొండ,హంద్రీనీవా, తెలుగు గంగ, కల్వకుర్తి ప్రాజెక్టులను ఇరు రాష్ట్రాలు పూర్తి చేసుకోవచ్చు. కానీ కొత్తగా ప్రాజెక్టులు చేపట్టాలంటే మాత్రం బోర్డు నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉం టుంది. ఇలా ఉంటే నీటి వాటాలకు సంబంధించి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు తేల్చే వరకు కేంద్రం ఏర్పాటు చేసిన తాత్కాలిక ఒప్పందం అమల్లో ఉంటుంది. బోర్డు, కమిటీల స్వరూపం,అపెక్స్ కౌన్సిల్ బేటీలకు సంబంధించి బోర్డు మార్గదర్శకాలు ఖరారు చేసింది . ఈ ఏడాది ముఖ్యంగా బోర్డు నిర్వహణ, అధికారాలకు సంబంధించిన వర్కింగ్ మ్యాన్యువల్‌పై ఎటూ తేలకపోవడంతో ఇబ్బందిఏర్పడింది. గత బోర్డు సమావేశంలో ఇరు రాష్ట్రాలు వర్కింగ్ మ్యాన్యువల్‌కు ఒకే చెప్పినా మళ్లీ దానిపై సమావేశం జరగక దానికి ఆమోదం లభించలేదు. అయితే ఈ బేటీకి రావడం తమకు కుదరదని తెలంగాణ ప్రభుత్వం ఇటీవల బోర్డుకు లేఖ రాసింది. ఫిబ్రవరి తొలి లేదా రెండో వారంలో భేటీ నిర్వహించాలని కోరింది.దీంతో ఈలోపు కొత్త ఛైర్మన్ కూడా వచ్చే అవకాశం ఉన్నందున ఆయా తేదీల్లో బోర్డు సమాశం నిర్వహించేందుకు సిద్దమవుతున్నారు.

ఈమేరకు కార్యాలయం తరలింపునకు చర్యలు తీసుకోవాలని బోర్డు ఛైర్మన్‌కు, కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖకు రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషన్‌కుమార్ లేఖలు రాసిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ పునర్వ్ విభజన చట్టంలోని సెక్షన్ 85 (2)ప్రకారం బోర్డును ఏపీ రాజధానిలో అమరావతిలో ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే బోర్డుకు కొత్త ఛైర్మన్ వచ్చిన తర్వాతే దీనిపై కూడా కదలిక వస్తుందటున్నారు. ఇలా ఉంటే శ్రీశైలం,సాగర్ నుంచి తమ ఆదేశాల ప్రకారం నీటి విడుదల జరగాలని బోర్డు ఏపీ,తెలంగాణాలకు సూచించింది. ఇందుకు భిన్నంగా ఎవరైనా నీటిని వినియోగిస్తే తర్వాత జారీ చేసే ఆదేశాల్లో ఆ నీటిని పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే నీటి వినియోగానికి సంబంధించి ఎవరి లెక్కలు వారికి ఉన్నాయి. ఇప్పటివరకు మొత్తం 354.51 టీఎంసీల వినియోగం ఉండగా, అందులో ఆంధ్రప్రదేశ్ 252.79 టీఎంసీలు, తెలంగాణ 101.72 టీఎంసీలు వినియోగించుకున్నట్లు బోర్డు పేర్కొంది. అయితే ఈ లెక్కలను రెండు రాష్ట్రాలు అంగీకరించలేదు. త్వరలో జరిగే సమావేశంలో ఈ విషయమై కూడా చర్చించనున్నారు.

శ్రీశైల క్షేత్రంలో బయటపడ్డ సొరంగం

• వెలుగుచూసిన పురాతన వస్తువులు • స్వాధీనం చేసుకున్న దేవాదాయ శాఖ అధికారులు



ఆత్మకూరు టౌన్, ప్రభ న్యూస్: శ్రీ పార్వతి పరమేశ్వరుల కొలువుదీరిన శ్రీశైల మహాక్షేత్రంలో నెమ్మ నెమ్మదిగా పురాతన వస్తువులు బయటపడుతున్నాయి. క్షేత్ర ఆలయ ప్రాంగణంలో ప్రాచీణ కట్టడాల పరిరక్షణలో భాగంగా పంచమఠాల పునఃరుద్ధరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం పంచమఠాలలో ఒకటైన రుద్రాక్ష మఠంలో సొరంగం బయటపడింది. సుమారు 15 అడుగుల పొడవు కలిగిన లోతైన సొరంగ మార్గంలో రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో త్రవ్వకాలు జరపగా ప్రాచీణ కాలానికి చెందిన సామగ్రి బయటపడింది. ఈసొరంగంలో ధ్యానం చేసే వారు పూజలకు సంబంధించిన వస్తువులు, వంటకు సంబంధించిన వస్తువులు దాచి ఉండవచ్చునని ఆలయ అధికారులు చెబుతున్నారు. ఏడవ శతాబ్దం కాలం నాటి ఈ మఠాలు అప ్పట్లో తపస్వీకులకు , యోగులకు ధ్యాన కేంద్రాలుగా విరజిల్లాయి. గత సంవత్సరం ఘంటా మఠంలో త్రవ్వకాలు జరపగా ప్రాచీణ కాలం నాటి వెండి, బంగారు వస్తువులు బయటపడిన సంగతి తెలిసిందే. జీర్ణోద్ధరణలో భాగంగా దేవాదాయ శాఖ అనుమతితో జరుపుతున్న పునః నిర్మాణ పనులలో భాగంగా ప్రాచీన వస్తువులు బయటపడు తున్నాయి. బయటపడిన వస్తువులలో రాగి, ఇత్తడి, ఇనుము, సామా న్లు బయట పడ్డాయి. ఇందులో రెండు బేసిన్లు, ఒక పెద్ద బాండి, 26 చెంబులు, ఒక బొగ్గుల పొయ్యి, ఒక గిన్నె, రెండు పెద్ద గంటలు, మూడు చిన్న గంటలు, మూడు గజ్జెల మువ్వలు, ఆరు చిన్న గజ్జెలు, ఐదు గుండ్రి గిన్నెలు, విరిగిన ప్లేట్లు, ఒక పెద్ద ప్లేటు, రెండు కడియాలు, ఒక దీపపు కుందులు, ఒక తాబేలు ఆకారం, ఆరు హారతి దీపాలు, 19 విరిగిన చిన్న సామాన్లు ఉన్నాయి. వీటిని తహశీల్దార్ శ్రీనివాసులు, వలయ అధికారి నీలకంఠయ్య, ఎస్‌హెచ్ఓ వరప్రసాద్, పలు విభాగాల దేవస్థాన అధికారుల సమక్షంలో దేవస్థాన పరిపాలనా భవనము వద్దకు చేర్చారు.

విశాఖలో నేటి నుంచి గుండె ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స జాతీయ సదస్సు

• ఒకే వేదికపై 1500 మంది వైద్యులు • ఐఎసీటీఎస్, సీఓఎన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ రాజన్ సేతురత్నం వెల్లడి

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: విశాఖ మరో జాతీయ సదస్సుకు వేదిక కానుంది. దేశ విదేశాలకుచెందిన రెండువేల మంది వైద్య నిపుణులు ఈ సదస్సులో భాగస్వాములు కానున్నారని జాతీయ గుండె, ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స నిపుణుల అసోసియేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ రాజన్‌సేతురత్నం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 64వ జాతీయ గుండె, ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స వార్షిక సదస్సును విశాఖలో నిర్వహిస్తున్నామన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు నాలుగు రోజుల పాటు ఈ సదస్సు జరగనుందని ఆర్గనైజింగ్ కమిటి ఛైర్మన్ డాక్టర్ పి.వి. సత్యనారాయణ తెలిపారు. ఈ సదస్సు ప్రారంభానికి వైద్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాస్‌తో పాటు జిల్లా మంత్రులు అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు కూడా హాజరు కానున్నట్లు వివరించారు. రెండోరోజు ముఖ్య అతిధిగా సద్గురు జగ్గివాసుదేవ్ హాజరై యోగా, ఆరోగ్యవంతమైన జీవితంపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆయా దేశాలకు చెందిన వైద్యులు వారి ఆలోచనలను, అక్కడ వైద్య విదానాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒకరికొకరు అందిపుచ్చుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఇంగ్లాడ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి 41 మంది వక్తలు హాజరై ప్రసంగిస్తారన్నారు. నొవోటెల్ హోటల్‌లో జరగబోయే ఈసదస్సును అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంగ్లాడ్ నుంచి సదస్సు కోసం విచ్చేసిన డాక్టర్ రాబర్డ్ ఎంగ్రోషన్ మాట్లాడుతూ 1974 నుంచి తాను వైద్య వృత్తిలో ఉన్నానని, గతంలో పోల్చుకుంటే ఇప్పుడు శస్త్ర చికిత్సలకు చేసే వైద్యం సాంకేతిక పరిజ్ఞానం కారణంగా మరింత అందుబాటులోకి వచ్చిందన్నారు. భారతదేశంలో కూడా ఆత్యాధునిక వైద్య సేవలు, వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఆంధ్రా, తెలంగాణల్లో కొత్త రైలు మార్గాలు

రూ.5 వేల కోట్ల ప్రతిపాదనలు అందజేసిన దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దక్షిణ మధ్య రైల్వే 2018 - 19 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 5 వేల కోట్లకు పైగా ప్రతిపాదనలను కేంద్రానికి అందచేసింది. 2017-18లో రూ. 3,034 కోట్ల పనులకు ఆమోదం పొందింది. అంతుకు ముందు సంవత్సరం రూ. 2,134 కోట్లతో వివిధ పనులు చేపట్టడానికి కేంద్రం అంగీకరించింది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ జోన్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక పార్లమెంటు సభ్యులతో సమావేశమై నియోజక వర్గాల వారిగా ప్రతిపాదనలు స్వీకరించారు. వాటినన్నింటిని క్రోడీకరించి వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రాధాన్యత లతో ప్రదిపాదనలు కేంద్రానికి నివేదించారు. కొత్త రైల్వే లైన్లు, ట్రాక్‌లు, ఇప్పటికే తిరుగుతున్న కొన్ని రైళ్ల పొడిగింపు, అదనపు స్టేజీలు, అదనపు స్లీపర్ కోచ్‌లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ అండర్ బ్రిడ్జీలు, విద్యుదీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రానికి నివేదించారు. కాజీపేటలో వర్క్‌షాప్, 2018లో ఎంఎంటీఎస్ రెండవ దశ పూర్తి, మెదక్ - అక్కంపేట, మనోహరాబాద్ - కొత్తపల్లి పనులను వేగంగా పూర్తి చేయడానికి అదనపు నిధులతో పాటుగా పార్లమెంటు సభ్యులు నియోజక వర్గాల వారిగా ప్రతిపాదించిన కొత్త రైలు మార్గాల ప్రాధాన్యతలను కేంద్రానికి అందచేశారు. ఆర్మూర్ - ఆదిలాబాద్ పనులు జరుగుతున్నాయి. ఎంఎంటిఎస్‌ను యాదగిరిగుట్ట వరకు పొడిగిస్తున్నారు. భద్రాచలం - సత్తుపల్లి - కొవ్వూరు రైలు మార్గం సత్వరం అందుబాటులోకి వచ్చే విధంగా నిధులను ప్రతిపాదించారు. కరీంనగర్, నిజామాబాద్ పాత జిల్లాల పరిధిలో కూడా కొత్త ప్రతిపాదనలను కేంద్రానికి నివేదించిన రైల్వే అధికారులు బీదర్ - గుల్బర్గా, దేవరకొండ - జక్లూర్ కొత్త లైన్ల ప్రతిపాదన కూడా అందచేశారు. నర్సాపూర్-మచిలీపట్టణం, మచిలీపట్టణం - ఒంగోలు కొత్త లైన్లు ప్రతిపాదించారు. అనేక మార్గాలను విద్యుదీకరణ కోసం అదనపు నిధులు కోరారు. చర్లపల్లి, లింగంపల్లి, నాగలపల్లి టర్మినల్స్‌ను సత్వరం అందుబాటులోకి తేవడానికి నిధులు కోరారు. దాదాపు వందకుపైగా రోడ్ ఓవర్ బ్రిడ్జీలు, రోడ్ అండర్ బ్రిడ్జీల నిర్మాణాలకు నిధులు కోరారు. రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు నిధులు కోరడం జరిగింది. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్ర మీదుగా తిరుగుతున్న రైళ్లను కొత్త ప్రాంతాలకు విస్తరించడం, కొత్త రైలు మార్గాల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడం, ప్రయాణికుల మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడం పైన దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. హైదరాబాద్ - అమరావతి మీదుగా దూర ప్రాంతాలకు కొన్ని కొత్త రైళ్లు ప్రకటించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఇంధన పొదుపులో అగ్రగామిగా విజయవాడ, రాజమండ్రి రైల్వే స్టేషన్లు

అమరావతి, ఆంధ్రప్రభ : దక్షిణ మధ్యరైల్వే పరిధిలోని విజయవాడ, రాజమండ్రి రైల్వే స్టేషన్లు ఇంధన పొదుపులో వంద శాతం శక్తి సామర్థ్యాలు గల స్టేషన్లుగా అభివృద్ధిని సాధించాయి.విద్యుత్ పొదుపులో ఈ రెండు రైల్వే స్టేషన్లు రైల్వే డివిజన్ వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచాయని దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.

కొలువుదీరిన కన్నెపెల్లి జాబిలమ్మ

• అంగరంగ వైభవంగా మహాజాతర ప్రధాన ఘట్టం • గద్దెలకు తరలివచ్చిన వనదేవత సారలమ్మ • తల్లిని దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తజనం • పూనుగొండ్ల నుండి తరలివచ్చిన పగిడిద్ద రాజు • కొండాయి నుంచి గద్దెలకు చేరిన గోవిందరాజు



భూపాలపల్లి ప్రతినిధి, ప్రభన్యూస్ : మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతర ప్రధాన ఘట్టం బుధవారం రాత్రి ఆవిష్కృతమైంది. కన్నెపల్లి నుంచి జాబిలమ్మ సారలమ్మ మేడారానికి కదిలివచ్చారు. ప్రధాన ఘట్టం ప్రారంభానికి ముందు సుమారుగా 40 లక్షలకు పైచిలుకు భక్తులు తరలివచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి అన్ని దారులు వనం గుండా మేడారం వైపే చేరుకున్నాయి. తల్లులను దర్శించుకోవడానికి ఆసక్తితో భక్తులు రెండు రోజుల ముందు నుంచే ఎదురుచూస్తున్నారు. బుధవారం సారలమ్మ గద్దెలకు చేరడంతో రోజూలాగానే భక్తులు తల్లులకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. పూనుగొండ్ల నుంచి బయలుదేరిన పగిడిద్ద రాజు రాత్రి గద్దెలకు చేరుకున్నారు. కొండాయి నుంచి బయలుదేరిన గోవిందరాజు గద్దెలకు చేరుకున్నారు. సారలమ్మ తల్లి గద్దెలకు చేరుకోని పగిడిదద్దరాజు, గోవిందరాజులతో కలిసి సమ్మక్కతల్లి అనుమతితో గద్దెల పై కొలువుదీరారు.

సారలమ్మ గద్దెలకు చేరింది ఇలా..

కన్నెపల్లిలో బుధవారం ఒంటి గంట సమయంలో సారక్క ఆలయంలో పూజారులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు మేడారంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏపీఓ చక్రధర్ రావు అధికారుల లాంఛనాలతో కన్నెపెల్లిలోని సారలమ్మ ఆలయం వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం పూజారులు ఆరుగురు కాక సారయ్య, కిరణ్, కనుకమ్మ, భుజంగరావు, వెంకటేశ్వర్లు, లక్ష్మీభాయమ్మ వీరు దీప ,దూప నైవేద్యాలతో సారలమ్మను పూజించారు. అప్పటికే మేడారం చేరుకుని ఎంతో ఆతృతగా ఎదిరిచూస్తున్న భక్తులు తల్లి తరలిరావడాన్ని స్వాగతిస్తూ తన్మయత్వంతో పులకించి పోయారు. ప్రధాన ఘట్టం ఆరంభం కావడంతో జాతరంతా ఒక్కసారిగా దారివెంట జనప్రవాహంలా మారింది. సారలమ్మ తీసుకువచ్చే పూజారి కాకసారయ్యను తాకేందుకు భక్తులు పెద్దఎత్తున ప్రయత్నాలు చేశారు. తొక్కిసలాటకు జరుగుతున్న ప్రతిసారి పోలీసులు అప్పమత్తమై వలయంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సారలమ్మ జంపన్న వాగు దాటే క్రమంలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తూ పులకించి పోయా రు. శివసత్తులు పూనకాలతో జంపన్న వాగు మార్మోగింది. మేడారంలో గద్దె ల ప్రాంగణంలో సారలమ్మ గద్దె పై అమ్మవారిని, గోవింద రాజు, పగిడిద్ద రాజులను రాత్రి 9 గంటల సమయంలో ప్రతిష్ఠించారు. వన దేవతను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.

నేడు గద్దెలకు చేరనున్న సమ్మక్క

మేడారంలో గురువారం సమ్మక్కతల్లి చిలుకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెలకు చేరనుంది. స్పెషల్ అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఇంచార్జి కలెక్టర్ కర్ణన్, ఎస్పీ భాస్కరన్ గిరిజన సంప్రదాయాల ప్రకారం, ప్రభుత్వ లాంచనాలతో, పూజారులతో కలిసి సమ్మక్క తల్లిని లక్షలాది మంది భక్తులు వెంట రాగా చిలుకల గుట్ట నుంచి మేడారంలో గద్దెల ప్రాంగణానికి తీసుకురానున్నారు. పూజారులు పూజలు ఆచరించి గద్దెలపై చేరుస్తారు. ఉదయం చిలుకటగుట్ట నుంచి తీసుకువచ్చిన కంకవనాన్ని గద్దెల పై ప్రతిష్ట చేస్తారు.

క్రీడాప్రభ

సిరీస్ గెలిస్తే... వన్డేల్లో మనమే నెం.1

ఇక వన్డే వార్!

సోనీ టెన్- 1
సోనీ టెన్ - 3
సా॥ 4:30 నుంచి
ప్రత్యక్ష ప్రసారం





ఇంతవరకు దక్షిణాఫ్రికాలో ఆదేశంతో ఆడిన వన్డే సిరీస్‌లో భారత్ ఒక్కసారికూడా సిరీస్‌ను గెలుచుకోలేదు. మరోవైపు భారత్ 2016 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు దేశంలో కాని బయటకాని ఒక్క వన్డే సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ప్రస్తుత పర్యటనలో సఫారీలతో జరిగిన చివరి టెస్ట్‌తో పుంజుకున్న కోహ్లి సేన సఫారీల గడ్డపై తొలిసారిగా వన్డే సిరీస్ గెలిచి తన ప్రస్తుత రికార్డును నిలుపుకుంటూ.. వన్డే ప్రపంచ ర్యాంకింగ్‌లో భారత్‌ను అగ్ర స్థానంలో నిలబెడుతుందని ఆశిద్దాం

డర్బన్: వన్డేల్లో ప్రపంచ ర్యాంకింగ్‌లో రెండో స్థానంలో ఉన్న భారత్, దక్షిణాఫ్రికాతో నేడు ప్రారంభం కానున్న ఆరు వన్డేల సిరీస్‌ను గెలిస్తే భారత్‌కు అగ్రస్థానం దక్కుతుంది. దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టు స్థానిక కింగ్స్‌మీడ్ మైదానంలో నేడు ఆతిథ్య జట్టుతో తొలి వన్డే ఆడనుంది. భారత్ మూడు టెస్టుల సిరీస్‌ను 1-2తేడాతో సఫారీలకు కోల్పోయింది. సఫారీలతో వరుసగా రెండు టెస్టుల్లో చెతులెత్తేసిన భారత్ చివరి టెస్టులో ఓదార్పు విజయాన్ని పొంది వన్డేలకు ఆత్మ విశ్వాస్వాన్ని సాధించింది. ముఖ్యంగా బౌలర్లు మంచి ఉత్సాహంమీద ఉన్నారు. దక్షిణాఫ్రికా పిచ్‌లు బౌలర్లకు అనుకూలిస్తున్న నేపథ్యంలో మన పేస్ బౌలర్ల త్రయం భువనేశ్వర్ కుమార్, బుమ్రా, మహ్మద్ షమి తీవ్ర కసరత్తుతో తమ దూకుడును ప్రదర్శించనున్నారు. మరో 14 నెలల్లో వన్డే ప్రపంచకప్-2019 ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ సిరీస్‌నుంచే భారత్ సమాయత్తం కావడానికి నిర్ణయించుకుంది.

దక్షిణాఫ్రికాలో భారత్‌కు వైఫల్యాలే ఎక్కువ

కాగా, ఇప్పటివరకు దక్షిణాఫ్రికాలో భారత్ ఆడిన వన్డే సిరీస్‌ల్లో ఏ ఒక్క సిరీస్‌ను గెలుచుకోలేదు. 1992-93లో జరిగిన ఓడీఐ సిరీస్‌ను సఫారీలు 5-2 తేడాతో గెలుచుకోగా, 2006-07 ఆడిన సిరీస్‌ను దక్షిణాఫ్రికా 4-0 తేడాతో చేజిక్కించుకుంది. 2010-11 జరిగిన సిరీస్‌ను కూడా ఆతిథ్య జట్టే 3-2 తేడాతో గెలుచుకుంది. 2013-14లో జరిగిన సిరీస్‌ను కూడా 2-0తేడాతో సఫారీలు గెలుచుకున్నారు. ఈ ఏడాది జరుగుతున్న ఈ తాజా సిరీస్‌లో కోహ్లి నేతృత్వంలోని భారత జట్టు సిరీస్‌ను గెలుచుకుంటారని అభిమానులు ఆశిస్తున్నారు. కాగా 1996-97 దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్, జింబాబ్వే కలిసి ముక్కోణపు సిరీస్‌ను ఆడింది. 2001-02 కూడా దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్, కెన్యాతో కలిసి ముక్కోణపు సిరీస్‌లో పాల్గొంది. ఈ రెండు సందర్భాల్లో కూడా సఫారీలే విజయాన్ని నమోదు చేశారు. 1992-93 నుంచి చూస్తే దక్షిణాఫ్రికాలో ఆదేశంతో భారత్ ఆడిన వన్డేల్లో 21 మ్యాచ్‌లు దక్షిణాఫ్రికా గెలుపొందగా, భారత్ కేవలం ఐదు మ్యాచ్‌లను సొంతం చేసుకోగలిగింది. సఫారీ గడ్డపై ఇంత బలహీనమైన రికార్డును కలిగిన భారత్‌కు అన్ని విధాలా ఆలోచించి ఆదేశ గడ్డపై విజయం సాధించే జట్టునే ఎంపిక చేశామని జాతీయ సెలక్టర్లు అంటున్నారు. ఇక తొలి వన్డే వేదికగా ఉన్న డర్బన్ కింగ్స్‌మీడ్ మైదానంలో భారత్ రికార్డు అంత బాగాలేదు. ఇప్పటివరకు సఫారీలతో ఇక్కడ ఆడిన ఏడు వన్డేల్లో ఆరు మ్యాచుల్లో ఓటమిని చవిచూడగా, ఒక మ్యాచ్‌లో ఫలితం



తేలలేదు. 2003 వన్డే ప్రపంచ కప్ మ్యాచ్‌లో భాగంగా భారత్ ఇక్కడ కెన్యా, ఇంగ్లండ్‌లను ఓడించింది. ఇది కొంచెం భారత్‌కు ఊరట నిచ్చే విషయమే. మొత్తంగా చూస్తే కింగ్స్‌మీడ్ మైదానంలో భారత్ ఆడిన 9 మ్యాచ్‌ల్లో 7 ప్రత్యర్థులకు కోల్పోయి రెండింటిలో విజయం సాధించింది.

పిచ్ గోధుమ వర్ణంలో ఉంది

డర్బన్‌లో మంగళవారం రాత్రి వర్షం కురియటంతో కింగ్స్‌మీడ్ మైదానంలోని పిచ్ గోధుమ వర్ణంలో కనిపించిందని స్థానిక మైదాన పరిశీలకులు పేర్కొన్నారు. గురువారం కూడా చిరుజల్లులు పడే అవకాశముందని స్థానిక వాతావరణ విశ్లేషకులు తెలిపారు. సఫారీల మిడిల్ ఆర్డర్‌ను నియంత్రించడంలో కీలక పాత్ర పోషించేందకు భారత్ ఒక స్పిన్నర్‌పై ఆధారపడుతుందని అంచనా. ఒకవేళ చైనామ్యాన్ కులదీప్ యాదవ్ తోపాటు అక్సర్ పటేల్, యజువేంద్ర చాహల్‌కు జట్టులో చోటిస్తే సఫారీల మిడిలార్డర్ బ్యాట్స్‌మన్లు డేవిడ్ మిల్లర్, జెపి. డుమ్నిలకు చుక్కలు చూపించటం సాధ్యమేనని పరిశీలకులంటున్నారు. ఒకవేళ ఒక స్పిన్నర్‌తో ఆడితే పార్ట్‌టైం స్పిన్నర్‌గా కేదార్ జాదవ్‌ను ఉపయోగించుకునే అవకాశముంది.

గాయంతో మూడు వన్డేలకు డి విల్లియర్స్ దూరం

దక్షిణాఫ్రికా కూడా రానున్న ప్రపంచకప్‌పై కన్నేసి తమ జట్టుపై ప్రయోగాలను చేపడుతుంది. చేతి వేలికి గాయం కావడంతో మూడు వన్డేలకు దూరమైన డి విల్లియర్స్ భారత్‌తో ఆడనున్న మూడు వన్డేలకు దూరమయ్యాడు. ఈ పరిస్థితిలో అతని స్థానంలో ఫర్హాన్ బెహ్రాదీన్‌ను ఆడిస్తారు. కాని అలా జరగటంలేదు. డర్బన్‌కు చెందిన ఆటగాడు ఖయేలి ష్లా జోండో చివరి 11 మందిలో ఉంటాడని అంచనా. ఆ జట్టు కెప్టెన్‌కు మరో అవకాశం కూడా లేకపోలేదు. హాశీం అవ్లా, క్వింటన్ డి కాక్, ఏడెన్ మర్క్రంలు కూడా అవకాశముంది. సఫారీల్లో ఒక్క స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్‌తో బరిలోకి దిగుతారని అంచనా.

జట్లు:

భారత్: విరాట్ కోహ్లి(కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, ఆజింక్యా రహానే, శ్రేయాస్ ఐయ్యర్, మనీష్ పాండే, దినేష్ కార్తిక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ(వికెట్ కీపర్) హార్దిక్ పాండ్యా, యజువేంద్ర చాహల్, కులదీప్ యాదవ్, అక్సర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమి, శార్దుల్ థాకూర్

దక్షిణాఫ్రికా: ఫఫ్ డుప్లెస్సిస్(కెప్టెన్), హాషీం ఆవ్లా, క్వింటాన్ డి కాక్(వికెట్ కీపర్), జెపి డుమిని, ఇమ్రాన్ తాహిర్, ఏడెన్ మర్క్రం, డేవిడ్ మిల్లర్, మోర్ని మోర్కెల్, క్రిస్ మోరిస్, లుంగిసాని ఎన్గిడి, ఆండిలె పెహ్లుక్‌వాయో, కగిస్కో రబాడా, టాబ్రా యుజ్ శాంసి, ఖాయేలిహ్లే జొండో.

స్వల్ప దూరంలో వన్డేల్లో టాప్ స్థానం

ప్రపంచ టీముల్లో ప్రస్తుతం భారత్ 119 పాయింట్లతో వన్డే ర్యాంకింగ్‌లో రెండో స్థానంలో ఉంది. దక్షిణాఫ్రికా 120 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. ఓడీఐ ర్యాంకింగ్‌లు ప్రతీ మ్యాచ్ అనంతరం మారుతూ ఉంటాయి. ప్రస్తుత సిరీస్‌ను 4-2 తేడాతో విజయం సాధించినా.. భారత్ ప్రపంచ నం.1 ర్యాంకును సొంతంచేసుకుంటుంది. ఈ ర్యాంకును సొంతం చేసుకోవాలనే లక్ష్యం.. భారత్ జట్టుకు ప్రేరణగా పనిచేస్తుందని క్రీడా విశ్లేషకుల అంచనా. 2016 జనవరిలో ఆస్ట్రేలియాతో 4-1 తేడాతో వన్డే సిరీస్ కోల్పోయిన అనం తరం ఇప్పటివరకు అటు దేశంలో కాని బయటకాని ఒక్క సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ఈ రికార్డును భారత్ రక్షించుకుంటుందని ఆశిద్దాం. 2017లో ఇంగ్లండ్‌లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో ఒక్కసారి మాత్రమే ఫైనల్‌లో పాకిస్తాన్ చేతిలో భారత్ ఓటమి పాలైంది. వన్డేలకు ప్రస్తు భారతజట్టు సమతూకంలో ఉందని సెలెక్టర్లు అంటున్నారు.

ఈ ఏడాది జట్టుకు బిజీ షెడ్యూల్

ఈ ఏడాదిలో భారత్ దీర్ఘమైన పరిమిత ఓవర్ల క్రికెట్ షెడ్యూల్‌ను కలిగివుంది. కాగా భారత్, సఫారీలతో ఈ వన్డే సిరీస్‌తోపాటు మూడు టీ-20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. అనంతరం, శ్రీలంకలో ఆతిథ్య జట్టుతో టీ-20 సిరీస్, ఇంగ్లండ్, ఐర్లండ్‌లో మూడు ఓడీఐలు, మూడు టీ20ఐలు ఆడనుంది. ఆగస్టులో ఇంగ్లండ్‌లో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆడనుంది. ఇక ఐపీఎల్-2018 త్వరలో ప్రారంభంకానుంది. మొత్తానికి భారత్ క్రికెట్ జట్టుకు ఈ ఏడాది బిజీ షెడ్యూల్ ఎదురవుతోంది. ఇంగ్లండ్ ఆతిథ్య మివ్వనున్న 2019 ప్రపంచకప్ టోర్నీకి అక్కడి పరిస్థితులను పిచ్‌లను ధీటుగా ఎదుర్కొనే బ్యాట్స్‌మన్లు, అక్కడి పిచ్‌లను తెలివిగా ఉపయోగించుకునే బౌలర్లను ఎంపికచేసేందుకు జాతీయ సెలెక్టర్లు ఈ ఏడాది భారత్ ఆడుతున్న మ్యాచ్‌ల్లో ప్రయోగాలు చేయనుందని క్రీడా విశ్లేషకుల అంచనా.

ఇండియా ఓపెన్ సిరీస్

రెండో రౌండ్లోకి సైనా, సింధు

న్యూఢిల్లీ: ఇక్కడ జరుగుతున్న ఇండియా ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో హెచ్.ఎస్. ప్రణయ్ ప్రారంభ రౌండ్‌లోనే తన ప్రత్యర్థి శ్రేయాంష్ జైస్వాల్‌కు కోల్పోయాడు. తన పాదాల్లో కాయలు ఏర్పడ్డాయని ఆడటం సాధ్యం కాకున్నప్పటికీ బీడబ్ల్యుఎఫ్ నిబంధనలమేరకు బరిలోకి దిగిన ప్రణయ్ 4-21,6-21 వరుస సెట్లలో ఓటమి చెందాడు. 3,50,000 డాలర్ల ప్రైజ్‌మనీ ఉన్న ఈ టోర్నీలో సైనా నెహ్వాల్, పివి సింధులు రెండో రౌండ్లోకి ప్రవేశించారు. సైనా తన రౌండ్లో డెన్మార్క్‌కు చెందిన సోఫీ హోలంబే దాహ్లను 21-15, 21-9 తేడాతో ఓడించింది. కాగా డిఫెండింగ్ ఛాంపియన్ సింధు తన ప్రత్యర్థి డానిష్ క్రీడాకారిణి నటాలియా కోచ్ రోహ్డెపై 21-10, 21-13 తేడాతో విజయం సాధించింది. రెండో రౌండ్లో సైనా డెన్మార్క్‌కు చెందిన లినే హోజ్‌మార్క్ కెజారిఫెల్ట్‌తో తలపడనుండగా, సింధు భారత్‌కు చెందిన వైదేహి చౌదరీ లేదా బల్గేరియాకు చెందిన లిండా జెట్‌చిరితో తలపడుతుంది. బీడబ్ల్యుఎఫ్ షెడ్యూల్ ప్రకారం టాప్ సింగిల్స్ క్రీడాకారిణులు తప్పనిసరిగా సూపర్ 1000, సూపర్ 750, సూపర్ 500 ఈవెంట్లలో 12 టోర్నీలను ఆడాల్సి ఉంటుంది. కాగా ప్రణయ్‌కు ఎటువంటి అవకాశం లేకుండాపోయింది. అతను ఇప్పటికే మలేసియా, ఇండోనేసియాలో జరిగిన తొలి రెండు సూపర్ 500 టోర్నీలను మిస్ అయ్యాడు. తన పాదాల్లో రెండు మూడు చోట్ల కాయలు ఏర్పడ్డాయని వాటికి చికిత్స తీసుకుంటున్నప్పటికీ ఫలితం రాలేదని మరో డాక్టరువద్దకు వెళుతున్నా నని ప్రణయ్ అన్నాడు. బీడబ్ల్యుఎఫ్ నిబంధనల ప్రకారం 12 టోర్నమెంట్లలో తప్పనిసరిగా ఆడాలన్న నిబంధన మేరకు తాను ఇండియన్ ఓపెన్‌లో పాల్గొంటున్నా నని మరో ఇండియన్ షట్లర్ శ్రీకాంత్ అన్నాడు.



ఇండియన్ ఓపెన్ బాక్సింగ్ ఫైనల్లో

ఎంసీ మేరీకోమ్



న్యూఢిల్లీ: ఇండియన్ ఓపెన్ బాక్సింగ్ టోర్నీలో ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ ఎంసి మేరీకోమ్, ఫైనల్‌కు చేరుకోగా శివ థాపా, మనోజ్‌కుమార్‌లు కాంస్య పథకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 12 సీడెడ్ బాక్సరైనా మేరీ కోమ్(48కెజీ) మంగోలియన్ అల్టాన్‌సెట్స్‌లెగ్ లుత్సాయ్‌ఖాన్‌పై విజయం సాధించింది. తొలి రెండు రౌండ్లలోనే మేరీ కోమ్ తన ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. చివరి మూడు నిమిషాల్లో ప్రత్యర్థినుంచి గట్టి సవాలు ఎదురువ్వడంతో కోమ్ పని అయిపోయిందనుకున్నారంతా. కాని చివరి క్షణంలో పుంజుకొని మేరీ కోమ్ ప్రత్యర్థి ముఖంపై తనదైన శైలిలో పంచ్‌లు విసిరి విజయం సాధించింది. ఫైనల్లో మేరీ కోమ్ ఫిలిప్పీన్స్‌కు చెందిన జోసీ గబుకోతో తలపడనుంది. గబుకో సెమీస్‌లో స్థానిక బాక్సర్ మోనికపై గెలుపొందింది. అయితే పురుషుల విభాగంలో ప్రపంచ ఆసియన్ పతాక విజేత శివ థాపా(60కేజీ) తన కేటగిరిలో అగ్ర స్థానంలో ఉన్నప్పటికీ అంపైర్ల ఏకగ్రీవ నిర్ణయంతో రెండవ స్థానాన్ని మనీష్ కౌశిక్‌కు ఇచ్చేయాల్సి వచ్చింది. కాగా ఆసియన్ కాంస్య పతక విజేత లైట్ వెయిల్(49కేజీ) టాపర్ సయీద్ అమిత్ పన్గల్ ఫైనల్‌కు చేరాడు. మరో బాక్సర్ ఎల్ సరితా దేవీ(60కేజీ) ప్రియాంక(భారత్)పై గెలుపొందింది. తర్వాత సమ్మిట్ పోరులో సరిత ఫిన్లాండ్‌కు చెంది, ఒలింపిక్, ప్రపంచ బాక్సింగ్ కాంస్య పతక విజేత మీరా పొట్‌కొనెన్‌తో తలపడనుంది. 57 కేజీల విభాగంలో సోనియా శశి చోప్రాపై విజయం సాధించింది. సోనియా ఫిలిప్పీన్స్‌కు చెందిన నెస్తీ పెటీకోతో ఫైనల్లో తలపడనుంది. 51 కేజీల విభాగంలో సర్జుబాలాదేవీ, మంగోలియన్ జార్‌గలాన్ చేతిలో ఓటమి పాలయ్యింది.

ప్రధాని మోడీ చేతుల మీదుగా

ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ ప్రారంభం



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్(కేఎస్ఐజీ) గురువారం ప్రారంభించారు. ఈ క్రీడలు ఫిబ్రవరి 8 వరకు జరుగుతాయి. ఈ క్రీడలు దేశ క్రీడా నైపుణ్యాలు, శక్తిని ప్రపంచానికి చాటుతాయని అన్నారు. అత్యంత రమణీయంగా అలంకరించిన ఇందిరాగాంధీ స్టేడియంలో కేఎస్ఐజీ క్రీడలను ప్రారంభిస్తున్నట్లు మోడీ ప్రకటించారు. ఈ క్రీడలు గురు-శిష్య సంబంధాలకు ప్రతీకగా నిలుస్తాయని ప్రధాని అన్నారు. యువత జీవితాల్లో క్రీడలు ప్రధాన భాగమని.. వ్యక్తిత్వ వికాసానికేగాక, వారి శరీర దారుఢ్యాన్ని పెంచేందుకు ఉపకరిస్తాయన్నారు. దేశంలో క్రీడలను సామాన్య ప్రజల్లోకి విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఆ విధంగా క్రీడలను దేశవ్యాప్తంగా ప్రాధాన్యతను పెంచాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని క్రీడా విభాగాలనుంచి ఏటా వెయ్యి మంది పిల్లలను ఎంపిక చేసి వారికి ఎనిమిదేళ్లపాటు తలా రూ.5లక్షలు ఇస్తామన్నారు. కేఎస్ఐజీ క్రీడలు 16 క్రీడా విభాగాల్లో జరుగుతాయి. 29 రాష్ట్రా లకు చెందిన 17 ఏళ్లలోపు వారు ఇందులో పాల్గొంటారు.

తొలి స్వర్ణం ఉత్తర ఖండ్‌కు

ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ తొలి రోజు పోటీల్లో ఉత్తరాఖండ్ తొలి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. మొత్తం ఆరు స్వర్ణ పతకాలకు గాను తమిళనాడు రెండు స్వర్ణాలను గెలుచుకోగా ఉత్తరాఖండ్, కేరళ, ఉత్తర ప్రదేశ్, హర్యానాతలో స్వర్ణ పతకంను గెలుచుకున్నాయి. ఉత్తరాఖండ్ రాయ్‌పూర్ స్పోర్ట్స్ కాలేజ్‌లో శిక్షణ పొందుతున్న అనుకూమార్ 1500 మీటర్ల పరుగులో 4.04.77 నిమిషాల్లో పూర్తిచేసి స్వర్ణంను గెలుచుకోగా రజతంను తమిళనాడుకు చెందిన బి మాథేష్, కాంస్యాన్ని యూపీకి చెందిన సందీప్‌కుమార్ గెలుచుకున్నారు. బాలికల్లో 1500 మీటర్ల పరుగుపందెంలో గుజరాత్ క్రాస్‌కు చెందిన విద్యార్థిని కథారియా శ్రద్ధా ఫినిషింగ్ లైన్‌ను చేరినప్పటికి ప్రత్యర్థులు నిర్ణయాన్ని సవాల్ చేశారు. తమను నెట్టుకొని గీతను తాకినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం జడ్జీలు ఆమెను డిస్‌క్వాలిఫై చేశారు. తర్వాత స్థానంలో వచ్చిన కేరళకు చెందిన సి చాన్‌తినికి స్వర్ణం అప్పజెప్పారు. యూపీకి చెందిన అభిషేక్ సింగ్ షాట్‌పుట్‌లో 18.73 స్కోరు సాధించి స్వర్ణంను గెలుచుకోగా మధ్యప్రదేశ్‌కు చెందిన కార్తికేయ దేస్వాల్ రజతంను గెలుచుకున్నాడు. బాలుర ట్రిపుల్ జంప్‌లో తమిళనాడుకు చెందిన సి. ప్రవీణ్ బంగారు పతకంను గెలుచుకోగా యూపీకి చెందిన సచిన్ గుజ్జార్ రజతం, కేరళకు చెందిన వర్గీస్ కాంస్య పతకంను గెలుచుకున్నాడు. ట్రిపుల్ జంప్ బాలికల విభాగంలో తమిళనాడుకు చెందిన జె కొలెషియా స్వర్ణంను, కేరళకు చెందిన సాంద్రాబాబు రజతంను, తమిళనాడులకు చెందిన తబిత కాంస్యంను గెలుచుకున్నారు. షాట్‌పుట్ బాలికల పోటీల్లో హర్యానాకు చెందిన పూజా స్వర్ణం గెలుచుకోగా అదే రాష్ట్రా నికి చెందిన రేఖ కాంస్య పతకంను గెలుచుకుంది. తమిళనాడుకు చెందిన అజ్నిసి సుసాన్ రజతంను గెలుచుకుంది.

అంబటి రాయుడుపై

రెండు మ్యాచ్‌ల నిషేధం



న్యూఢిల్లీ: హైదరాబాద్ క్రికెట్ జట్టు కెప్టెన్ అంబటి రాయుడిపై బీసీసీఐ రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని విధించింది. సయీద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా జనవరి 11 న కర్నాటకతో ఆడుతున్న సమయంలో రాయుడు కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించాడని బీసీసీఐ పేర్కొంటూ బుధవారం నిషేధం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిషేధంతో రాయుడు విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా హైదరాబాద్‌లో తొలి రెండు మ్యాచుల్లో ఆడలేకపోతాడని బీసీసీఐ తన ప్రకటనలో వివరించింది. రాయుడు నిబంధనలు ఉల్లంఘించాడని ఫీల్డ్ అంపైర్లు అభిజిత్ దేశ్‌ముఖ్, ఉల్హాస్ విఠల్‌రావు గాంధీ, థర్డ్ అంపైర్ అనిల్ దండేకర్ బీసీసీఐలో ఫిర్యాదులు నమోదు చేశారు.

కర్నాటకతో మ్యాచ్ సాగుతున్నప్పుడు హైదరాబాద్ మిడ్ వికెట్ ఫీల్డర్ మెహిదీ హసన్ పాదం బౌండరీ తాడును తగిలింది. ఈ విషయాన్ని ఫీల్డులో ఉన్న అంపైర్లు థర్డ్ అంపైర్‌తో సంప్రదించకనే బౌండరీ బదులు రెండు పరుగులు ఇచ్చారు. కర్నాటకకు రెండు పరుగులు ఇవ్వడంతో కర్నాటక ఇన్నింగ్స్ 205/5 వద్ద ముగిసింది. దీనితో అంపైర్ల తప్పిదంతో తాము నష్టపోయామని హైదరాబాద్ కెప్టెన్ వాగ్వాదానికి దిగడంతో సమస్య రాజుకుంది. హైదరాబాద్ 20 ఓవర్లలో 203/9 సాధించి ఓడిపోయింది. రాయుడు ఈ అంశాన్ని మ్యాచ్ అనంతరం ఈ అంశాన్ని అంపైర్ల వద్దకు తీసుకెళ్లాడు. దీనితో రెండో మ్యాచ్ నిర్వహణ ఆలస్యమైంది.

నాకు విశ్రాంతి అవసరం

బీఏఐకి సైనా లేఖ

న్యూఢిల్లీ : ఈ ఏడాది రానున్న ప్రధాన టోర్నీల్లో గెలుపొందడానికి తనకు కొంత విశ్రాంతి అవసరమని వ్యాఖ్యా నించింది సైనా. మలేసియాలోని అలోర్ సెటార్‌లో జరిగే ఆసియా టీం ఛాంపియన్‌షిప్ నుంచి తనను ఉపసంహ రించాలంటూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ)కు సైనా లేఖ రాసింది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.